అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
బుధవారం 31-07-2024
సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 162 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50



వచ్చే బడ్జెట్ సమావేశాలు

20 రోజులు పెట్టండి

- మా వైపు నుంచి సంపూర్ణ సహకారం
- ప్రభుత్వానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వచ్చే బడ్జెట్ సెషన్‌ను 20 రోజులు నిర్వహించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వానికి సూచించారు. మంగళవారం సభ ప్రారంభం కాగానే స్పీకర్ అనుమతితో కేటీఆర్ ప్రభుత్వానికి ఈ సూచన చేశారు. బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా సోమవారం అసెంబ్లీ సెషన్ సుదీర్ఘంగా సాగింది. 19 పద్దులను ఒకే రోజు పెట్టి చర్చ జరిపి అప్రూవ్ చేసుకునేందుకు మంగళవారం తెల్లవారుజామున 3 గంటల వరకు సభను నిర్వహించారు. ఐతే వచ్చేసారి మాత్రం ఇలా ఒకే రోజు ఎక్కువ పద్దులు పెట్టకుండా సభ నిర్వహించేలా ప్లాన్ చేయాలని కేటీఆర్ కోరారు. ఈ సారి కొత్తగా 57 మంది ఎమ్మెల్యేలుగా సభలో అడుగుపెట్టారు. వారందరికీ మాట్లాడే అవకాశం ఇవ్వాలంటే సమావేశాలను ఎక్కువ రోజులు నిర్వహించాలన్నారు. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో రోజుకు రెండు, మూడు పద్దులనే పెడితే సభ్యులకు, అదే విధంగా సమాధానం ఇచ్చేందుకు మంత్రులకు కావాల్సినంత సమయం ఉంటుందని సూచించారు. వచ్చే బడ్జెట్ సెషన్‌ను 20 రోజులు నిర్వహించేందుకు తమ వైపు నుంచి పూర్తి మద్దతు ఉంటుందని మంత్రి శ్రీధర్ బాబుకు కేటీఆర్ తెలిపారు.

12 రోజుల్లో రూ.12 వేల కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

రుణాలను మాఫీ చేస్తున్నట్టు సీఎం ప్రకటించారు. మొత్తం 6.40 లక్షల మంది రైతుల రుణ ఖాతాల్లో రూ.6198 కోట్లు జమ చేస్తున్నామని చెప్పారు. రుణవిముక్తి పొందిన లక్షలాది రైతులు తమ ఇండ్లలో పండుగ చేసుకుంటుంటే తమ జన్మ ధన్యమైందని అన్నారు. రైతు రుణమాఫీ పథకంలో భాగంగా జులై 18న తొలి విడతగా రూ. లక్ష లోపు రుణాలున్న రైతుల రుణాలను ప్రభుత్వం మాఫీ చేసిందన్నారు. రాష్ట్రంలో మొత్తం 11 లక్షల మంది రైతులకు రూ.6098 కోట్లు మాఫీ చేసిందనీ, 12 రోజుల వ్యవధిలోనే రెండో విడతగా మరో రూ.6198 కోట్లు విడుదల చేశామన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధికార పార్టీ ఎమ్మెల్యేలతో పాటు సీపీఐ, బీజేపీ ఎమ్మెల్యేలు సైతం పాల్గొన్నారు. పార్టీలకతీతంగా ఈ వేడుకలో పాలుపంచుకున్న నేతలందరికీ ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. వ్యవసాయం దండుగ కాదు.. పండుగ చేసి చూపిస్తామని 2022 మే ఆరో తేదీన కాంగ్రెస్ పార్టీ వరంగల్ రైతు డిక్లరేషన్‌లోనే చెప్పిందని సీఎం గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఎనిమిది నెలల్లోనే రైతు రుణమాఫీ అమలు చేశామని చెప్పారు.

నెహ్రూ, శాస్త్రితోనే హరిత విప్లవం : సీఎం

జవహర్ లాల్ నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రితోనే దేశంలోనే హరిత విప్లవం వచ్చిందని సీఎం చెప్పారు. జైజవాన్, జైకిసాన్ నినాదాలతో దేశ భద్రత, ఆహార భద్రతకు ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిచ్చిందని గుర్తు చేశారు. రైతులకు మేలు చేసేందుకే భాక్రానంగల్, నాగార్జునసాగర్ వంటి ప్రాజెక్టులు నిర్మించిందనీ, పేద రైతులకు తక్కువ వడ్డీలకు రుణాలిచ్చేందుకు ఇందిరమ్మ బ్యాంకుల జాతీయికరణ చేసిందన్నారు. సోనియా గాంధీ నేతత్వంలోని మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం ఆహార భద్రత చట్టం తెచ్చిందనీ, రూ.72 వేల కోట్ల రుణాలు మాఫీ చేసి రైతులను ఆదుకుందని గుర్తు చేశారు. విత్తనాలు, ఎరువుల సబ్సిడీ, ఉచిత విద్యుత్, పంటల బీమా, మద్దతు ధరలను అందించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు గత ప్రభుత్వం అప్పుల పాల్జేసి తెలంగాణను తాకట్టు పెట్టిందని ముఖ్యమంత్రి అన్నారు. తాకట్టు నుంచి తెలంగాణను విడిపించి, రుణాల భారం తగ్గించేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని గుర్తు చేశారు. గత ప్రభుత్వం చేసిన రూ.7 లక్షల కోట్ల అప్పులకు తమ ప్రభుత్వం ఈ ఎనిమిది నెలల్లో రూ.43 వేల కోట్లు కిస్తీలు చెల్లించిందని చెప్పారు. రుణవఫీకి నిధులు జమ చేసిన ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క, ఆర్థిక శాఖ అధికారుల బందానికి ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. అటు రైతు రుణమాఫీతో పాటు ఆరు గ్యారంటీల్లో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, ఆరోగ్య శ్రీ, 200 యూనిట్ల లోపు ఉచిత గహ విద్యుత్తు, రూ.500కు గ్యాస్ సిలిండర్ పథకాలను అమలు చేసి చిత్తశుద్ధి చాటుకున్నామని అన్నారు.

ప్రజల మేలు కోసమే : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లుగా గాలికి వదిలేసిన పంటల బీమా పథకాన్ని మేము అమలు చేయబోతున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. రెండు దశల్లో 17.91 అకౌంట్లకు 16.29 లక్షల కుటుంబాలకు 12,289 కోట్లు విడుదల చేస్తున్నామన్నారు. ఈ సభలో సీఎం ఒక రైతుకు చెక్ అందజేయగానే రాష్ట్ర వ్యాప్తంగా రైతులందరి ఖాతాలో రుణమాఫీ నిధులు జమ చేశామన్నారు. పీసీసీ అధ్యక్షుడుగా సీఎం రేవంత్‌రెడ్డి నాడు, సీఎల్పీ నేతగా నేను మా నాయకుడు రాహుల్‌గాంధీ హెలికాప్టర్‌లో వెళ్తూ రూ. 2లక్షల రుణమాఫీ గురించి చర్చించి వరంగల్ డిక్లరేషన్‌లో ప్రకటిస్తే ఇది సాధ్యమా? అని అంతా ఆశ్చర్యపోయారని చెప్పారు. ధనిక రాష్ట్రంగా అప్పగిస్తేనే రుణమాఫీ చేయలేదనీ, కాంగ్రెస్ వాళ్ళు చేస్తారా అని అందరు అన్నారని చెప్పారు. మాకు సంకల్ప బలం ఉందనీ, ఆ బలాన్ని నిజం చేస్తూ పార్లమెంటు ఎన్నికల ముందు సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు చివరిలోగా రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తున్నామన్నారు. కేవలం రుణమాఫీకే పరిమితం కాలేదనీ, రైతు బీమా కింద 42 లక్షల మంది రైతులకు సంబంధించిన 1580 కోట్ల ప్రీమియంను రైతుల తరపున ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. దేశ చరిత్రలో, బ్యాంకింగ్ చరిత్రలో ఒకేసారి ఇంత మొత్తం బ్యాంకుల్లో జమ కావడం విశేషమన్నారు. బ్యాంకర్లు విశాల హదయంతో రైతులకు సహకరించి వెనువెంటనే రుణాలు ఇవ్వాలనీ, ఇంతటి బహత్కర కార్యక్రమం అమలు చేయడానికి అవకాశం ఇచ్చిన ఏఐసీసీతోపాటు సీఎంకు, సహచర మంత్రులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్‌గౌడ్, ధనసరి అనసూయ సీతక్క, కొండా సురేఖ, కోమటిరెడ్డి, వెంటక్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, డి శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ్మ, ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు తదితరులు పాల్గొన్నారు.



బ్యాంకులకు కార్పొరేట్ సంస్థలు అప్పులు ఎగవేశాయి : సీఎం

దేశంలో కొన్ని కార్పొరేట్ సంస్థలు బ్యాంకుల నుంచి అప్పులు తీసుకుని మోసం చేశాయని సీఎం అన్నారు. గడిచిన పదేండ్లలో బ్యాంకులకు దాదాపు రూ. 14 లక్షల కోట్లు ఎగవేశాయని తెలిపారు. పది మందికి అన్నం పెట్టే రైతులు మాత్రం పంట దిగుబడి రాక, గిట్టుబాటు ధర లేక అప్పులు చెల్లించలేక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఆత్మగౌరవం దెబ్బతిని కొందరు రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డ విషాద ఘటనలు చోటు చేసుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే రైతుల కుటుంబాల్లో ఆనందం నింపాలనే రూ.రెండు లక్షల రైతు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వం రూ.లక్ష రైతు రుణమాఫీ కూడా సరిగ్గా చేయలేక పోయిందనీ, మొదటి సారి అధికారంలో ఉన్నపుడు నాలుగు విడతల్లో మాఫీ చేస్తే, రైతులు తమ అప్పుకు మించి మిత్తీలు కట్టాల్సిన పరిస్థితి వచ్చిందని గుర్తు చేశారు. రెండో సారి అదే హామీతో అధికారంలో వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.19 వేల కోట్లు ఇస్తామని చెప్పి, రూ.12 వేల కోట్లు మాత్రమే విడుదల చేసిందన్నారు. దాదాపు రూ.7 వేల కోట్లు రైతులకు రుణమాఫీ చేయకుండా ఎగవేసిందని గుర్తు చేశారు. అప్పుల్లో కూరుకుపోయిన తెలంగాణ ప్రభుత్వం ఎలా రుణమాఫీ చేస్తుందోనంటూ కొందరు తమను అవహేళన చేశారనీ, శాపనార్థాలు పెట్టారని అన్నారు. కానీ తమ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు నెలలోగా రుణమాఫీకి ప్రణాళిక ప్రకారం నిధులను సమీకరించిందని చెప్పారు. ఇది తమ ప్రభుత్వం చిత్తశుద్ధి, నిబద్ధతకు నిదర్శనమని అన్నారు.

నిధులివ్వకపోతే

మహారాష్ట్రలో కలిపేయండి

- నల్లగొండ, ఖమ్మం జిల్లాలకే నిధులిస్తే ఎట్లా?
- ఉత్తర తెలంగాణ ప్రాజెక్టులపై వివక్ష : బీజేపీ సభ్యులు పాల్వాయి హరీశ్‌బాబు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వెనుకబడిన ప్రాంతమైన కొమ్రంభీమ్ అసిఫాబాద్ జిల్లాకు నిధులివ్వని పక్షంలో మహారాష్ట్రలో కలిపేయాలని బీజేపీ సభ్యులు పాల్వాయి హరీశ్‌బాబు డిమాండ్ చేశారు. శాసనసభలో మంగళవారం సాగునీటి రంగం, సివిల్ సప్లయ్‌పై జరిగిన పద్దులపై ఆయన చర్చలో పాల్గొని మాట్లాడారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిపై కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. తుమ్మిడిహెట్టి దగ్గర వాటర్‌ఫ్లో ఉండదనే ప్రచారం అబద్ధమన్నారు. అక్కడ అంబేద్కర్, ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును నిర్మించాలనీ, జగన్నాథ్‌పూర్, అడ ప్రాజెక్టులను పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కింద పారింది ఎంతనో తెల్వదుగానీ..తరుచూ బ్యాక్‌వాటర్‌తో ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలోని భూములు ఆగం అవుతున్నాయని వాపోయారు. మంథని, మంచిర్యాల పట్టణాల్లోకి కూడా ఆ నీళ్లు వస్తున్నాయని తెలిపారు. గత ప్రభుత్వం కేవలం దక్షిణ తెలంగాణకు నీళ్ల తరలించి ఉత్తర తెలంగాణకు తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. ఈ ప్రభుత్వమూ నిధుల కేటాయింపులో వివక్ష చూపుతున్నదనీ, ఉత్తర తెలంగాణ ప్రాజెక్టులను పట్టించుకోవడం లేదని చెప్పారు. సీఎంఓ కార్యాలయానికి ఎప్పుడు వెళ్లినా అక్కడ ఖమ్మం, నల్లగొండ జిల్లా నేతలే ఉంటున్నారనీ, ఆ రెండు జిల్లాలకే నిధులు పోతే ఎట్లా? అని ప్రశ్నించారు. కొమ్రంభీమ్ అసిఫాబాద్ జిల్లాలో పలు రోడ్ల నిర్మాణం కోసం రూ.12 కోట్ల నిధులను అటవీశాఖకు చెల్లించాలని కోరారు.

సభకు కొత్తోణ్ని..

జర మాట్లాడనీయండి

- బీఆర్ఎస్ సభ్యులు అనిల్‌జాదవ్
- వెన్నుతట్టి ప్రోత్సహించిన కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



'సభకు కొత్తోణ్ని. జర మాట్లాడనీయండి' అంటూ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ స్పీకర్‌ను వేడుకున్నారు. ఆయన ప్రసంగం మొదలు పెట్టగానే బీఆర్ఎస్ సభ్యులు కె.తారక రామారావు (కేటీఆర్) దగ్గరకెళ్లి పక్కనే కూర్చున్నారు. మాట్లాడటం పూర్తవ్వగానే 'బాగా మాట్లాడావు' అంటూ వెన్నుతట్టి ప్రోత్సహించారు. ఎస్సీ,ఎస్టీల కోసం తమ ప్రభుత్వం ఎంతో చేసిందన్నారు. బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలనీ, డిగ్రీకాలేజీ, ఫైర్‌స్టేషన్లను ఏర్పాటు చేయాలని విన్నవించారు. తన నియోజకవర్గంలో ఏర్పడ్డ మూడు కొత్త మండలాల్లో ప్రభుత్వ కార్యాల యాలను నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను ఎత్తిచూపారు. తెల్లరేషన్‌కార్డులను ఇవ్వాలని కోరారు. అంతా బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి జరిగిందనీ, కొత్త ప్రభుత్వం ఇంత వరకూ ఏమీ చేయలేదన్నారు. చివరకు మంత్రి సీతక్క తండ్రికి పోడుపట్టాలను ఇచ్చింది కూడా బీఆర్ఎస్ ప్రభుత్వమేనని చెప్పారు.

వైటీడీఏ అక్రమాలపై

విచారణ జరపాలి

కాంగ్రెస్ సభ్యులు బీర్ల ఐలయ్య

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాదగిరి గుట్ట టెంపుల్ డెవలంప్‌మెంట్ అథారిటీ (వైటీడీఏ) అక్రమాలపై విచారణ జరిపించాలని కాంగ్రెస్ శాసనసభ్యులు బీర్ల ఐలయ్య ప్రభుత్వాన్ని కోరారు. వైటీడీఏ పేరిట భూములు సేకరించిన ప్రభుత్వం నిర్వాసితులను పట్టించుకోలేదని విమర్శించారు. గత ప్రభుత్వం యాదగిరి గుట్టపై సత్రాలు లేకుండా చేసిందనీ, ఇప్పటికైనా గుట్ట కింది భాగంలో వెయ్యి గదులను నిర్మించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనాది నుంచి భక్తులకు సేవలందిస్తున్న నాయి బ్రాహ్మణులను, రజకులను క్రమబద్ధీకరించాలని కోరారు. అర్చకులు, ఉద్యోగులను పర్మెంట్ చేస్తామంటూ ఊదరగొట్టిన బీఆర్ఎస్ సర్కారు సగం మందిని పర్మెంట్ చేసి మిగతా వారిని విస్మరించిందన్నారు. భద్రాచలం, వేములవాడ దేవాలయాలను కేసీఆర్ అభివృద్ధి చేయలేదని విమర్శించారు. ఆలేరు నియోజకవర్గంలో తాగునీరు, సాగునీటి కొరత ఉందన్నారు. మిషన్ భగీరథ పైపులను నాటి సర్కారు పూర్తి చేయలేదని విమర్శించారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంలో 16 కి.మీ పైపులైన్ల పనులు కొనసాగుతున్నాయన్నారు. బస్వాపూర్‌కు నీళ్లు ఇవ్వకుండా మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి సూర్యాపేటకు తరలించారని విమర్శించారు.

వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ పెట్టాలి

- ఎమ్ఎస్ స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలు చేయాలి
- ప్రతి ఎకరానికీ సాగునీరందించేలా ప్రణాళికలుండాలి : కూనంనేని

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ పెట్టాలని సీపీఐ సభ్యులు కూనంనేని సాంబశివరావు కోరారు. మంగళవారం అసెంబ్లీలో పద్దులపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో రోజురోజుకీ పెరిగిపోతున్న రైతు ఆత్మహత్యలపై ఆందోళన వెలిబుచ్చారు. 2014 నుంచి ఇప్పటివరకూ దేశంలో 11 లక్షల మంది రైతులు, తెలంగాణలో 7300 మంది అన్నదాతలు ఆత్మహత్య చేసుకున్నారని వివరించారు. ఎమ్ఎస్.స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలనీ, రైతులకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. పారిశ్రామికరంగానికి ఇస్తున్నట్టుగానే వ్యవసాయానికీ ప్రాధాన్యత కల్పించాలని సూచించారు. నియోజకవర్గ కేంద్రాలను, మండలాలను సెమీనగరాలు అభివృద్ధి చేసి అగ్రిబేస్డ్ పరిశ్రమలకు ప్రాధాన్యమివ్వాలనీ, గ్రామీణ, మండల ప్రాంతాల్లో కార్పొరేట్‌స్థాయి ఆస్పత్రులను, స్కూళ్లను కట్టించాలని కోరారు. అప్పుడే గ్రామీణ ప్రజలకు ఉపాధి అవకాశాలు, మెరుగైన సౌకర్యాలు పెరిగి పట్టణాలకు వలసలు తగ్గుతాయన్నారు. రాష్ట్రంలో ప్రతి ఎకరానికీ సాగునీరందించేలా ప్రణాళికలు రూపొందించుకుని ముందుకుసాగాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందుకెళ్లాలనీ, కేంద్రం నుంచి వీలైనంత మేరకు ఎక్కువ నిధులు రాబట్టుకునే ప్రయత్నం చేయాలని చెప్పారు. అమెరికాలో మాదిరిగా రైతుల దగ్గరకు వచ్చి ఉద్యోగాలు చేయాల్సిన పరిస్థితి రావాలని ఆకాంక్షించారు. పంటల విధానంలోనూ మార్పులు తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

పోడుపట్టా నా తండ్రి హక్కు

మంత్రినైనా నా తల్లిదండ్రులు పోడు సాగు చేసుకుంటున్నారు



- ఆదివాసీ కాబట్టే నాపై ఆరోపణలు
- చాలామంది మంత్రులు, ఎమ్మెల్యేలు రైతుబంధు తీసుకున్నారు
- దీనిపై ఇంకోసారి ఎవరైనా మాట్లాడితే బాగుండదు : మంత్రి సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆదివాసీ బిడ్డగా తన తండ్రి పోడుభూమి పట్టా పొందటం ఆయన హక్కని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ(సీతక్క) నొక్కిచెప్పారు. చివరకు మంత్రి సీతక్క తండ్రికి కూడా కేసీఆరే పోడుభూమి పట్టా ఇచ్చారంటూ అసెంబ్లీలో బీఆర్ఎస్ సభ్యులు అనిల్‌జాదవ్ పద్దులపై చర్చ సందర్భంగా చేసిన వ్యాఖ్యలపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. అడవులను నరుక్కుని సాగుచేసుకుంటున్న ఆదివాసీలకు భూములు కేటాయించేందుకు యూపీఏ ప్రభుత్వం చట్టం తీసుకొచ్చిందన్నారు. దాని ప్రకారం తన తల్లిదండ్రులు పోడు పట్టా పొందడానికి అర్హులు కాబట్టి భూమి పట్టా వచ్చిందని తెలిపారు. అంతేతప్ప అది ఎవరో ఇస్తేనో, దయాదాక్షిణ్యాల వల్లనో వచ్చింది కాదని స్పష్టం చేశారు. ఆదివాసీని కాబట్టే తనపై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో చాలామంది మంత్రులు, ఎమ్మెల్యేలు లక్షల రూపాయల రైతుబంధు తీసుకున్నారు గదా? వారిని ప్రశ్నించగలరా? అని నిలదీశారు. మంత్రినైనా ఇప్పటికీ అడవుల్లో పోడు చేసుకుని బతుకుతున్న తన తల్లిదండ్రులపై ఇలా మాట్లాడటం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. తన తల్లిదండ్రులకు హక్కుగా వచ్చిన పోడుభూమి పట్టాపై ఇంకోసారి మాట్లాడితే బాగుండదని హెచ్చరించారు. మొన్నమొన్ననే బీఆర్ఎస్‌లోకి వెళ్లిన అనిల్‌జాదవ్ కూడా ఇలా మాట్లాడటం సరిగాదని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చిన రిజర్వేషన్ వల్లనే ఆయన ఎమ్మెల్యే అయ్యారనీ, చాలా మంది గిరిజనులకు, ఆదివాసీలకు ఉద్యోగాలు లభించాయని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్ల కాలంలో మైనార్టీలకు ఇస్తామన్న రిజర్వేషన్లు ఏమయ్యాయని నిలదీశారు. ఎనిమిది నెలల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏమిచ్చిందో చెప్పడానికి తాను సిద్ధమనీ, గిరిజనులకు, ఆదివాసీలకు కేసీఆర్ సర్కార్ ఏమిచ్చిందో చెప్పాలని సవాల్ విసిరారు.

బీఆర్ఎస్ సభ్యురాలు కోవ లక్ష్మి మాట్లాడుతూ.. తన నియోజకవర్గంలో అనేక సమస్యలున్నా యంటూ ఏకరువు పెట్టారు. ప్రతిగా సీతక్క స్పందిస్తూ వెనుక బడిన వర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ లక్ష్యమని స్పష్టం చేశారు. గిరిజన చట్టాలు, రిజర్వేషన్లను కల్పించింది కూడా తమ పార్టీయేనని చెప్పారు. తాను కూడా ఎస్టీ హాస్టల్‌లోనే చదువుకున్నానని గుర్తు చేశారు. రాష్ట్రంలో అనర్హుల చేతుల్లో పోడు భూములున్నాయని తెలిపారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూముల్లో అవకతవ కలను సవరించి పోడు సాగుదారుల సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి ఈ సందర్భంగా హామీనిచ్చారు.

పద్దులపై చర్చలో పాల్గొన్న కాంగ్రెస్ సభ్యుడు గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ... సాగుచేసే రైతులకూ రైతుభరోసా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. బీజేపీ సభ్యుడు కె. వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ... వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థను నిర్వీర్యం చేయడం సబబుకాదని అన్నారు. రుణమాఫీ చేయటాన్ని ఆయన ఆహ్వానించారు. కాంగ్రెస్ సభ్యురాలు పర్ణికారెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల అభివృద్ధికి కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అధికార పార్టీకే చెందిన మరో సభ్యురాలు యశస్విని రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ సర్కారు ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందన్నారు. దేవాదుల కాల్వల మరమ్మతులను చేపట్టాలని ఆమె కోరారు. బీఆర్ఎస్ సభ్యుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, పంచాయతీరాజ్‌కు నిధుల కేటాయింపుల ప్రాధాన్యతనివ్వాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సభ్యుడు మందుల సామేలు మాట్లాడుతూ, కాంగ్రెస్‌తోనే సామాజిక అభివృద్ధి సాధ్యమన్నారు. తన నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

మహిళల హామీలు అమలు చేయాలి

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి
- కరీంనగర్‌లో మహిళా సమస్యలపై న్యాయ నిపుణులతో కౌన్సెలింగ్ సెంటర్



నవతెలంగాణ-కరీంనగర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. కరీంనగర్ పట్టణంలో నిర్వహించిన ఐద్వా రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణా తరగతుల ముగింపు అనంతరం ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ స్థాయి రాష్ట్ర రాజకీయ శిక్షణా తరగతులకు ఆతిథ్యం ఇచ్చిన ఐద్వా కరీంనగర్ జిల్లా కమిటీకి అభినందనలు తెలిపారు. మహిళా ఉద్యమానికి, రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణా తరగతుల జయ ప్రదానికి సహకరించిన సానుభూతిపరులకు, ప్రజానీకానికి, మీడియా మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. మహిళలను చైతన్య పరుస్తూ మహిళా సమస్యల పరిష్కారానికి అనేక కర్తవ్యాలను రూపొందించామని, కర్తవ్యాల అమలుకు ఐక్య పోరాటాలు కొనసాగిస్తామని చెప్పారు. మహిళలపై లైంగిక దాడులు, భ్రూణ హత్యలు, వరకట్న వేధింపులను అరికట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని, బెల్ట్ షాపులు, డ్రగ్ మాఫియా, పోర్న్ వెబ్‌సైట్‌లను అరికట్టి, దశలవారీగా మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై అన్ని మహిళా సంఘాలతో ఐక్య కూటమి ఏర్పాటు చేసి పోరాడుతామన్నారు. ఇక నుంచి కరీంనగర్ ముకుందలాల్ మిశ్రా భవన్‌లో మహిళా సమస్యలపై న్యాయ నిపుణులతో కౌన్సెలింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తామని, మహిళలకు అండగా ఐద్వా కరీంనగర్ జిల్లా కమిటీ పని చేస్తుందని తెలిపారు. ఈ సమా వేశంలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి నాగమణి, ఉపాధ్యక్షులు అన్నపూర్ణ, రోజారాణి, దేవేంద్ర, లావణ్య, సంధ్య, యమున, లక్ష్మి, రజిత పాల్గొన్నారు.

క్రీడలను బీఆర్ఎస్ సర్కారు నిర్లక్ష్యం చేసింది

- పీఈటీ, స్పోర్ట్స్ పీరియడ్, గ్రౌండ్ లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి : కాంగ్రెస్ సభ్యులు మక్కాన్‌సింగ్ రాజ్ ఠాగూర్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పదేండ్ల పాలనలో బీఆర్ఎస్ సర్కారు క్రీడలను తీవ్ర నిర్లక్ష్యం చేసిందని కాంగ్రెస్ సభ్యులు మక్కాన్‌సింగ్ రాజ్ ఠాగూర్ విమర్శించారు. క్రీడ ప్రాంగణాలను ఆయా గ్రామాల బొద్దల గడ్డల్లో నిర్మించిందని తెలిపారు. అవి ఎందుకు పనికి రాకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం శాసనసభలో బడ్జెట్ పద్దులపై ఆయన మాట్లాడారు. యువతను సన్మార్గంలో నడిచేందుకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు. ఆ దిశగా బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు రూ. 361 కోట్లు కేటాయించిందని గుర్తు చేశారు. అదే విధంగా హకీంపేట స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కోరారు. దీంతోపాటు గచ్చిబౌలి, యుసూఫ్‌గూడ, ఎల్బీ స్టేడియాలను అంతర్జాతీయ స్థాయిలో మరమ్మత్తులు చేయాలని విజ్ఞప్తి చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం క్రీడల అభివృద్ధి కోసం కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి, శ్రీనివాసగౌడ్, ఎర్రబెల్లి దయాకరరావుతో కమిటీ వేసి చేతులు దులుపుకున్నదని తెలిపారు. అప్పటి ప్రభుత్వానికి క్రీడలపై ఒక విధానం కూడా లేదని విమర్శించారు. ఇటీవల పతకాలు సాధించిన మను బాకర్, నిఖత్ జరీన్, ఇషాసింగ్, ఆకుల శ్రీజ తదితరులకు ఆయన శుభాకాంక్షలు, అభినందలు తెలిపారు.

బీఆర్ఎస్ అండతో కాలుష్య పరిశ్రమలు

కాంగ్రెస్ సభ్యులు అనిరుధ్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



పదేండ్ల బీఆర్ఎస్ సర్కారు అండతో కాలుష్య కారక పరిశ్రమలు కొనసాగాయని కాంగ్రెస్ సభ్యులు అనిరుధ్‌రెడ్డి విమర్శించారు. ఎన్‌జీటీ ప్రకారం రెడ్ కేటగిరీ పరిశ్రమలు జన వాసాల మధ్య ఉండకూదన్నారు. పటాన్‌చెరువు, బొల్లారం, కూకట్‌పల్లి ప్రాంతాల్లో ఇంకా కొనసాగుతున్నాయని తెలిపారు. వాటిపై కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదు చేస్తే అధికారులు ఆయా పరిశ్రమల యాజమానులకు సమాచారమిచ్చి పరిశీలనకు పోతున్నారని ఆరోపించారు. హరితహారం భాగంగా ఇతర రాష్ట్రాలు, దేశాల్లో నిషేధించిన కోన కార్పస్ అనే ప్రమాదకరమైన మొక్కను నాటారని తెలిపారు. ఆ మొక్కలు తెలంగాణ భవన్ చుట్టూ కూడా ఏపుగా పెరిగాయనీ, వాటి గాలి పీల్చడం అనేక వ్యాధులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

బుధవారం 31-07-2024

సమగ్ర తెలుగు దినపత్రిక


సంపుటి : 10 | సంచిక : 162 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

మను చరిత్ర



- పారిస్‌లో రెండో కాంస్యం నెగ్గిన మను బాకర్
- మిక్స్‌డ్ టీమ్‌లో సరబ్జోత్‌తో కలిసి పతక ప్రదర్శన

వివరాలు ఆటలులో.



కేరళ ప్రగతికి లెఫ్ట్ సర్కార్ చేస్తున్న ప్రయత్నాలకు ఎన్నో ఆటుపోట్లు ఎదురవుతున్నాయి. అన్ని రంగాల్లో దేశానికి ఆదర్శంగా నిలుస్తున్న కేరళకు ప్రకృతి ప్రకోపాలు పెను విషాదాలుగా మారుతున్నాయి. తాజాగా కేరళను పెనువిషాదం ముంచెత్తింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కొండచరియలు విరిగిపడి 123 మంది జల సమాధి అయ్యారు. ఇలా ఊహించని జల విలయాలు కేరళను తరచూ అతలాకుతలం చేస్తున్నాయి. అంతకు ముందు నిఫా, కరోనా వైరస్‌లు కోరలు విప్పినా.. ప్రణాళికా బద్ధమైన చర్యలతో నియంత్రించ గలిగిన పినరయి సర్కార్‌కు ఈ జల ప్రళయాలు సవాలుగా మారాయి.

కేరళలో పెను విషాదం

కొండచరియలు విరిగిపడి 123 మంది సజీవసమాధి

- పలువురికి గాయాలు
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- సహాయ కార్యక్రమాలు ముమ్మరం
- రక్షణ చర్యల్లో లెఫ్ట్ సర్కార్

వాయనాడ్ : కేరళలో వర్ష బీభత్సం విధ్వంసం సృష్టించింది. వాయనాడ్ జిల్లాలోని మెప్పాడి సమీప ప్రాంతాలలో మంగళవారం తెల్లవారుజామున పెద్ద ఎత్తున కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ దుర్ఘటనలో 123 మంది సజీవ సమాధి అయ్యారు. 128 మంది గాయపడ్డారు. ఇప్పటి వరకూ 93 మృతదేహాలను వెలికితీశారు. అనేక కుటుంబాల ఆచూకీ తెలియడం లేదు. మృతుల సంఖ్య ఇంకా పెరగవచ్చునని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరద నీటిలో అనేక మృతదేహాలు కొట్టుకుపోతున్నాయని ప్రత్యక్షసాక్షులు తెలిపారు. తెల్లవారుజామున రెండు ...11లో


యుద్ధప్రాతిపదికన కేంద్రం సహాయాన్ని అందించాలి

సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో మృతుల కుటుంబాలకు సంతాపం

వాయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ప్రమాదంలో వంద మందికిపైగా మరణించడంపై సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించింది. మృతుల కుటుం బాలకు సానుభూతి ప్రకటించింది. ఈ మేరకు పొలిట్ బ్యూరో ఒక ప్రకటన విడుదల చేసింది. కొండ చరియల కింద ఇంకా అనేక మంది చిక్కుకుపోయారని, భారీ ఆస్తి నష్టం కూడా జరిగిందని తెలిపింది. బాధిత కుటుంబాలకు ...11లో

12 రోజుల్లో రూ.12 వేల కోట్లు

రెండో విడత రుణమాఫీ నిధులు విడుదల • రూ.1.5 లక్షల్లోపు రుణాలున్న 6.40 లక్షల రైతులకు లబ్ది



అసెంబ్లీ నుంచే ఖాతాల్లో జమ

- రైతుల్లో సంతోషంతో నా జన్మ ధన్యమైంది : సీఎం రేవంత్ రెడ్డి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

దేశానికి ఆగస్టు నెలలోనే స్వాతంత్య్రం వచ్చిందనీ, ఈ ఏడాది ఆగస్టులోపే తెలంగాణ లోని రైతులందరూ రుణ విముక్తులయ్యారని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ జులై, ఆగస్టు నెలలు దేశ చరిత్రలోనే లిఖించదగ్గ నెలలని అభివర్ణించారు. కేవలం 12 రోజుల్లో రూ.12 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత తమదేనని అభిప్రాయపడ్డారు. రైతుల సంక్షేమం విషయంలో

కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధిని ఎవరు శంకించలేరనీ, తమ ప్రభుత్వ ప్రణాళికలను ఎవరూ ప్రశ్నించలేరంటూ సవాల్ చేశారు. ఏకకాలంలో రూ.31 వేల కోట్లు కేటాయించి తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ దేశ చరిత్రలోనే కొత్త రికార్డు అని గుర్తు చేశారు. స్వతంత్ర భారతంలో ఇప్పటి వరకు ఏ రాష్ట్రం కూడా ఇంత పెద్ద మొత్తంలో రైతు రుణమాఫీ చేయలేదని తెలియజేశారు. సాధారణంగా ఎన్నికలు వచ్చినప్పుడే కొన్ని పార్టీల నేతలకు రైతులు గుర్తుకు వస్తారని సీఎం అన్నారు. కానీ ఇప్పుడేం ఎన్నికలు, ఓట్లు లేవన్నారు. తమకు రాజకీయ ప్రయోజనాలు కాదనీ, రైతుల ప్రయోజనాలే ముఖ్యమని సీఎం స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగా మంగళవారం మధ్యాహ్నం అసెంబ్లీ ప్రాంగణం నుంచే రైతు రుణమాఫీ రెండో విడుత నిధుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కౌన్సిల్ ఛైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతోపాటు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలందరి సమక్షంలో పలువురు రైతులకు చెక్కులు పంపిణీ చేసి సంబురాలు నిర్వహించారు. ఇదే వేదిక నుంచి రెండో విడతగా రాష్ట్రంలో రూ.1.5 లక్షల్లోపు పంట రుణాలున్న రైతులందరి ...2లో



కేరళ విలయంపై చర్చకు నో

ఎంపీల ఆందోళనతో దిగొచ్చిన రాజ్యసభ ఛైర్మెన్ ధన్కర్


- కేంద్ర రక్షణ, హోం, ఆర్థిక శాఖలు చొరవ తీసుకోవాలి :జాన్ బ్రిట్టాస్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేరళలో కొండ చరియలు విరిగిపడి అనేక మంది మృతి చెందడంపై రాజ్యసభలో చర్చకు రాజ్యసభ ఛైర్మెన్ జగదీప్ ధన్కర్ అనుమతి ఇవ్వలేదు. దీనిపై చర్చ అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. దీంతో కేరళకు చెందిన సీపీఐ(ఎం), సీపీఐ, కేరళ కాంగ్రెస్ ఎంపీలు ఆందోళనకు దిగారు. వీరి ఆందోళనతో మాట్లాడేందుకు ధన్కర్ అనుమతినిచ్చారు. దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన వాయనాడ్ దుర్ఘటనపై మంగళవారం పార్లమెంటులోనూ చర్చ జరిగింది. రాజ్యసభలో సీపీఐ(ఎం) ఉపనేత జాన్ బ్రిట్టాస్, సీపీఐ(ఎం) ఎంపీలు వి. శివ దాసన్, ఎఎ రహీమ్, సీపీఐ ఎంపీ పి. సంతోష్ కుమార్, కేరళ కాంగ్రెస్ ఎంపీ జోస్ కె. మణి తదితరులు ఈ అంశాన్ని లేవనెత్తారు. అత్యవసరంగా చర్చ జరపాలని కోరుతూ ఎంపీలు ఇచ్చిన నోటీసును స్పీకర్ జగదీప్ ధన్కర్ తిరస్కరించారు. వాయనాడ్ విపత్తు విషయంలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం సామరస్యపూర్వకంగా పనిచేస్తున్నాయని, సభలో చర్చ అవసరం లేదని ధన్కర్ స్పష్టం చేశారు. వాయనాడ్‌లో పెను ...11లో

విద్యుత్ విచారణ కమిషన్ కొత్త ఛైర్మెన్‌గా

జస్టిస్ మదన్ బి. లోకూర్



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలంగాణలో విద్యుత్ విచారణ కమిషన్ కొత్త ఛైర్మెన్‌గా జస్టిస్ మదన్ భీమ్‌రావు లోకూర్ నియమితులయ్యారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆయన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, ఆ తర్వాత సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వం కొత్త ఛైర్మెన్‌ను నియమించింది. ఇంతకుముందు కమిషన్ ఛైర్మెన్‌గా జస్టిస్ నరసింహారెడ్డి వ్యవహరించారు. ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ కొనుగోలుకు, యాదాద్రి, భద్రాద్రి సబ్‌క్రిటికల్ థర్మల్ విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు తెలంగాణలో గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై విచారణకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విచారణ కమిషన్ ఏర్పాటు చేసి ఛైర్మెన్‌గా జస్టిస్ ఎల్.నరసింహారెడ్డిని నియమించింది. విచారణ జరుగుతున్న సమయంలో కమిషన్ ఏర్పాటు, దాని ఛైర్మెన్ నిష్పాక్షికతను సవాల్ చేస్తూ మాజీ సీఎం కేసీఆర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం, కమిషన్ ఛైర్మెన్‌ను మార్చాలని ఆదేశించింది. అదే సమయంలో విచారణ కమిషన్ ఏర్పాటు నోటిఫికేషన్‌ను సైతం కొట్టేయాలన్న కేసీఆర్ వినతిని పరిగణనలోకి తీసుకోలేదు. ఈ పరిణామాల నేపథ్యంలో కమిషన్ ఛైర్మెన్ పదవి నుంచి వైదొలుగుతున్నట్టు జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి తన రాజీనామా లేఖను న్యాయవాది ద్వారా సుప్రీంకోర్టుకు సమర్పించారు. సుప్రీం ఆదేశాల మేరకు కొత్త ఛైర్మెన్‌ను నియమిస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నూతన ఛైర్మెన్‌గా జస్టిస్ మదన్ బి, లోకూర్‌ను నియమించింది.



కదం తొక్కిన ఆశాలు

వైద్యారోగ్య శాఖ కమిషనర్ కార్యాలయం దిగ్బంధం

- ఎర్రటి ఎండను సైతం లెక్క చేయకుండా ఆందోళన
- ఐదు వేల మంది రాకతో స్తంభించిన కోఠి పరిసరాలు
- దిగొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం
- సమస్యలను పరిష్కరిస్తామని కమిషనర్ హామీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆశా కార్యకర్తలు మంగళవారం హైదరాబాద్‌లోని కోఠి వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ (ఎన్‌హెచ్‌ఎమ్) కార్యాలయాన్ని ముట్టడించారు. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆదిలాబాద్ నుంచి మొదలుకుని ఖమ్మం వరకు 33 జిల్లాల నుంచి దాదాపు 5 వేల మందికిపైగా తరలి వచ్చి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఉదయం 11.30 గంటల నుంచి ...10లో

కమిషనర్ హామీతో

ధర్నా విరమణ

తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షులు జయలక్ష్మి

ఆశా వర్కర్ల డిమాండ్లను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ ధర్నా స్థలికి వచ్చి హామీ ఇవ్వడంతో నిరసనను విరమించాం. రూ. 50 లక్షల ఇన్సూరెన్స్ కోసం బ్యాంక్‌లతో మాట్లాడి మూడు నెలల్లో జీవో జారీ చేస్తామని చెప్పారు. మట్టి ఖర్చుల కింద రూ. 50 వేల కోసం ఉత్తర్వులిస్తామనీ, ఆగస్టులోగా ప్రింటెడ్ రిజిస్టర్ అందజేస్తామనీ, పల్స్ పోలియో డబ్బులు వెంటనే చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కనీస వేతనం రూ.18 వేల గురించి ప్రభుత్వానికి విన్నవిస్తామని వెల్లడించారు. మిగతా డిమాండ్లపై కమిషనర్ సానుకూలంగా స్పందించారు. సర్కార్ ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే భవిష్యత్‌లో ఆందోళనను ఉధృతం చేస్తాం.



కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు

అన్యాయం

బీజేపీపై పోరాటంలో కాంగ్రెస్ ముందుండాలి

భువనగిరిలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

నవతెలంగాణ-వలిగొండ

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణను విస్మరించారని, పూర్తిగా అన్యాయం జరిగిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. బడ్జెట్ విషయంలో ప్రజలు బీజేపీని వ్యతిరేకించాలని, కేంద్ర ప్రభుత్వం తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు అన్యాయం చేసిందని చెప్పారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని స్థానిక సాయిగణేష్ ఫంక్షన్‌హాల్‌లో ...11లో

కేజ్రీవాల్ ప్రాణాలకు ముప్పు



- ఆయనను విడుదల చేయాలి : ఇండియా బ్లాక్ నేతల డిమాండ్
- జంతర్ మంతర్ వద్ద ఆందోళన

వివరాలు 10లో



గద్వాల ఎమ్మెల్యే

బ్యాక్ టు బీఆర్ఎస్..

వివరాలు 10లో



బొగ్గు బ్లాకులపై అసెంబ్లీలో తీర్మానం చేయాలి

- వేలం నిలిపేసి సింగరేణికి కేటాయించాలి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్వంద్వ వైఖరి వీడాలి
- సింగరేణి పరిరక్షణ యాత్రలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య


వివరాలు 12లో

ప్రభుత్వ ఖజనాకు విరాళాల గండి

రాజకీయ పార్టీలకు డొనేషన్లపై పన్ను మినహాయింపులు

- 2022-23లో రూ.4000 కోట్ల రాయితీలు

రాజకీయ పార్టీలకు అందించిన విరాళాలకు సంబంధించి కార్పొరేట్ పెద్దలు, సంస్థలకు ఇచ్చిన పన్ను మినహా యింపుల కారణంగా 2022-23 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం రూ.3,967.54 కోట్ల ఆదాయాన్ని కోల్పోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి పార్లమెంటుకు సమర్పించిన కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ మేరకు అంచనాలు వేసింది. 2021-22లో కోల్పోయిన ఆదాయం కంటే ఇది 13 శాతం అధికం. పార్టీలకు అందుతున్న విరాళాలు కూడా పెరుగుతున్నాయని ఈ గణాంకాలు నిరూపిస్తున్నాయి. వాస్తవానికి గత తొమ్మిది సంవత్స రాలుగా ఎన్నికల విరాళాలు పెరుగుతూనే ఉన్నాయి.



న్యూఢిల్లీ : 2021-22లో రాజకీయ పార్టీల విరాళాలకు ఇచ్చిన పన్ను రాయితీలు రూ.3,516.47 కోట్లు. అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే ఇది ఏకంగా 300 శాతం పెరిగింది. 2014-15లో ఈ మొత్తం కేవలం రూ.170.86 కోట్లు మాత్రమే. మొత్తంగా చూస్తే 2014 -15 నుండి తొమ్మిది సంవత్సరాల కాలంలో రాజకీయ విరాళాలపై పార్టీలు పొందిన పన్ను రాయితీల మొత్తం రూ.12,270.19 కోట్లు. 2023-24కు సంబంధించిన సమాచారం ఇంకా బహిర్గతం కాలేదు. ఆదాయపన్ను చట్టం కింద రాజకీయ పార్టీలకు అందించే విరా ళాలపై భారతీయ కంపెనీలు, ...11లో

సంపాదకీయం

పేరులోనే 'సంక్షేమ'ం!

'కాంగ్రెస్ వస్తుంది.. మార్పు తెస్తుంది' అంటూ ఎన్నికలప్పుడు గొప్పగా ప్రచారం చేశారు. తమది నూటికి నూరు శాతం సంక్షేమ ప్రభుత్వమని ఢంకా బజాయించి మరీ చెప్పుకున్నారు. అధికారంలోకి వచ్చారు. కానీ సంక్షేమ హాస్టళ్ల దుస్థితిలో మాత్రం ఎలాంటి మార్పూ తేలేదు. పేరుకే అవి సంక్షేమ హాస్టళ్లు. లోపలంతా క్షామమే. గత పది రోజులుగా కులవివక్ష పోరాట సంఘం (కేవీపీఎస్) చేపట్టిన హాస్టళ్ల అధ్యయన యాత్రలో బయటపడిన పచ్చినిజం ఇది. రాష్ట్రంలో పాఠశాలలు పున:ప్రారంభించి నెలన్నర పూర్తయింది. హాస్టళ్లలో ఈ విద్యాసంవత్సరానికి గాను ప్రవేశాలు కూడా పూర్తయ్యాయి. కానీ హాస్టళ్లు మాత్రం వసతుల లేమీ, అపరిశుభ్రత ఇతర సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి.

నిరుపేద విద్యార్థులకు ఆశ్రయం కల్పించి వారిని ఉన్నత పౌరులుగా

విద్యార్థులకు అందించాల్సిన ఆహార పదార్థాల్లో నాణ్యతా ప్రమాణాలు ఏమాత్రం ఉండటం లేదు. చాలీచాలని భోజనం, టిఫిన్‌తో సరిపెట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. అలాగే ప్రభుత్వ వైద్యాధికారులు హాస్టల్స్‌ను నెలకోసారి సందర్శించి విద్యార్థుల ఆరోగ్య సమస్యల్ని తెలుసుకోవాలనే జీవో కూడా ఉంది. కానీ ఇది ఎక్కడా అమలవడం లేదు. చాలా హాస్టళ్లలో అమ్మాయిలకు రక్షణే లేదు. ఇక కాస్మోటిక్ ఛార్జీల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంతమంచిది. ఎందుకంటే ప్రభుత్వం వీటిని కేవలం మొక్కుబడిగా మాత్రమే చెల్లిస్తోంది.

తీర్చిదిద్దడం సంక్షేమ వసతి గృహాల ప్రధాన ఉద్దేశం. కానీ నేడు వసతి గృహాలన్నీ మురుగుకూపాలను తలపిస్తున్నాయి. పర్యవేక్షించే అధికారులు పట్టించుకోక కంపు కొడుతున్నాయి. ఎక్కడచూసినా విరిగిన కిటికీలు, పగిలిన తలుపులు దర్శన మిస్తున్నాయి. ఆవరణమంతా చెత్తాచెదారం, పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. ఇక శుభ్రత లేని మరుగుదొడ్లతో ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. విద్యార్థుల ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడు లేడు. దీనికితోడు నీళ్ల చారు, పురుగుల అన్నం, అర్ధాకలితో చదువు, పాములు, తేళ్లు, విషపురుగులతో సహజీవనం. ఇది నేటి సంక్షేమ హాస్టళ్ల దుస్థితి. నిజానికి వేసవి సెలవుల్లో దాదాపు నెలన్నర పాటు వసతి గృహాలన్నీ మూసి ఉన్నాయి. తిరిగి తెరిచేనాటికి వాటిని చక్కదిద్దాల్సిన అధికార యంత్రాంగం ఏమాత్రం పట్టించుకోలేదు. ప్రతి ఏడాది విద్యార్థుల పాలిట ఇదే శాపంగా మారుతున్నది. మరోవైపు హాస్టళ్లలో వంట కోసం టెండర్లు పూర్తికాకపోవడం, మెస్ చార్జీలు సరిపోకపోవడంతో విద్యార్థులకు సరైన ఆహారమందని పరిస్థితి నెలకొంది.



రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల పరిధిలో 1750 వసతి గృహాలున్నాయి. అందులో 497 పోస్టు మెట్రిక్, 1,523 ప్రీమెట్రిక్ హాస్టళు.. వీటిలో సుమారు రెండున్నర లక్షల మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఇటీవల పోస్టుమెట్రిక్ హాస్టళ్లలో చేరికలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం వృత్తి విద్యా కోర్సులైన పాలిటెక్నిక్, ఫార్మసీ, ఇంజనీరింగ్ తదితర ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు వీటిలో అడ్మిషన్లు కొనసాగుతాయి. ఇలా వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ వసతుల లేమి మాత్రం వారి చదువు లకు ఆటంకంగా మారింది.

రాష్ట్రంలో 858 సంక్షేమ హాస్టళ్లు అద్దె భవనాల్లోనే ఉన్నాయి. వాటికి చెల్లించాల్సిన అద్దె బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. మొత్తంగా సుమారు రూ.12 కోట్ల మేర బకాయిలున్నట్టు అధికార గణాంకాలే చెబుతున్నాయి. కొన్ని హాస్టల్ భవనాలకు ఏడాదికిపైగా బిల్లులు రావడం లేదని అధికారులు అంటున్నారు. నెలల తరబడి అద్దె చెల్లించకపోవడంతో ఖాళీ చేయాలంటూ యజమానులు ఒత్తిడి చేస్తున్నారని హాస్టళ్ల నిర్వాహకులు ఆవేదన చెందుతున్నారు. కొన్ని చోట్ల సంఖ్యకు మించి విద్యార్థులను చేర్చుకుంటున్నారు. దాంతో కనీస వసతులు లేక విద్యార్థులు నానాయాతన అనుభవిస్తున్నారు.

2016నుండి మెస్‌చార్జీల కోసం కేవలం రూ.1500 మాత్రమే అందిస్తున్నారు. ఆకాశాన్నంటుతున్న ధరలకూ, ప్రభుత్వం ఇస్తున్న మెస్ చార్జీలకు ఏమాత్రం పొంతనలేదు. విద్యార్థులకు అందించాల్సిన ఆహార పదార్థాల్లో నాణ్యతా ప్రమాణాలు ఏమాత్రం ఉండటం లేదు. చాలీచాలని భోజనం, టిఫిన్‌తో సరిపెట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. అలాగే ప్రభుత్వ వైద్యాధికారులు హాస్టల్స్‌ను నెలకోసారి సందర్శించి విద్యార్థుల ఆరోగ్య సమస్యల్ని తెలుసుకోవాలనే జీవో కూడా ఉంది. కానీ ఇది ఎక్కడా అమలవడం లేదు. చాలా హాస్టళ్లలో అమ్మాయిలకు రక్షణే లేదు. ఇక కాస్మోటిక్ ఛార్జీల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంతమంచిది. ఎందుకంటే ప్రభుత్వం వీటిని కేవలం మొక్కుబడిగా మాత్రమే చెల్లిస్తోంది. అమ్మాయిలకు నెలకు ఇస్తున్న రూ.75లతో కనీసం కొబ్బరి నూనె కూడా వచ్చే పరిస్థితి లేదు. అవి కూడా నాలుగు నెలలు నుండి పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇలాంటి ఎన్నో సమస్యలతో ఈ హాస్టళ్ల సంక్షేమం కరువై సంక్షోభంతో అల్లాడుతున్నాయి.

ఈ సమస్యలన్నీ పరిశీలిస్తే సర్కారు ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల సమస్యలను గాలికొదిలేసిందనేది స్పష్టం. పైగా హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని పోరాడుతున్న విద్యార్థి సంఘ నాయకులను అన్యాయంగా అరెస్టు చేస్తున్నారు. దేశ భవితకు పునాదిరాళ్లైన విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరించడం తగదన్నది జనవాక్కుగా ఉంది. కనుక ఇప్పటికైనా రేవంత్ సర్కారు స్పందించాలి. సంక్షేమ హాస్టళ్లల్లో సమస్యలు పరిష్కరించేందుకు పూనుకోవాలి.

బాల్య వివాహాలు - సామాజిక సమస్య

బాల్య వివాహాలపై ఈ నెల15వ తారీఖున కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఓ మైలురాయి లాంటిది. 18 ఏండ్ల లోపు ఉన్న ముస్లిం బాలికకు వివాహం చేశారనే ఆరోపణలపై కోర్టు స్పందించింది."బాల్య వివాహాల నిషేధ చట్టం మతంతో సంబంధం లేకుండా భారతీయ పౌరులందరికీ వర్తిస్తుంది. బాల్య వివాహాల నిషేధ చట్టం 2006, మతంతో సంబంధం లేకుండా భారతీయ పౌరులందరికీ వర్తిస్తుంది. ప్రతి భారతీయుడు మొదట పౌరుడు. ఆ తరువాత మాత్రమే ఒక మతంలో సభ్యుడవుతాడు. పౌరసత్వం మొదటిది. మతం ద్వితీయమైనది." అని తీర్పు ఇవ్వడం చాలా హర్షించదగ్గ విషయం. తీర్పులోని ఒక్కొక్క వాక్యం ఆణిముత్యం లాంటిది. ముందు మనం భారతీయులమనేది విస్తృత అర్థాన్ని ఇస్తుంది. దేశంలో మతమనేది వ్యక్తిగతం. బాల్య వివాహాలు శతాబ్దాలుగా వివిధ సంస్కృతులు, ప్రాంతాలలో కొనసాగుతున్న ఒక లోతైన సామాజిక సమస్య. బాలల శారీరక, మానసిక, సామాజిక శ్రేయస్సుపై బాల్య వివాహం హానికరమైన ప్రభావాలను గుర్తించి అనేక దేశాలు బాలల హక్కులను రక్షించడానికి చట్టాన్ని రూపొందించారు. మన దేశంలో బాల్య వివాహాల సమస్యను పరిష్కరించడానికి, మైనర్ల సంక్షేమాన్ని ప్రోత్సహించడానికి సమగ్ర చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌గా బాల్య వివాహాల నిషేధ చట్టం 2006లో ఆమోదించబడింది.

చట్టం అమలు తీరు

భారతదేశంలో బాల్య వివాహాల ఆచారం మొదటిసారిగా 1929లో బాల్య వివాహ నిరోధక చట్టం-1929 ద్వారా చట్టబద్ధంగా నిషేధించబడింది. ఈ చట్టం 1978లో మహిళలకు కనీస వయస్సును 18 ఏండ్లకు, పురుషులకు 21 ఏండ్లకు పెంచింది. బాల్యవివాహాల నిషేధ చట్టం (2006) 1978 చట్టం స్థానంలో అదే కనీస వయో పరిమితులను కలిగి ఉంది. మనదేశంలో 2.4 కోట్లకు పైగా బాలవధువులు ఉన్నట్లు నివేదికలు తెలుపుతున్నాయి. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్



ఎస్) ప్రకారం ప్రపంచంలోని ఆరు కోట్ల బాల్య వివాహాలలో 40 శాతం మన దేశంలోనే జరుగుతున్నాయి. ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఉమెన్ ప్రకారం ప్రపంచంలో బాల్య వివాహాల రేటులో మనదేశం14వ స్థానంలో ఉంది. విభిన్న వివాహ సంప్రదాయాలు, ఆచారాలు ప్రాంతాలు, కులాలు తెగల ఉండడం వలన దేశంలోని వాయువ్య ప్రాంతంలో ఆగ్నేయం కంటే బాల్య వివాహాల రేటు ఎక్కువగా ఉంది. బీహార్, రాజస్థాన్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలలో బాల్యవివాహాల రేటు ఎక్కువగా ఉంది. పశ్చిమ బెంగాల్, బీహార్, త్రిపురలలో 20 నుండి 24 వయస్సు గల స్త్రీలలో 40శాతం కంటే ఎక్కువ మంది 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు గలవారు ఉన్నారు. కేరళలో 18 ఏండ్లలోపు వివాహం చేసుకున్న మహిళలు శాతం 2015-16లో 7.6 ఉంటే 2019-20లో 6.3శాతానికి చేరుకుంది.ఆరోగ్య సర్వే 2019-21 ప్రకారం 20 నుండి 24 మధ్య వయస్సు గల స్త్రీలలో 23శాతం మంది 18 సంవత్సరాల కంటే ముందే వివాహం చేసుకున్నారు. 2005-06 మూడో సర్వేలో 47శాతం నుండి 2015-16 నాలుగో సర్వేలో 27 శాతానికి తగ్గాయి.

బాల్యవివాహాలు..పరిణామాలు

బాల్యవివాహాలు అమ్మాయిలు, అబ్బాయిలు ఇద్దరినీ ప్రభావితం చేస్తాయి. అయితే ఆడపిల్లలను అసమానంగా ప్రభావితం చేస్తాయి. బాలికల బాల్యాన్ని తుంచి వేస్తాయి. పిల్లలకు విద్య ఆరోగ్యం, దోపిడీ నుండి రక్షణ లాంటి ప్రాథమిక మానవ హక్కులను నిరాకరిస్తాయి.శిశు మరణాలు, ప్రసూతి మరణాలు, లైంగికంగా సంక్రమించే అంటువ్యాధులు వంటి ఆరోగ్య సమస్యలకు ఈ వివాహాలు దారి తీస్థాయి. పేదరికాన్ని శాశ్వతం చేస్తాయి. ఆర్థిక అవకాశాలను పరిమితం చేస్తాయి. మానసిక గాయాలకు దారి తీయవచ్చు. డిప్రెషన్, ఆందోళనకు కారణమవుతాయి. సామాజిక ఒంటరితనాన్ని పెంచుతాయి. ఇది కుటుంబం, సమాజం నుండి వేరుచేయడానికి దారితీస్తుంది. గృహహింస, లైంగిక వేధింపుల ప్రమాదాలను, ప్రసూతి మరణాల రోగాల రేటును పెంచుతాయి. చిన్న తల్లులకు జన్మించిన పిల్లలు అధిక మరణాల రేటును కలిగి ఉంటారు. ఆచారాలు సంప్రదాయాలు, పితృస్వామ్య సమాజం, కొన్ని సంస్కృతులలో చిన్న వయస్సులో ఉన్న అమ్మాయిని వివాహం చేసుకోవడం అమ్మాయి లైంగికతతో పాటు కుటుంబ గౌరవాన్ని "రక్షిస్తుంది" అని భావిస్తారు. మతపరమైన నిబంధనలు, పెరుగుతున్న పెండ్లి ఖర్చులు, పేదరికం, కుల అసమానతలు, చట్టాల అమలులో అలసత్వం, లింగ వివక్ష, నిరక్షరాస్యత మొదలైనవి ప్రధాన కారణాలుగా ఉన్నాయి.

పరిష్కారాలు

బాల్య వివాహాలను అంతం చేయడం బహుళ వ్యవస్థల సమన్వయంతో కూడిన చర్యతో మాత్రమే సాధ్యమవుతుంది. ప్రతీ వివాహం అధికారికంగా నమోదును తప్పనిసరి చేయాలి. బాలికలకు సాధికారత కల్పించాలి. బాలికలకు వారి కుటుంబాలకు ఆర్థిక మద్దతు కల్పించాలి. బాలికలకు ఉన్నతమైన నాణ్యత కలిగిన విద్యను అందించాలి. చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలును ఏర్పాటు చేయాలి. బాల్య వివాహాల నిషేధ అధికారులు ప్రజలలో అవగాహన కల్పించాలి. బాల్య వివాహాలపై అవగాహన కల్పించడంలో నిషేధించడంలో ప్రింట్, విజువల్ మీడియా కీలక పాత్ర పోషించాలి. చట్టాలను అమలు చేయాలి. వేగంగా శిక్షలు ఖరారు చేయాలి. అతిక్రమించిన వారిపై ఉక్కుపాదాన్ని మోపాలి.

- జనక మోహన రావు దుంగ,
8247045230

వెనెజులా ఎన్నికలు : సోషలిస్టు మదురో మూడోసారి విజయం!



ఎం కోటేశ్వరరావు
8331013288

జూలై 28న జరిగిన వెనెజులా ఎన్నికల్లో అమెరికా మద్దతు ఉన్న మితవాద, ఫాసిస్టు శక్తులు చావు దెబ్బతిన్నాయి. సోషలిస్టు పార్టీ నేత నికోలస్ మదురో మూడవసారి ఎన్నికయ్యాడు. ఆరు సంవత్సరాలు (2031వరకు) పదవిలో ఉంటాడు. ఈ ఎన్నికల్లో మదురోను ఓడించేం దుకు అమెరికా నాయకత్వంలోని వామపక్ష వ్యతిరేక శక్తులన్నీ తీవ్రంగా ప్రయత్నించాయి. ఎన్నికల ఫలితాల తరువాత కూడా అక్రమాలు జరిగాయని, గుర్తించబోమని నానా యాగీ చేస్తున్నాయి. మరోవైపు దేశమంతటా నిరసన ప్రదర్శనలకు పిలుపునిచ్చాయి. మదురోకు మద్దతుగా కూడా అనేకచోట్ల జనం వీధుల్లోకి వస్తున్నట్లు వార్తలు. ఎన్నికల కమిషన్ ప్రకటించిన వివరాల మేరకు మదురోకు 53.67శాతం ఓట్లు రాగా ప్రత్యర్థి ఎడ్మండో గోన్‌సాల్వెజ్‌కు 46.33శాతం వచ్చాయి. మరోవైపున ఇతగాడిని సమర్ధించిన డెమోక్రటిక్ యూనిటీ ఫ్లాట్ ఫాం(డియుపి) గోన్‌సాల్వెజ్‌కు 69.46శాతం రాగా మదురోకు 30.54శాతం వచ్చినట్లు పోటీగా ఫలితాలను ప్రకటించింది. ఇది అమెరికా కనుసన్నల్లో పనిచేసే ప్రతిపక్ష పార్టీలు, శక్తుల కూటమి. మదురోకు వ్యతిరేకంగా ప్రదర్శలకు దిగిన శక్తుల మద్దతుదార్లు అనేక చోట్ల దివంగత మాజీ అధ్యక్షుడు హ్యూగో చావెజ్ విగ్రహాలు, చిహ్నాలను ధ్వంసం చేస్తున్నారు. చావెజ్ రాజకీయ వారసుడిగా మదురో రంగంలోకి వచ్చిన సంగతి తెలిసిందే. మంగళవారం నాడు ఇది రాసిన సమయానికి కొందరు ప్రదర్శకులు అధ్యక్ష భవనంపై దాడికి వెళుతున్నట్లు, దేశమంతటా రోడ్ల దిగ్బంధనానికి పూనుకున్నట్లు వార్తలు వచ్చాయి. ప్రభుత్వాన్ని కూల్చివేస్తామని నినాదాలు చేస్తున్నారు. ముందే ఇలాంటి పరిణామాలను ఊహించిన కారణంగా రాజధాని కారకాస్ నగరంతో సహా దేశమంతటా పోలీసు, జాతీయ భద్రతా దళాలను పెద్ద ఎత్తున మోహరించారు. ఎన్నికలకు ముందు ప్రతిపక్ష గోన్‌సాల్వెజ్‌కు పరిస్థితి అనుకూలంగా ఉన్నట్లు సర్వేలు పేర్కొన్నాయని, ఫలితాలు వాటిని ప్రతిబింబించలేదని అమెరికా వ్యాఖ్యానించింది.ప్రజల ఆకాంక్షను ఫలితాలు ప్రతిబింబించ లేదని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ వ్యాఖ్యానిం చాడు. చైనా, రష్యా, క్యూబా మరికొన్ని దేశాలు మదురోను అభినందించాయి. 2018 ఎన్నికల్లో కూడా సర్వేలన్నీ మదురోకు వ్యతిరేకంగా, ప్రతిపక్ష అభ్యర్థి ముందంజలో ఉన్నట్లే చెప్పాయి. అవన్నీ మదురోను వ్యతిరేకించే శక్తులు వండి వార్చిన కతలు తప్ప మరొకటి కాదు. తన ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు కూల్చివేసేం దుకు కుట్ర జరిగిందని అధ్యక్షుడు మదురో టీవీ ప్రసంగంలో దేశ పౌరులకు చెప్పాడు. దీని గురించి ముందే తెలుసని అయితే చట్టాన్ని గౌరవిస్తామని, తన మద్దతుదార్లు ప్రశాంతంగా ఉండాలని కోరాడు."నేను నికోలస్ మదురో మోరోస్ వెనెజులా బొలివేరియన్ రిపబ్లిక్ అధ్యక్షుడిగా తిరిగి ఎన్నికయ్యాను. మన ప్రజాస్వామ్యం, చట్టం, పౌరులను కాపాడ తాను" అని ఎన్నికల ఫలితాలు వెల్లడి కాగానే మదురో ప్రకటించాడు.

2013లో చావెజ్ మరణించిన తరువాత అధికారానికి వచ్చిన నికోలస్ మదురో అనేక సవాళ్లు, కుట్రలను ఎదుర్కొంటున్నాడు. ప్రధాన రాబడి వనరైన చమురు అమ్మకాలు, రవాణాపై అనేక ఆంక్షలు, దిగ్బంధనాలతో అమెరికా, లాటిన్ అమెరికాలోని దాని మిత్రదేశాలు, ఐరోపా యూనియన్ దేశాలూ ఇబ్బందులు పెట్టేందుకు, జనాన్ని రెచ్చగొట్టేందుకు చూస్తున్నా యి. ఎన్నికల ఫలితాలపై ప్రపంచ దేశాల స్పందన వెలువడింది. లాటిన్ అమెరికాలో వామపక్ష వాదులను సమర్ధించే దేశాలు మదురోకు శుభాకాంక్షలు పలకగా వ్యతిరేక దేశాలు ప్రతికూలంగా స్పందించాయి. వెనెజులా కమ్యూనిస్టు పార్టీతో సహా చిలీలోని వామపక్ష ప్రభుత్వం ఎన్నికలు సక్రమంగా జరిగినట్లు వివరాలను వెల్లడించాలని ప్రకటించటం గమనించాల్సిన అంశం. సకాలంలో ఫలితాలతో పాటు పోలింగ్ కేంద్రాల వారీ ఓటింగ్ వివరాలను వెంటనే ప్రకటించాలని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ కోరినట్లు ప్రతినిధి ప్రకటించాడు. మదురోను వ్యతిరేకించే దేశాలు రంగంలోకి దిగాయి. అమెరికా దేశాల సంస్థ (ఓఏఎస్) అత్యవసర సమావేశం జరిపి ఫలితాలను సమీక్షించాలని కోరుతున్నాయి. వాస్తవాలు తేలేవరకు వెనెజులాతో దౌత్య సంబంధాలను స్తంభింపచేస్తున్నట్లు పనామా ప్రకటించింది. పూర్తి సమీక్ష జరిపే వరకు కారకాస్‌లో ఉన్న తమ దౌత్య సిబ్బందిని వెనక్కు పిలిపిస్తున్నట్లు పేర్కొన్నది. ఫలితాలను అంగీకరించని, వ్యతిరేకించిన పనామా, పెరు, అర్జెంటీనా, చిలీతో సహా ఏడు దేశాల నుంచి తాను కూడా దౌత్య సిబ్బందిని ఉపసంహరిస్తున్నట్లు మదురో ప్రకటించాడు. ఎన్నికల పరిశీలకులను పంపిన కార్టర్ సెంటర్ కూడా పోలింగ్ కేంద్రాల వారీ ఫలితాలను ప్రకటించాలని కోరింది. ఈ సారి ఎలాగైనా మదురో, వామపక్ష శక్తులను దెబ్బతీస్తామని కలలు గన్న తిరోగామి శక్తులు ఆశాభంగం చెందినట్లు స్పందనలు వెల్లడించాయి. ఫలితాలను ఆలస్యం చేసేందుకు, లెక్కింపు ప్రక్రియను దెబ్బతీసేందుకు జరిగిన ప్రయత్నాలపై దర్యాప్తు జరుపుతున్నట్లు అటార్నీ జనరల్ తారెక్ సాబ్ ప్రకటించాడు. తమ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకొంటున్న లిమా ప్రభుత్వాలను కూల్చివేసేందుకు దేశంలోని తిరోగామి శక్తులు, వాటికి మద్దతిస్తున్న అమెరికా చేయని కుట్ర లేదు. ఫాసిస్టు శక్తులు ఎప్పటికప్పుడు ఊసరవెల్లి మాదిరి రూపాన్ని మార్చుకొని ముందుకు వస్తున్నాయి. జనంలో వాటికి ఆదరణ లేకపోవటంతో జాతీయవాదంతో ఆకర్షించాలని చూస్తున్నాయి. అమెరికా తొత్తులుగా పనిచేస్తున్నాయి. ఎన్నికుట్రలు చేసినా, ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు కలిగించినా అధికారానికి వచ్చిన వామపక్షశక్తులు ఉన్నంతలో కార్మికవర్గాన్ని కాపాడేందుకు చిత్తశుద్ధితో చేస్తున్న ప్రయత్నాల కారణంగా వాటి ఆటలు సాగటం లేదు. దీని అర్థం వెనెజులాకు వాటితో ముప్పు లేదని కాదు. మదురో అనుసరిస్తున్న విధానాలన్నీ సరైనవే అని కాదు. వెనెజులా ఎన్నికల్లో పాల్గొనేవారి శాతం క్రమంగా తగ్గుతున్నది. మదురో విధానాలను కాపాడుకోవాలని జనాల్లో కోరిక బలంగా ఉంటే ఎన్నికల్లో పాల్గొనేవారి శాతం పెరగాల్సి ఉంది. కానీ 2013లో 79.65శాతం మంది పాల్గొంటే 2018లో 45.73శాతానికి పడిపోయింది. ఈ సారి 44.85శాతానికి తగ్గింది. 2018 ఎన్నికల్లో మదురోకు 67.85శాతం ఓట్లు రాగా ఇప్పుడు 53.67శాతమే వచ్చాయంటే కొన్ని తరగతుల్లో విదేశీ శక్తుల బృందాన్ని ఖండిస్తున్నట్లు విదేశాంగ మంత్రి యవన్ గిల్ ప్రకటించాడు. తొత్తు ప్రభుత్వాన్ని రుద్దేందుకు ఇప్పుడే కాదు 2019లో కూడా ప్రయత్నించారని అన్నాడు. వెనెజులా చట్టం ప్రకారం స్వతంత్ర పరిశీలకు ప్రతి పోలింగ్ బూత్‌లో లెక్కింపు జరిగి ఫలితాలను సరిచూసేందుకు, రాతపూర్వంగా ఫలితాలను పొందేందుకు అవకాశం ఉంది. ఫలితాలు వెలువడి మదురో గెలిచినట్లు ప్రకటించిన తరువాత అంతర్జాతీయ పరిశీలకుల తనిఖీకి అనుమతించాలని ప్రతిపక్షాలు కొత్తపల్లవి అందుకున్నాయి.



2013లో చావెజ్ మరణించిన తరువాత అధికారానికి వచ్చిన నికోలస్ మదురో అనేక సవాళ్లు, కుట్రలను ఎదుర్కొంటున్నాడు. ప్రధాన రాబడి వనరైన చమురు అమ్మకాలు, రవాణాపై అనేక ఆంక్షలు, దిగ్బంధనాలతో అమెరికా, లాటిన్ అమెరికాలోని దాని మిత్రదేశాలు, ఐరోపా యూనియన్ దేశాలూ ఇబ్బం దులు పెట్టేందుకు, జనాన్ని రెచ్చగొట్టేందుకు చూస్తున్నాయి. ఎన్నికల ఫలితాలపై ప్రపంచ దేశాల స్పందన వెలువడింది. లాటిన్ అమెరికాలో వామపక్ష వాదులను సమర్థించే దేశాలు మదురోకు శుభాకాంక్షలు పలకగా వ్యతిరేక దేశాలు ప్రతికూలంగా స్పందించాయి. వెనెజులా కమ్యూనిస్టు పార్టీతో సహా చిలీలోని వామపక్ష ప్రభుత్వం ఎన్నికలు సక్రమంగా జరిగినట్లు వివరాలను వెల్లడించాలని ప్రకటించటం గమనించాల్సిన అంశం.

గత పాతికేండ్లుగా వెనెజులాలో వామపక్ష ఉద్యమం, అసంతృప్తి ఉందన్నది స్పష్టం. పోయినసారి మదురో మీద పోటీచేసిన ప్రత్యర్థులలో ఇద్దరికి 20.93-10.75 శాతాల చొప్పున వచ్చాయి. ఈ సారి ఒకే అభ్యర్థి రంగంలో ఉన్నాడు. చావెజ్ అనుసరించిన సామ్రాజ్యవాద వ్యతిరేక విధానాలను మదురో కూడా కొనసాగిస్తున్నప్పటికీ అంతర్గత విధానాల మీద వెనెజులా కమ్యూనిస్టు పార్టీ(పిసివి) ఇతర కొన్ని వామపక్ష పార్టీలు విమర్శనాత్మక వైఖరితో ఉన్నాయి.లాటిన్ అమెరికాలో అధికారానికి వచ్చిన ఇతర వామపక్ష నేతల మాదిరిగానే మదురో కూడా పెట్టుబడిదారీ విధాన పునాదులను ముట్టుకోకుండా సంస్కరణలతో, సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నారు. ఈ క్రమాన్ని విబేధించిన వామపక్ష శక్తులను సహించటం లేదని కమ్యూనిస్టు పార్టీ విమర్శించింది.

గతంలో చావెజ్, మదురో ప్రభుత్వానికి వెలుపలి నుంచి మద్దతు ఇచ్చిన కమ్యూనిస్టు పార్టీ ఇటీవలి సంవత్సరాలలో మదురో విధానాలతో విబేధిస్తున్నది. తన విధానాలను విమర్శించిన వామపక్ష శక్తులను ప్రతి పక్షపార్టీల ఏజెంట్లుగా మదురో దాడి చేశాడు. చావెజ్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చూస్తే ఏ కమ్యూనిస్టు లేదా వామపక్ష పార్టీగానీ ప్రతిపక్ష మితవాద శక్తులను సమర్థించిన దాఖలా లేదు. విమర్శనాత్మకంగా ఉంటూనే సోషలిస్టు ప్రభుత్వాలకు మద్దతు ఇచ్చాయి. ప్రస్తుతం కమ్యూనిస్టు పార్టీకి పార్లమెంటులో ఒక స్థానం, ఎనిమిది మంది మేయర్లు ఉన్నారు. తమ పార్టీ నేతల మీద విచారణకు ఆదేశించిన ప్రభుత్వ చర్యను వెనెజులా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి ఆస్కార్ ఫిగుయెరా గోన్‌సాల్వెజ్ ఖండించాడు. పార్టీ నిబంధనావళి ప్రకారం ఎన్నికైన నేతల స్థానే వేరే వారిని ఎంచుకోవాలని కోర్టు చెప్పటం అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకోవటమే అని పార్టీ విమర్శించింది. కోర్టు సూచించిన ఏడుగురు పార్టీ సభ్యులు కూడా కాదని అందువలన అది చట్టవిరుద్ధమని కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్లీనరీ సమావేశం పేర్కొన్నది. వారితో పోటీ పార్టీ సమావేశాలను కూడా ఏర్పాటు చేయించారు. చావెజ్ హయాంలో ప్రారంభించిన అనేక సంక్షేమ కార్యక్రమాలను మదురో రద్దుచేశారని, పౌరసేవలు దిగజారినట్లు కూడా పేర్కొన్నది.కార్మికుల ఆదాయాలు, హక్కులకు కోత పెట్టిందని, సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు వేతనాల పెంపుదల, ప్రయివేటు గుత్త సంస్థల రద్దు వంటి విప్లవాత్మక చర్యలు చేపట్టటానికి బదులు ఉదారవాద సంస్కరణలకే పరిమితం అయ్యారని పేర్కొన్నది. అమెరికా డాలర్ల చెలామణిని స్వేచ్ఛగా అనుమతించటాన్ని, మారకపు విలువపై అదుపును వదలివేశారని, దిగుమతులపై పన్ను రద్దు చేయటాన్ని అనేక మంది ఆర్థికవేత్తలు తప్పు పట్టారు.మదురో ఆచరణాత్మక విధానాలను అనుసరిస్తున్నారని కొందరు సమర్థిస్తే నయా ఉదారవాద విధానాలు తప్ప మరొకటి కాదని కమ్యూనిస్టు పార్టీ స్పష్టం చేసింది. అంతే కాదు, తనతో పాటు కలసివచ్చే వామపక్ష పార్టీలను కలుపుకొని ప్రజా విప్లవ ప్రత్యామ్నాయం పేరుతో ఒక కూటమిని ఏర్పాటు చేసింది.ఈ కూటమిలో కమ్యూనిస్టు పార్టీతో సహా మరో నాలుగు పార్టీల నాయకత్వాన్ని మార్చాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కార్యాలయం మీద పోలీసులు దాడి చేశారు. ఇటీవలి కాలంలో అనేక రంగాలలో కార్మికులు జరుపుతున్న పోరాటాలకు కమ్యూనిస్టు పార్టీ మద్దతు ప్రకటించింది, దీంతో కొంతమందిని పోలీసులు అరెస్టు చేశారు. గతేడాది కార్మికుల పోరాటాలు అంతకుముందు ఏడాది కంటే వెయ్యి రెట్లు ఎక్కువ పెరిగాయి.కమ్యూనిస్టు పార్టీ లేదా మరొక పార్టీలో అంతర్గత సమస్యలేవైనా ఉంటే వారు తేల్చుకుంటారు తప్ప కోర్టులు నాయకత్వాన్ని సూచించటం అప్రజాస్వామికం.

ఉద్యోగ స్కీములు మోసం - కార్పొరేట్లకే లాభం

భారత ఆర్థిక వ్యవస్థ చాలా క్లిష్టమైన చౌరస్తాలో వుంది. స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) పెరుగుదల రేటు ఏ విధంగానూ ఉద్యోగ కల్పనా సామర్థ్యాన్ని పెంచలేకపోతున్నది. కల్పించబడిన ఉద్యోగాలలో కూడా 57.3 శాతం స్వయం ఉపాధి రంగానివే. 18.3 శాతం ఏ ప్రతిఫలం లేని ఇంటి పనివారివైతే 45 శాతం పైగా వ్యవసాయ రంగంలో పనిచేస్తున్నారు. ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహకం (పిఎల్ఐ) పేరిట 2020 మార్చిలో ప్రవేశ పెట్టిన పథకం ఉత్పత్తి రంగంలో ఉపాధి కల్పించడంలో ఘోరంగా విఫలమైంది. ఏడాది కేడాది భారతీయ వస్తూత్పత్తి రంగంలో కొట్టచ్చినట్టుగా తగ్గిపోతున్న ఉత్పాదకత 2022-23 నాటికి 2.38 శాతానికి చేరింది. అయితే మోడీ ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహకాలు, ఇంకా అనేక రకాలైన నిలువు దోపిడీ వరప్రసాదాలు కలగలసి దేశంలోని లిస్టెడ్ కంపెనీలు 2023-24లో అపారంగా 10.1 శాతం నికర లాభాలు పోగుపోసుకున్నాయి. ఇది 2007-08 తర్వాత కాలంలోనే అత్యధికం. ఇప్పటికొస్తే భారత ఆర్థిక వ్యవస్థ సగటున ఏటా 78.5 లక్షల ఉద్యోగాలు కల్పించవలసిన అత్యావశ్యక పరిస్థితిలో వుందని ఆర్థిక సర్వే పేర్కొన్నది. పెరిగే శ్రామిక సంఖ్య ఉద్యోగావసరాలను అందుకోవాలంటే అది తప్పనిసరి. ఉద్యోగ రంగంలో నెలకొన్న తీవ్ర సంక్షోభం లోక్‌సభ ఎన్నికలలో ఒక వేడివేడి అంశంగా ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలో మోడీ మూడవ ప్రభుత్వ తొలి బడ్జెట్ ఉపాధి కల్పనకూ నూతన ఉద్యోగావకాశాలు సృష్టించడానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని ఎవరైనా భావిస్తారు. కానీ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్పించిన బడ్జెట్ సంప్రదాయ ఉద్యోగ రంగంలో ఉద్యోగాల కల్పన పేర డొల్లతనపు మోసపూరిత చర్యలకు పాల్పడటమే చూశాం. అదే సమయంలో ఆ పేరిట కార్పొరేట్లకు ప్రభుత్వ నిధులను ఉదారంగా గుమ్మరించడమూ కనిపించింది.



మూడు స్కీముల గుట్టు

ఆర్థిక మంత్రి ఉద్యోగ కల్పన అనుసంధానిత ప్రోత్సాహకాలు (ఇఎల్ఐ) పేరిట ప్రకటించిన పథకాల పరంపర కార్పొరేట్ పండితులను విశేషంగా ఉత్సాహపర్చింది. ఇందులో మొదటిదైన ఎ స్కీము ఉద్యోగుల ందరికీ వర్తించేదిగా వుంటే బి, సిలు మాత్రం నిర్దిష్టమైన తరగతులకు వర్తించు తాయి. ఎ స్కీము ప్రకారం ఎవరైనా ఒక యజమాని కొత్తగా ఒక కార్మికుడిని చేర్చుకుంటే లేదా అంతకు ముందు తమ జాబితాలో లేని ఒక కార్మికుడిని ఇఎఫ్‌పివో (ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్) లో చేరిస్తే ఆ కార్మికునికి వచ్చే ఒక నెల జీతాన్ని రూ. 15,000 మేరకు ప్రభుత్వం మూడు కిస్తీల్లో చెల్లిస్తుంది. దీని అర్థమే మంటే యజమాని ఆ కార్మికుడికి చెల్లించే జీతంలో పన్నెండో వంతు నేరుగా ప్రభుత్వమే అంద జేస్తుంది. ఉత్పత్తి రంగంలో యాభై మందికి తక్కువ కాకుండా ఇఎఫ్‌పివో యేతర కార్మికులను తీసుకునే యాజమాన్యాలకు బి స్కీము వర్తిస్తుంది. ఈ స్కీము కింద ప్రభుత్వం ఇఎఫ్‌పివోకు అటు ఉద్యోగులు ఇటు యాజమాన్యం చెల్లించవలసిన వాటాను అంటే జీతంలో 24 శాతాన్ని ప్రజాధనం నుంచి నేరుగా చెల్లిస్తుంది. ఇక సి స్కీము ప్రకారమైతే ఏదైనా కంపెనీ గనక ఇద్దరు నుంచి ఐదుగురు ఉద్యోగులను తీసుకుంటే నెలకు రూ.3000 వరకూ ఇఎఫ్‌పివోలో యజమాని వాటా అందుకుంటుంది. చాలా స్పష్టంగా ప్రభుత్వం వేతనాల మొత్తంలో 32.33 శాతాన్ని ప్రజల ధనంతో చెల్లు వేస్తుందన్నమాట. ఈ పథకాలలో మరీ ప్రమాదకరమైన అంశమేమంటే ఆ కంపెనీలు ప్రతి ఏటా కొత్త ఉద్యోగులను తీసుకుంటేనే ఈ పథకం అమలువుతుంది. దీనివల్ల జరిగేదేమంటే మొదటి ఏడాది ఉద్యోగులను కేవలం నిర్ణీత కాలానికే తీసుకుని ఏడాది కాగానే పనినుంచి తొలగించేస్తాయి. ప్రభుత్వ సబ్సిడీ పొందడం కోసం రిట్రెంచిమెంటు మరింత తీవ్రం చేసేందుకు ఈ పథకాలు కారణమవుతాయి.

PEOPLE'S DEMOCRACY

లాభార్జనతో ముడిపడిన ఉత్పత్తిని పెంచడమంటే దాంట్లో ఎలాంటి చెల్లింపులేని శ్రామిక శక్తి వాటా పెంచడమే. ఇఎల్ఐ, ఇంటర్న్‌షిప్ స్కీములు తీసుకురావడం ద్వారా కార్పొరేట్లకు ఉచిత శ్రామిక బలగాన్ని సమకూర్చి పెట్టేందుకు మోడీ సర్కారు బరితెగించి ప్రయత్నిస్తున్నది. కానీ మరో వైపున ప్రజల కొనుగోలు శక్తి క్షీణిస్తుండడం వల్ల మొత్తం గిరాకీ నిరంతరాయంగా పడిపోతున్నది. దాంతో నికర అమ్మకాలు తగ్గిపోతున్నాయి. ఉత్పత్తితో ముడిపడిన లాభాలూ వాస్తవరూపం దాల్చడం లేదు. అది ఉత్పత్తి సంబంధమైన ఆలోచనల నుంచి ప్రయివేటు పెట్టుబడులను దెబ్బతీస్తున్నది. కార్పొరేట్ ఆదాయం పెరుగుదల స్థిరంగా స్పెక్యులేషన్ మార్గంలోనే మళ్లించబడుతున్నది.

నిరుద్యోగ సేనల పడిగాపులే

మరో పెద్ద దెబ్బ ఇంటర్న్‌షిప్ విధానం. ఈ పథకాన్ని ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే అగ్రశ్రేణి కంపెనీల కోసం రూపొందించింది. అత్యధిక లాభాలతో నడుస్తున్న ఈ 500 కంపెనీలు తమ మొత్తం ఉత్పత్తినీ సేవలనూ కేవలం ఇంటర్న్‌లు లేదా అప్రెంటిస్‌లతో నడిపించుకోవడా నికి వీలుగా ఈ పథకం తయారైంది. వీరికి నెలకు 5000 రూపాయల స్టైఫండ్ భారం, ఒక దఫా సహాయం గా రూ. ఆరు వేల చెల్లింపు అన్నీ ప్రభుత్వమే చేస్తుంది. మిగిలిన శిక్షణా వ్యయం కూడా సిఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధుల నుంచి తీసుకోవచ్చు. ఈ కార్పొరేట్ అనుకూల ప్రభుత్వం అపఖ్యాతికరమైన ఈ పథకం ద్వారా ఉద్యోగ సంబంధాలను మరింత దుర్బలపరిచే దిశలోకి నడిపిస్తుంది. అత్యాధునికమైన యంత్రాలు, సాంకేతికత పరిజ్ఞానంతో వేగంగా నేర్చుకునే సత్తా సంతరించుకున్న కొత్త ఇంటర్న్ బ్యాచీలు మొత్తం కీలక ఉత్పత్తి ప్రక్రియకు బాధ్యత వహించాల్సిన పరిస్థితి కల్పించబడుతుంది. ఈ ఉత్పత్తి క్రమంలో పాత బ్యాచీల స్థానంలో రావడం కోసం భారీ నిరుద్యోగ సైన్యాలు లేదా వృత్తి విద్యా సాంకేతిక శిక్షణ పొందిన వారు ఫ్యాక్టరీల గేట్ల దగ్గర పడిగాపులు పడి నిరీక్షించాల్సి వస్తుంది.

మరింత దిగజారుడుకే!

ఈ విధంగా ప్రభుత్వ ఖజానా నుంచి నిధులు తరలించి ప్రయివేటు భోషాణాలు నింపడం వల్ల నిరుద్యోగ సమస్య ఇసుమంతైనా పరిష్కారం కాదు. లాభార్జనతో ముడిపడిన ఉత్పత్తిని పెంచడమంటే దాంట్లో ఎలాంటి చెల్లింపులేని శ్రామిక శక్తి వాటా పెంచడమే. ఇఎల్ఐ, ఇంటర్న్‌షిప్ స్కీములు తీసుకురావడం ద్వారా కార్పొరేట్లకు ఉచిత శ్రామిక బలగాన్ని సమకూర్చి పెట్టేందుకు మోడీ సర్కారు బరితెగించి ప్రయత్నిస్తున్నది.

కానీ మరో వైపున ప్రజల కొనుగోలు శక్తి క్షీణిస్తుండడం వల్ల మొత్తం గిరాకీ నిరంతరాయంగా పడిపోతున్నది. దాంతో నికర అమ్మకాలు తగ్గిపోతున్నాయి. ఉత్పత్తితో ముడిపడిన లాభాలూ వాస్తవరూపం దాల్చడం లేదు. అది ఉత్పత్తి సంబంధమైన ఆలోచనల నుంచి ప్రయివేటు పెట్టుబడులను దెబ్బ తీస్తున్నది. కార్పొరేట్ ఆదాయం పెరుగుదల స్థిరంగా స్పెక్యులేషన్ మార్గంలోనే మళ్లించ బడుతున్నది. ప్రభుత్వం కార్పొరేట్లకు ఈ స్కీములతో సబ్సిడీలు ఇవ్వొచ్చునేమో గానీ ఆర్థిక వ్యవస్థ పరిస్థితి, ప్రజల జీవన స్థితిగతులు మాత్రం మరింత దిగజారతాయి.

(జులై 24 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

పంటలకు నీటిని విడుదల చేయాలి

రైతుసంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్



నవతెలంగాణ-ఖమ్మం

పాలేరు ఆయకట్టు కింద సాగు చేస్తున్న రైతులకు పాత కాలువ ద్వారా సాగర్ నీరుని విడుదల చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్ కోరారు. నాగార్జునసాగర్‌లోకి పూర్తిగా నీరు నిండేదాక ఎదురు చూడకుండా రైతులకు మేలు కలిగే విధంగా వెంటనే నీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. నిండేదాక ఎదురు చూస్తే అవి సముద్రంలోకి పోతాయని అన్నారు. ఆలస్యం చేస్తే రైతులు తీవ్రంగా నష్టపోతారని, సాగర్ నీటిని చెరువులు, కుంటల్లో నింపాలని కోరారు. ఇప్పటికే రైతులు బావిల కింద, బోర్ల కింద నాట్లు వేశారని, కనీసం పాత కాలువులకు నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. జిల్లాకు చెందిన మంత్రులు అధికారులతో మాట్లాడి నీటిని విడుదల చేసి, రైతులకు అండగా ఉండాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి ఐపీడీఎస్ 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని సిద్దారం రోడ్డు (పాలవాడ) ఫీడర్‌కు బుధవారం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ పట్టణ ఏఈ ఉబ్బన శరత్ తెలిపారు. ఆ ఫీడర్ పరిధిలో ఉన్న బత్తిని చలమయ్య రోడ్డు, రాజబాపయ్య వీధి, సిద్దారం రోడ్డు, వీటీఆర్ రోడ్డు, లెనిన్ రోడ్డు, తుమ్మూరు రామారావు బజారు, శ్రీనివాసా టాకీస్ రోడ్డు ప్రాంతాలకు పై తెలిపిన సమయాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. పాలవాడ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు నరికివేత కార్యక్రమం చేపడుతున్న దృష్ట్యా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు. ఈ అసౌకర్యానికి ఆయా ప్రాంతాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు సహకరించాల్సిందిగా ఏఈ శరత్ కోరారు.



వెజ్, నాన్ వెజ్ మార్కెట్ పరిశీలన

నవతెలంగాణ-ఖమ్మంకార్పొరేషన్

54 డివిజన్‌లోని వెజ్, నాన్ వెజ్ మార్కెట్‌ను మంగళవారం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ పరిశీలించారు. మార్కెట్ ఈవో శ్వేతతో మాట్లాడుతూ రోజు మార్కెట్ ఏ సమయం నుంచి ఏ సమయం వరకు ఓపెన్ చేసి ఉంచుతున్నారని, ఎంతమంది రైతులు మార్కెట్లో అమ్ముకుంటున్నారని, ఎంతమంది వర్కర్స్ ఈ మార్కెట్లో పనిచేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఖాళీగా ఉన్నటువంటి షాపులను ఎలా ఉపయోగించాలనే సంబంధిత అధికారులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటా అన్నారు. మార్కెట్లో ఏమైనా సమస్యలు ఉంటే ఆ సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

1,804 మందికి రెండో విడత రుణమాఫీ

నవతెలంగాణ - బోనకల్

మండల పరిధిలోని రెండో విడతగా మొత్తం 1,804 రైతులకు రుణమాఫీ జరిగినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారిని సర్వశుద్ధి సరిత తెలిపారు. మండలంలోని క్లస్టర్ల వారీగా బోనకల్ క్లస్టర్ పరిధిలో ఆళ్ళపాడు గ్రామంలో 142 మందికి, బోనకల్‌లో 84 మందికి, గోవిందాపురం ఏలో 40 మందికి రెండో విడతలో లక్షన్నర రూపాయల లోపు రుణమాఫీ జరిగినట్లు సరిత తెలిపారు. చిన్న బీరవల్లి క్లస్టర్ పరిధిలో బ్రాహ్మణపల్లిలో 30 మందికి, చిన్న బీరవల్లిలో 65, నారాయణపురంలో 63, రాపల్లిలో 86, కలకోట క్లస్టర్ పరిధిలో కలకోటలో 167 మందికి, మోటమరిలో 113 మందికి, లక్ష్మీపురం క్లస్టర్ పరిధిలో గార్లపాడులో 58 మందికి, లక్ష్మీపురంలో 197 మందికి, రామాపురంలో 19 మందికి, తూటికుంట్లలో 76 మందికి రుణమాఫీ జరిగినట్లు తెలిపారు. ముష్టికుంట్ల క్లస్టర్ పరిధిలో చిరునోములలో 100 మందికి, చొప్పకట్లపాలెంలో 80 మందికి, ముష్టికుంట్లలో 161 మందికి, రావినూతల క్లస్టర్ పరిధిలో పెద్ద బీరవల్లిలో 217, రావినూతలలో 106 మందికి రెండో విడత లక్షన్నర లోపు రుణమాఫీ జరిగినట్లు ఆమె తెలిపారు.



విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి : కెవిపిఎస్

నవతెలంగాణ-కూసుమంచి

ఎస్సీ, బీసీ, ఎస్టీ, హాస్టల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు పాపిట్ల సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని పలు హాస్టళ్లను ఆయన సందర్శించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులకు హాస్టల్లో మెరుగైన సౌకర్యాలు లేవని విద్యార్థులు తమ దృష్టికి తీసుకు వచ్చారని, ఇప్పటికైనా ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు ఉన్నటువంటి హాస్టల్లో మెరుగైన సౌకర్యాలను కల్పించాలని, విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని హాస్టల్‌లలో మెరుగైన సౌకర్యాలు అందించాలని ఆయన కోరారు. లేనిపక్షంలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు కొండ వేణు, మునగాల నవీన్, ఉపేందర్, రమేష్, సైదులు తదితరులు పాల్గొన్నారు.



ఆశాల న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలి : సిఐటియు

నవతెలంగాణ-మధిర

హైదారాబాద్ ఇందిరాపార్క్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగే ధర్నాకు వెళ్లకుండా ఆశా వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి సృజనను పోలీసులు అరెస్టు చేశారు. ఈ అరెస్టుకు నిరసనగా సిఐటియు ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు మధిరరూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు శీలం నరసింహారావు మాట్లాడుతూ ఆశా వర్కర్లు తమ న్యాయమైన కోరికలు తీర్చాలని హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద ధర్నాకు వెళుతుండగా వాళ్లని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కి తీసుకొచ్చారని, ఇట్లాంటి అరెస్టులు ద్వారా ఉద్యమాలను ఆపలేరని, ఆశాల న్యాయమైన కోరికలను తీర్చకపోతే మరిన్ని పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ పడకంటి మురళి, రైతు సంఘం జిల్లా నాయకులు పాపినేని రామనరసయ్య, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మద్దాల ప్రభాకర్, భారతి, సుజాత, అత్తర్ బి దివ్య విజయలక్ష్మి, వెంకటమ్మ ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

విద్యావాలంటీర్లను నియమించాలి : యుటీఎఫ్

నవతెలంగాణ-తల్లాడ

ఉపాధ్యాయ బదిలీల్లో బదిలీ అయిన ఎస్జీటీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని, వారి స్థానంలో వాలంటీర్లను నియమించాలని టీఎస్ యుటిఎఫ్ తల్లాడ మండల ప్రధాన కార్యదర్శి బి.సుధాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల టీఎస్ యుటిఎఫ్ క్యాంపైన్‌లో భాగంగా వివిధ పాఠశాలలను సందర్శించి మండల కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను కలిసి సభ్యత్వం సేకరించామన్నారు, పీఎస్ రెడ్డిగూడెం, మల్లారం, గోపాలపేట, మైసూర్ తండా పాఠశాలలను సందర్శించామన్నారు. కార్యక్రమంలో షేక్ లాల్ సయ్యద్, ఉపాధ్యక్షురాలు జి.ప్రగతి కుమారి, మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు, టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ ఓ చరిత్ర

కాంగ్రెస్ పార్టీ నాయకులు యరసాని శివశంకర్‌రెడ్డి



నవతెలంగాణ-ఖమ్మంరూరల్

రైతు రుణమాఫీ ఓ చరిత్ర అని, ఆ పథకం అమలు చేసే ధైర్యం ఒక్క కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని, అనుకున్న సమయం కంటే ముందుగానే రైతులకు రుణమాఫీ చేయడంతో రైతుల ముఖాల్లో ఆనందాన్ని చూస్తున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు యరసాని శంకర్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన తల్లంపాడులో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రెండవ విడత రైతులకు రూ.1.50ల లోపు రుణమాఫీ చేయగా, నేరుగా రైతుల ఖాతాలోకి నిధులు విడుదల చేయడం పట్ల శంకర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. రైతులకు రుణమాఫీ చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రులు భట్టి విక్రమార్కకి, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి, తుమ్మల నాగేశ్వరరావుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రైతు సంక్షేమ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని మరోసారి నిరూపించిడం జరిగిందన్నారు. రైతు రుణమాఫీ అమలు చేసి రైతుల పక్ష ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని సాటి చెప్పారని అన్నారు. ఒక వైపు ప్రకృతి వర్షాల రూపంలో రైతులకు ఆనందాన్ని ఇస్తుంటే మరో వైపు తెలంగాణ ప్రభుత్వం రైతు రుణమాఫీతో రైతులు మరింత సంతోషంగా ఉన్నారని తెలిపారు.

తిరుమలాయపాలెంలోనే ఆసుపత్రి కొనసాగిస్తాం

- ఆసుపత్రి అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- అఖిలపక్షం నాయకులకు దయాకర్‌రెడ్డి హామీ



నవతెలంగాణ-తిరుమలాయపాలెం

తిరుమలాయపాలెం మండల కేంద్రంలో రూ.125 కోట్ల వ్యయంతో మంజూరైన ఆసుపత్రి అక్కడే కొనసాగించాలని కోరుతూ గత వారం రోజులుగా అఖిలపక్షం నాయకుల ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టిన విషయం విదితమే. కాగా మంగళవారం రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఆయన వ్యక్తిగత సహాయకులు తంబూరి దయాకర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. తిరుమలాయపాలెం మండల కేంద్రంలో మంజూరైన వంద పడకల ఆసుపత్రి అక్కడే కొనసాగిస్తామని, ఆసుపత్రి అభివృద్ధికి నిధులు కేటాయించి మాతా శిశు కేంద్రం కూడా మంజూరు చేయనున్నట్లు అఖిలపక్షం బృందానికి దయాకర్‌రెడ్డి హామీ ఇచ్చారు ఈ సందర్భంగా అఖిలపక్షం నాయకులు తిరుమలాయపాలెం మండల కేంద్రంలో షాపింగ్ కాంప్లెక్స్, పబ్లిక్ టాయిలెట్స్, ఎస్‌బిఐ బ్రాంచ్, ఐటిఐ కళాశాల, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని దయాకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. తిరుమలాయపాలెం మండల అభివృద్ధికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కట్టుబడి ఉన్నాడని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, తెలుగుదేశం పార్టీ ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి కొండపల్లి కరుణాకర్, సిపిఎంఎల్ న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి గౌర్రెపాటి రమేష్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు చింతిరాల నాగభూషణం, బిఎస్‌పి జిల్లా నాయకులు కొమ్ము పుల్లయ్య, మండల నాయకులు గంటా కృష్ణ, సిపిఎం మండల నాయకులు కొలిచలం స్వామి, సిపిఐ ఎమ్మెల్యే గౌర్రెపాటి వీరస్వామి, బిఆర్ఎస్ మండల నాయకులు పోలే పొంగు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలి

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు

పొన్నం వెంకటేశ్వరరావు



నవతెలంగాణ - బోనకల్

ఎటువంటి షరతులు లేకుండానే రెండు లక్షల రుణమాఫీ చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల భవనంలో పార్టీ మండల కమిటీ సమావేశం కూచిపూడి మురళీకృష్ణ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డు ఆధారంగా రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించడం రైతులను మోసం చేయటమేనన్నారు. రెండు లక్షల అప్పు ఉన్న రైతులందరికీ రుణమాఫీ చేయాలన్నారు. రైతులకు తిరిగి రుణాలు ఇచ్చే సందర్భంగా 15 సంవత్సరాల ఈసీ సర్టిఫికెట్ కావాలని షరతు విధించడం రైతులకు తీవ్ర నష్టం కలిగించడమేనన్నారు. ఈసీ నిబంధన వెంటనే తొలగించి రుణమాఫీ అయిన రైతులందరికీ తక్షణం పాత పద్ధతి ప్రకారమే రుణం ఇవ్వాలని ఆయన కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమం అంటూ కోతలు విధించడం సరైన పద్ధతి కాదన్నారు. గత ప్రభుత్వం రుణమాఫీ చేస్తానని ప్రకటించి మాఫీ చేయలేదని, ఆ విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేయకుండా రెండు లక్షల రుణమాఫీ చేసి తీరాలని కోరారు. వ్యవసాయ సీజన్ కావటంతో రుణమాఫీ అయిన రైతులందరికీ రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం కృషి చేయకుండా కార్పోరేట్ సంస్థల అభివృద్ధి కోసమే పనిచేస్తుందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో బిజెపి, బీఆర్ఎస్ ప్రజలను మాయమాటలతో తప్పుదోవ పట్టిస్తుందని విమర్శించారు. ఇటీవల జరిగిన ఎన్నికలలో బిజెపి సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ప్రగల్భాలు పలికిందని, కానీ దేశ ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. పూర్తి మెజార్టీ వస్తే రాజ్యాంగాన్ని సవరించడానికి వెనకాడేది కాదన్నారు. రాష్ట్రంలో, దేశంలో బిజెపి ప్రమాదం పొంచి ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలన్నింటిని అమలు చేసి తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు గుగులోతు పంతు, నిమ్మల రామారావు, జొన్నలగడ్డ సునీత, ఏడునూతల లక్ష్మణరావు, దొప్ప కొరివి వీరభద్రం, పిల్లలమర్రి వెంకట అప్పారావు, పెద్దపోలు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాలకుల హామీల అమలుకు ఐక్య పోరాటాలు

అఖిల పక్ష ప్రజాసంఘాల సమావేశం



నవతెలంగాణ-కారేపల్లి

కేంద్ర, రాష్ట్ర పాలకులు ఎన్నికల హామీల అమలుకు ఐక్య పోరాటాలు చేయనున్నట్లు వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ, ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావులు అన్నారు. మంగళవారం వ్యకాస ఆధ్వర్యంలో ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం యనమనగండ్ల రవి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు హామీల వర్షం కురిపించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు వాటి అమలులో కొర్రీలు పెట్టటం, అమలుచేయక పోవటంపై ప్రజలలో ఆగ్రవేశాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. ఉపాధి పని దినాలు 200 పెంచి రోజు కూలీ రూ.600 చెల్లించాలని పేదలు డిమాండ్ చేస్తుంటే కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించటం విచారకరమన్నారు. రైతులకు పీఎం కిసాన్ పైకం రూ.6 వేల నుండి రూ.8వేలకు పెంపును ప్రకటించి దానిని అమలు చేయటం లేదన్నారు. రాష్ట్రంలో మహిళలకు నెలకు రూ.2500, వ్యవసాయకూలీలకు ఏడాదికి రూ.12వేలు, అర్హులకు రేషన్ కార్డులు, రైతు భరోసా సాగు చేస్తున్న ప్రతి ఎకరాకు రూ.15వేలు, పింఛన్ పైకం పెంపు వంటి హామీలు అమలుపై ఊసేత్తటం లేదన్నారు. రైతు రుణమాఫీ కొర్రీలు పెడుతూ మాఫీ మమ అనిపించుకోవాలని ప్రభుత్వం ఎత్తుగడ వేస్తుందని విమర్శించారు. వ్యవసాయ కార్మికులకు రోజు కూలి రూ.350 చెల్లించి ప్రమాదాల కారణంగా గాయపడిన. చనిపోయిన వారికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, ఆరోగ్యశ్రీని అన్ని జబ్బులకు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. పాలకులు ఇచ్చిన హామీల వెంటనే అమలు చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. హామీలు తక్షణం అమలు చేయాలని లేనియెడల ప్రజా సంఘాల ఐక్య పోరాటాలతో ఆందోళన ఉధృతం చేస్తామని వారు ప్రభుత్వాలను హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బోళ్ల రామస్వామి, సీపీఐ రైతు సంఘం నాయకులు బావుసింగ్, సిఐటియు మండల కన్వీనర్ కే.నరేంద్ర, టీడీపీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు భూక్యా రాంబాబు, మహిళా సంఘం మండల కార్యదర్శి కే.ఉమావతి, వ్యకాస నాయకులు బాదావత్ శ్రీనివాస్, రేగళ్ల మంగయ్య, పాసిని నాగేశ్వరరావు, కరపటి అరుణ, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు ఆదెర్ల శంకర్, జీపీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఎస్‌కె.హుస్సేన్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు కేలోత్ రవి, శనగ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు కందాళ పరామర్శ

నవతెలంగాణ-కూసుమంచి

మండలంలోని జుజ్జులరావుపేట, రాజుపేట గ్రామాలలో ఇటీవల మరణించిన నాదెండ్ల నరసింహారావు, సోలిపురం దుర్గమ్మ కుటుంబాలను పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి పరామర్శించి, ఓదార్చి మనోధైర్యాన్ని కల్పించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు వేముల వీరయ్య, ఆసిఫ్ పాషా, మాజీ డిసిసిబి డైరెక్టర్ ఇంటూరి శేఖర్, పిఎసిసి సొసైటీ చైర్మన్ వాసంశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు మల్లిడి వెంకన్న, ఎంపీటీసీ బజ్జూరి రామిరెడ్డి, ఎస్సీ, ఎస్టి, బీసీ, మహిళ, సోషల్ మీడియా, యూత్ అధ్యక్షులు గోపే రాము, కోటి జాదవ్, నూకల మల్లయ్య, అలివేలు మంగమ్మ, వడ్యా బాలకృష్ణ, తంగేళ్ల బుచ్చిబాబు, దాసరి బాలకృష్ణ, శ్రీను, స్థానిక నాయకులు, కందాళ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ(ఎం) గ్రామశాఖ సభ్యుని మృతి

నవతెలంగాణ-ఎర్రుపాలెం



గత కొద్ది రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతూ సీపీఐ(ఎం) గ్రామ శాఖ సభ్యుడు చిప్పగిరి కృష్ణ (65) మంగళవారం కొత్తగోపవరంలో మృతి చెందాడు. మృతదేహాన్ని పార్టీ మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య పార్టీ సభ్యులతో కలిసి సందర్శించి పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కృష్ణకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు గొల్లపూడి కోటేశ్వరరావు, నల్లమతుల హనుమంతరావు, మేడగాని తిరుపతిరావు, గోధుమ వెంకటేశ్వరరావు, షేక్ గాలిబు, తేనె రాజారావు, కోలా వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్క దాడిలో బాలుడికి గాయాలు

నవతెలంగాణ-ముదిగొండ

మండల పరిధిలోని అమ్మపేట గ్రామానికి చెందిన ఆరేండ్ల బాలుడు మోదుగుల వరుణతేజ్ మంగళవారం పాఠశాలకు వెళ్తుండగా వీధి కుక్క వెంటబడి దాడి చేసి కాలుకి గాయం చేసింది. వరుణతేజ్‌ను చికిత్స కోసం కుటుంబసభ్యులు ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. గ్రామాలలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తూ జనాన్ని భయభ్రాంతులకు గురిచేస్తున్న విషయంపై ఇటీవల కాలంలో నవతెలంగాణ దినపత్రికలో కథనం ప్రచురణ అయిన విషయం విదితమే. అయినా అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ ఘటన జరిగింది. ఇకనైనా అధికారులు స్పందించి వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకొని రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

రేపు మండల సాధారణ సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-ముదిగొండ

మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ముదిగొండ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించినట్లు ఎంపిడిఓ ఎస్.శ్రీధర్ స్వామి మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను ఈనెల 31న అందజేయాలని ఆయన పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు సమావేశానికి సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు. కాగా ఎంపీటీసీల పదవి కాలం ఆగస్టు 5న ముగియనున్నది. దీంతో ఈసమావేశం ఆఖరిది కానుంది.

ఇసుక లారీ పట్టివేత

నవతెలంగాణ-ఎర్రుపాలెం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం కేసర గ్రామం నుండి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న లారీని మంగళవారం తెల్లవారుజామున ఎర్రుపాలెం పోలీసులు పట్టుకున్నారు. స్థానిక ఎస్సై వెంకటేష్ తెలిపిన వివరాల మేరకు లారీలో డ్రైవర్ చల్లా నాగరాజు అనే వ్యక్తి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను ఖమ్మం పట్టణానికి చెందిన చలమల వెంకటేశ్వరరావు ఇంటికి తీసుకొస్తుండగా పట్టుకున్నారు. లారీని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

నవతెలంగాణ- వేంసూరు

రైతులకు రుణమాఫీ రెండోదఫా విడుదల చేయడం పట్ల రైతులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ మర్లపాడు సెంటర్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కాసర చంద్రశేఖర్ రెడ్డి, వెల్ది జగన్ మోహన్‌రావు, పుచ్చకాయల సోమిరెడ్డి, వెంకటప్ప రెడ్డి, గన్నేని సురేష్, ఎంపీటీసీ రాఘవరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రవి, సత్యనారాయణ, ఎర్ర సత్యనారాయణ, కుక్కలకుంట శ్రీను, ముత్తారెడ్డి, జగన్ పాల్గొన్నారు.

ఎంపీడీవోను కలిసిన నాయకులు

నవతెలంగాణ-వేంసూరు

నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఎంపీడీవో రమాదేవిని మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కాసర చంద్రశేఖర్ రెడ్డి, తక్కెళ్ళపాటి గోపాలకృష్ణ, రాఘవరెడ్డి, శ్రీనివాసరెడ్డి, మేడ వెంకటేశ్వరరావు, రామకృష్ణారెడ్డి, ఫక్రుద్దీన్, సత్యనారాయణ, శ్రీను, బాపూజీ సోమిరెడ్డి తదితరులు ఉన్నారు.

వితంతువుల పెన్షన్ మంజూరికి వినతి

నవతెలంగాణ-ముదిగొండ

మండల పరిధిలోని పెద్దమండవ గ్రామానికి చెందిన దివ్యాంగురాలితో పాటు, ఆరుగురు వితంతువులు గత ఐదు సంవత్సరాలు నుండి పెన్షన్ లేక ఇబ్బంది పడుతున్నామని, వితంతువుల పెన్షన్ మంజూరు చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి (విహెచ్పిఎస్) ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ ఎస్.శ్రీధర్ స్వామికి వినతపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షులు ఇనప ఉపేందర్, మండల అధ్యక్షులు జి.రాంబాబు, వితంతువులు కంపసాటి భవాని, వడ్డెబోయిన లక్ష్మి, పసుపులేటి వెంకటరావమ్మా, వంగా విజయలక్ష్మి, తోటకూరి సంధ్యారాణి, షేక్ ఉద్దండిబి, దివ్యాంగురాలు షేక్ మస్తాన్ బి పాల్గొన్నారు.

హెల్త్ క్యాంపులు నిర్వహించాలి : ఏఐఎస్ఎఫ్

నవతెలంగాణ- ఖమ్మం

ప్రభుత్వాలు వసతి గృహ విద్యార్థుల సంక్షేమం మరిచాయని, సంక్షేమ వసతి గృహాల విద్యార్థులు గోడు ప్రభుత్వానికి పట్టదా అని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మంలోని ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ మధుసూదన్‌కి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ నాగుల్ మీరా, జిల్లా సహాయ కార్యదర్శి శివ నాయక్, గోపి తదితరులు పాల్గొన్నారు.

జీతాలు అడిగితే అరెస్టు చేస్తారా..? : సీఐటీయు

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండల ఆశా కార్యకర్తలు, జీపీ వర్కర్స్ చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్ళకుండా పోలీసులు వారిని అరెస్టు చేశారు. తమ సమస్యలు ప్రభుత్వానికి తెల్పటానికి హైదరాబాద్‌కు వెళ్తుంటే వారిని వెళ్ళకుండా పోలీసులు అరెస్టు చేసి అడ్డుకోవటంపై కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనను ఉద్దేశించి సీఐటీయు మండల కార్యదర్శి కే.నరేంద్ర మాట్లాడుతూ పది నెలలుగా వేతనాలు లేక జీపి కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సమ్మె కాలంలో గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రస్తుత ప్రభుత్వం అమలు జరపలేదన్నారు. ప్రభుత్వ నిరంకుశత్వ విధానానికి స్వస్తి పలికి కార్మికుల సమస్యపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు ఎల్లబోయిన రాధా, మండల అధ్యక్ష కార్యదర్శులు జంగా కళ్యాణి, వాంకుడోత్ కమల, భూక్యా సుజాత, మేదరి కుమారి, బుచ్చమ్మ, కష్టమ్మ, సావిత్రి, దేవి, గంలి జీపీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కె.హుస్సేన్, ఎస్.నాగేశ్వరరావు, బొళ్ల కొమరయ్య, గౌతమ్, బాలబోయిన వెంకన్న, గుగులోతు శ్రీను, ఆదెర్ల శీను, ఉమా, నాగరాజు, హరియ, హేమమచంద్ తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ రెయిన్‌బో ఉపాధ్యాయులకు అవార్డులు

నవతెలంగాణ-కూసుమంచి

జిల్లా ట్రస్మా(తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్ మెంట్) ఆధ్వర్యంలో సూరపునేని శేష కుమార్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలోని ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ క్రమంలో మండల కేంద్రంలోని గ్లోబల్ రెయిన్‌బో పాఠశాల నుంచి ఇద్దరు ఉపాధ్యాయులకు అవార్డు వరించింది. ఖమ్మంలోని ఎస్ఆర్ కన్వెషన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా జహ్నవి, అయోధ్య రాములకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అవార్డు ప్రదానం చేసి సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఎండీ ఎర్షద్ అహ్మద్ అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేని దన్నారు. వెలుగు చూపే మార్గదర్శకులన్నారు. పాఠశాల అకడమిక్ డైరెక్టర్ ఇంతియాజ్ అహ్మద్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి పాపారావు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

హామీని నెరవేర్చాలి

- తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ

చైర్మన్ డాక్టర్ కెవి కృష్ణారావు

నవతెలంగాణ-ఖమ్మం

తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కెవి కృష్ణారావు డిమాండ్ చేశారు . మంగళవారం ఖమ్మంలోని భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఖాళీ స్థలం, ఇంటి నిర్మాణం కోసం 10 లక్షల రూపాయలు వెంటనే అమలు చేయాలని, ప్రభుత్వా నామినేటెడ్ పోస్టులలో ఉద్యమకారులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యమకారులు బొమ్మేరా రామ్మూర్తి, డోకూపర్తి సుబ్బారావు, బత్తిన మధు గౌడ్, రవిచంద్ర చౌహాన్, పగడాల నరేందర్, జడల వెంకటేశ్వరావు, షేక్ నాగుల్ మీరా, భట్టు రాజేందర్ నాయక్, మంచికంటి నరేష్, లింగనబోయిన సతీష్, నెలవెల్లి వెంకటేశ్వరావు, పిట్టల నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మానవ రవాణాపై అవగాహన

నవతెలంగాణ - బోనకల్

ప్రపంచ అక్రమ మానవ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఎఫర్ట్ సంస్థ, చైల్డ్ రైట్స్, యు సంస్థ సహకారంతో మండలంలోని పలు పాఠశాలల్లో మంగళవారం పిల్లలకు, కమ్యూనిటీలలో ఉన్న ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జానకీపురం గ్రామంలోని ఉన్నత పాఠశాల యందు మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయురాలు కె హేమమాలిని, ఎఫర్ట్ సంస్థ కమ్యూనిటీ ఆర్గనైజర్ నరసమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు యోహాను, కె బేబీ, అంగన్వాడి టీచర్లు, ఆశా కార్యకర్తలు, ఆ గ్రామ యాక్టివిటీ లెర్నింగ్ సెంటర్ ఇంచార్జ్ దేవమణి తదితరులు పాల్గొన్నారు.

లైంగికదాడి కేసులో 20 ఏండ్ల జైలు శిక్ష

నవతెలంగాణ-ఖమ్మం లీగల్

బాలికపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తికి 20 ఏండ్ల జైలు శిక్ష విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి కె. ఉమాదేవి మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. రఘునాథపాలెం మండలం బూడిదంపాడు గ్రామానికి చెందిన 10 ఏండ్ల బాలిక 2022 నవంబర్ 26న ఇంటి బయట అడుకుంటుండగా నిందితుడు గంగిశెట్టి రాకేష్(20) తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రులకు జరిగిన విషయాన్ని చెప్పడంతో 2022 నవంబర్ 27న స్థానిక రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి కేసును విచారించి కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయాధికారి నేరం రుజువు కావడంతో పై విధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ప్రాసిక్యూటర్ ఏ. శంకర్, జి.హరీందర్ రెడ్డి, లైజన్ ఆఫీసర్ బి.రామూర్తి. కె. మోహన్ రావు, కోర్టు కానిస్టేబుల్ జి.రవి కిషోర్, హెూమ్ గార్డు ఎం.డి అయ్యూబ్ లు సహకరించారు.

గీతన్నల చైతన్య యాత్రను జయప్రదం చేయండి

- బోడపట్ల సుదర్శన్



నవతెలంగాణ-ఖమ్మం

ఆగస్టు 2న బొలగాని పుల్లయ్య వర్ధంతి, సర్దార్ సర్వాయి పాపన్న 374వ జయంతి, ఆగస్టు 18 వరకు జరిగే అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్ర జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బోడపట్ల సుదర్శన్ తెలిపారు. మంగళవారం ఖమ్మంలోని మంచి కంటి భవన్‌లో గీతన్నల చైతన్య యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభలు, సమావేశాలు జరిపి అమరవీరుల త్యాగాలను నేటి తరానికి తెలపాలని ఆయన అన్నారు. అన్ని గ్రామాలలో బైకు ర్యాలీలు ,అన్నదానాలు, వైద్య శిబిరాలు, రోగులకు పాలు, పండ్లు పంపిణీ తదితర కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి గాలి అంజయ్య, జిల్లా సహాయ కార్యదర్శి కొండం కరుణాకర్, సంఘం జిల్లా నాయకులు పామర్తి వాస్, మద్దెల పుల్లారావు, కారంగుల నాగేశ్వరరావు, అల్లాడి వెంకటేశ్వర్లు, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి నిధులు దక్కలేదు

• ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



నవతెలంగాణ-ఖమ్మం టౌన్

ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి ఏమి దక్కలేదని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. రాజ్యసభలో మంగళవారం ఆర్థిక సంవత్సరానికి గాను ప్రవేశపెట్టిన జాతీయ బడ్జెట్ పై చర్చలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల న్యాయమైన హక్కులను కేంద్ర ప్రభుత్వం దృష్టికి మరోసారి తెచ్చారు. బడ్జెట్‌పై తనకు మాట్లాడే అవకాశం ఇవ్వడం పట్ల కృతజ్ఞతలు చెప్పారు, ధన్యవాదాలు తెలిపారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా ఏడవ సారి బడ్జెట్ ను ప్రవేశపెట్టడం పట్ల ఆమెకు తెలిపారు. మా నాయకులు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు 14ఏండ్ల పాటు అహింసా మార్గంలో మహెూద్యమాన్ని నడిపించి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని గుర్తు చేశారు. తెలంగాణలో నెలకొన్న శాంతి భద్రతలు, ప్రశాంతత, ప్రభుత్వ కల్పిస్తున్న సౌకర్యాలు, ప్రోత్సాహంతో దేశ విదేశాలకు చెందిన పెట్టుబడిదారులు ఆకర్షితులై ఎన్నో పరిశ్రమలు నెలకొల్పారని అన్నారు. తమ రాష్ట్రం నుంచి 8మంది బీజేపీ ఎంపీలను గెలిపిస్తే రాష్ట్రానికి నిధులు తేవడంలో విఫలమయ్యారనే భావన ప్రజలలో నెలకొందన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి నిధులు సాధించనట్టయితే.. వారికి ఇవే మొదటి, చివరి గెలుపుగా మిగలనుందని చెప్పారు. అయోధ్య తర్వాత ప్రసిద్ధి చెందిన భద్రాచలం రాముల వారి ఆలయానికి కొన్ని కిలోమీటర్ల దూరంలోనే ఉన్న కొత్తగూడెంలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ ఏర్పాటు చేయాలన్నారు. ఖాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ,బయ్యారంలో ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్పాలని, సమ్మక్క-సారలమ్మ గిరిజన యూనివర్సిటీకి మరిన్ని నిధులు కేటాయించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించారు, తెలంగాణకు ఎందుకు ఎందుకు ఇవ్వలేదన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ వాగ్దానాల అమలుకు
ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

- వ్యవసాయ కార్మిక సంఘం రౌండ్ టేబుల్ సమావేశం పిలుపు
- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు
- రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

నవతెలంగాణ-వైరాటౌన్

వ్యవసాయ కూలీల రేట్లు పెంపుదల, రైతాంగం పండించిన పంటకు గిట్టుబాటు ధరలు, రాష్ట్ర ప్రభుత్వం చేసిన వాగ్దానాల అమలకు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని వ్యవసాయ కార్మిక సంఘం రౌండ్ టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది. వ్యవసాయ కూలీ పనులు రోజురోజుకు తగ్గుతున్న ఈ తరుణంలో ఉన్న పనికి కూడా సరైన వేతనం, కూలి అందక పేదలు, వ్యవసాయ కూలీల కుటుంబాలు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాయని, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలు అమలు చేయడంలో జాప్యం చేస్తున్నదని, ముందుగా వ్యవసాయ కూలీల నుండి పథకాల అమలు ప్రారంభించాలని, సంవత్సరానికి రూ.12వేలు ఇస్తామని, 150 రోజులు పని కల్పిస్తామని, కూలి వేతనం రోజువారీగా 400 ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వాగ్దానం అమలు చేయాలన్నారు. రైతాంగం పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వాలని, కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లో రైతాంగానికి అధిక నిధులు కేటాయించాలని, కౌలు రైతులకు రూ.15వేలు ఇస్తామని చేసిన వాగ్దానం అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక బోడెపుడి వెంకటేశ్వరరావు భవనంలో వ్యవసాయ కార్మిక సంఘం వైరా రూరల్ మండల కార్యదర్శి తూము సుధాకర్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముందుగా వక్తలను వేదిక మీదకి వ్యకాస పట్టణ కార్యదర్శి గుమ్మా నరసింహారావు ఆహ్వానించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ వ్యవసాయ కూలీలు రెండు రెక్కలు ఆస్తిగా, చెమట చుక్కలే పెట్టుబడిగా భూమిపై పనిచేస్తూ పంటలు పండిస్తూ సమాజంలో అందరికీ ఆహారాన్ని అందిస్తున్న వ్యవసాయ కూలీలు అర్ధాకలితో జీవిస్తున్నారని, వీరి అభివృద్ధికి ప్రభుత్వాలు పథకం ప్రకారం కృషి చేయాలన్నారు. రోజురోజుకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు పెంచాలన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించిన వ్యవసాయ రంగంలో వివిధ పనులకు వివిధ రేట్లు ప్రకటించిందని, వాటిని అమలుకు రాష్ట్ర స్థాయి అధికారులు, జిల్లా కలెక్టర్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు గ్రామ కార్యదర్శులు స్థాయిలో అమలయేటట్లు చూడాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.



కేంద్ర ప్రభుత్వం సంవత్సరానికి 200 రోజులు ఉపాధి పని కల్పించి, రోజు కూలి 600 చొప్పున కూలి ఇవ్వాలన్నారు. ఉపాధి సమస్యలు, కూలీరేట్ల పెంపు రాష్ట్ర ప్రభుత్వం వాగ్దానాల అమలు చేయాలని కోరుతూ గ్రామస్థాయిలో చైతన్య పూరితమైన ప్రచారాన్ని నిర్వహిస్తున్నామని, దశల వారీగా అన్ని ప్రజా సంఘాలను కలుపుకొని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, ఐద్వా వైరా పట్టణ, రూరల్ కార్యదర్శులు గుడిమెట్ల రజిత, షేక్ షైనాబీ, సీఐటీయూ మండల కన్వీనర్ బాజోజు రమణ, రైతు సంఘం నాయకులు వనమా చిన్న సత్యనారాయణ, బాణాల శ్రీనివాసరావు, చితనిప్పు చలపతిరావు, మల్లెంపాటి ప్రసాదరావు, సోషల్ మీడియా పట్టణ కన్వీనర్ గుడిమెట్ల మోహన్ రావు, డివైఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు చిత్తారు మురళి, షేక్ నాగుల్ పాషా, షేక్ రెహనా, షేక్ ఫాతిమా, షేక్ మజీద్ బి, వడ్లమూడి మధు, కెన్నెర మోతి, పుచ్చకాయల రామయ్య, పల్లెబోయిన కృష్ణ, పద్మారావు పాల్గొన్నారు.



వ్యవసాయ కూలీ రేట్లు పెంచాలి

• వ్యవసాయ కార్మిక సంఘం రౌండ్ టేబుల్ సమావేశంలో పొన్నం

నవతెలంగాణ-చింతకాని

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కూలీ రేట్లు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలో సీపీఐ(ఎం) కార్యాలయంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ కార్మిక సంఘం రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయలేదన్నారు. మహిళకు 2500, వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ.12 వేలు, 500కే గ్యాస్ సిలిండర్, కౌలు రైతులకు ఉచితంగా సంవత్సరానికి రూ.15 వేలు, పింఛన్ రూ.4వేలు ఇస్తామని అనేక వాగ్దానాలు చేశారని అన్నారు. వీటన్నింటిని వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనియెడల వ్యవసాయ కార్మికుల తరఫున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, వత్సవాయి జానకిరాములు, రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు మద్దిన్ని బసవయ్య, తోటకూర వెంకట నరసయ్య, దేశ బోయిన ఉపేందర్, గడ్డం కోటేశ్వరరావు, లింగం కోటి పాల్గొన్నారు.

మెరుగైన పీఆర్సీలు ఇప్పించిన ఘనత పీఆర్టీయూదే

నవతెలంగాణ-తల్లాడ

ఉపాధ్యాయులకు మెరుగైన పీఆర్సీ ఇప్పించిన ఘనత పీఆర్టీయూదేనని సంఘం జిల్లా అధ్యక్షులు ఎలమద్ది వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం తల్లాడ మండలంలో పీఆర్టియు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని అన్నారుగూడెం, బిల్లుపాడు, నూతనకల్లు, మిట్టపల్లి, కుర్నవల్లి, పినపాక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించిన అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఉపాధ్యాయులకు ప్రమోషన్లు, పండిట్, పీఈటీలను అప్ గ్రేడ్ చేయించిన ఘనత తమదే అన్నారు.

ఆశా వర్కర్లు అరెస్ట్



నవతెలంగాణ-వైరాటౌన్

తమ సమస్యలను పరిష్కరించాలని మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నాలో పాల్గొనేందుకు వెళుతున్న ఆశా వర్కర్లు శైలజ, రేణుక, మల్లేశ్వరి, అదికుమారిలను పోలీసులు అరెస్టు చేసి వైరా పోలీసు స్టేషన్ లో ఉంచారు. అనంతరం వారిని విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయు వైరా పట్టణ కన్వీనర్ అనుమోలు రామారావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయకుండా, ఆశా వర్కర్లు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండ వారిని అరెస్ట్ చేయడం అవమానకరమైన చర్య అని అన్నారు. అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరన్నారు.



డాక్టర్లు లేరు.. మందులు ఉండవు

--పేద ప్రజలకు అందని వైద్యం

-- ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంపీపీ

నవతెలంగాణ-కల్లూరు

రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్య మా లక్ష్యం అంటూ ప్రకటన చేయటం తప్పా, ఆచరణలో ఎక్కడ కనపడలేదని, పేదలకు మెరుగైన వైద్యం అందటం లేదని ప్రభుత్వ ఆస్పత్రిలో స్పష్టంగా కనిపిస్తున్నదని ఎంపీపీ బీరవల్లి రఘు అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో జ్వర పీడితులు అధికంగా ఉన్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో కేవలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నవ్య కాంత్, మరో డాక్టర్ మాత్రమే పనిచేస్తున్నారు. వైద్యం కోసం వచ్చిన రోగులను వైద్యం ఎలా అందుతుందని ప్రశ్నించగా డాక్టర్లు లేరని, మందులు కొరత ఉందని, వైద్యం సక్రమంగా లేదని ఎంపీపీ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై అక్కడున్న వైద్యాధికారి నవ్య కాంత్‌ను ప్రశ్నించగా ప్రాథమికోన్నత, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో పనిచేస్తున్న ఒక్క డాక్టర్ ఇటీవల బదిలీపై వెళ్లగా ఇన్చార్జిగా ఉన్న పెనుబల్లి ఆస్పత్రి వైద్యులు రమేష్ గత మూడు రోజుల నుండి ఆస్పత్రికి రావటం లేదని ఎంపీపీ దృష్టికి తెచ్చారు. పీహెచ్‌సిలో మొత్తం ఐదుగురు డాక్టర్లు ఉండగా ఇద్దరు డిప్యూటేషన్‌పై వెళ్లారని, కేవలం ముగ్గురు మాత్రమే పనిచేస్తున్నామని తెలిపారు. మందులు సక్రమంగా వస్తున్నాయా లేదా అని సిబ్బందిని ప్రశ్నించగా కొన్ని మందులు కొరత ఉందని చెప్పారు. వర్షాకాలం సీజన్ వ్యాధులు అధికం కాకముందే అన్ని రకాల చర్యలు చేపట్టాలని, ఆస్పత్రికి వచ్చిన వారికి సక్రమమైన వైద్యం అందించాలని సూచించారు.

అద్దె ప్రాతిపదికన ఆర్టీసీ బస్సులు

- ప్రయాణికుల అవసరాల దృష్ట్యా మూడు డీలక్స్ బస్సులు ప్రారంభం
- సత్తుపల్లి డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి

నవతెలంగాణ-కల్లూరు

వివాహాది శుభకార్యాలకు, పిక్నిక్, విహారయాత్రాలకు మరి ఏ ఇతర అవసరాలకైనా అద్దె ప్రాతిపదికన ఆర్టీసీ బస్సులు ఇవ్వనున్నట్లు సత్తుపల్లి డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి తెలిపారు. మంగళవారం కల్లూరు బస్టాండ్ ను సందర్శించిన అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఖమ్మం రోడ్‌లో మూడు డీలక్స్ బస్సులను అదనంగా నడుపుతున్నట్లు ఆమె తెలిపారు. డీలక్స్ బస్సులలో ప్రయాణించే మహిళా ప్రయాణికులకు గిఫ్ట్ బాక్సులు ఏర్పాటు చేశామని, మహిళా ప్రయాణికులు తమ ప్రయాణం పూర్తయిన తర్వాత టికెట్టు వెనక ఫోన్ నెంబర్ రాసి బాక్సులో వేసినట్లయితే, ప్రతి 15 రోజులకు ఒకసారి లక్కీ డ్రా తీసి బహుమతులు అందించనున్నట్లు ఆమె తెలిపారు. సత్తుపల్లి డిపో పరిధిలో సత్తుపల్లి, వీయం బంజర, అశ్వారావుపేట బస్టాండ్లలో ఖాళీగా ఉన్న షాపులకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఆగస్టు 7తో టెండర్ల ప్రక్రియ ముగుస్తుందన్నారు. ఆసక్తి కలిగిన వారు టెండర్లలో పాల్గొనవచ్చునని అన్నారు. శ్రావణమాసంలో మంచి ముహూర్తాలు ఉన్నందున పల్లె వెలుగు, ఎక్స్ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ, ఏసీ బస్సులను సైతం అద్దె ప్రాతిపదికన అందించనున్నట్లు చెప్పారు. కావలసిన వారు ముందుగా బుక్ చేసుకోవచ్చు అని ఆమె వివరించారు. ఆగస్టు 1న కల్లూరు బస్టాండ్ లో జరుగు వన మహెూత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే ప్రదేశాన్ని కల్లూరు గ్రామపంచాయతీ ఈవో నాగేశ్వరరావుతో కలిసి పరిశీలించారు.

రైతుల్లో ఆనందం చూస్తున్నాం

• కాంగ్రెస్ సీనియర్ నాయకులు చామకూరి

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

అనుకున్న సమయం కంటే ముందుగానే రైతులకు రుణమాఫీ చేయడంతో రైతుల ముఖాల్లో ఆనందాన్ని చూస్తున్నామని మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చామకూరి శ్రీనివాస్ సంతోషం వ్యక్తం చేశారు. మంగళవారం తెలంగాణ ప్రభుత్వం రెండవ విడత రైతులకు రూ.1.50ల లోపు రుణమాఫీ చేయగా, నేరుగా రైతుల ఖాతాలోకి నిధులు విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రైతులకు రుణమాఫీ చేసిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బాల్యవివాహాలు, మానవ అక్రమ రవాణాను అరికట్టాలి : ఎస్ఐ

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

బాల్య వివాహాలు మానుకోవాలి, మానవ అక్రమ రవాణాని అరికట్టాలని స్థానిక ఎస్సై గిరిధర్ రెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ (ఏఐడీ) సంస్థ ఆధ్వర్యంలో పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల, కళాశాల విద్యార్థులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్సై గిరిధర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ సమాజంలో ఎంతోమంది తెలిసి తెలియక ఆడపిల్లలకు 18 సంవత్సరాలు పూర్తి కాకుండానే వివాహాలు చేస్తుంటారని, దాని ద్వారా వారికి ఎన్నో రకాల ఇబ్బందులు ఎదురవుతాయని, ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్స్. ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు రామయ్య, నరసింహారావు మురళీకృష్ణ, డాక్టర్ బి.శ్రీధర్ కుమార్, ఏఐడీ సంస్థ బాధ్యులు భాస్కర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో జరిగిన అభివృద్ధి క్షేత్రస్థాయి పరిశీలన

• అధికారులతో సమీక్ష సమావేశం



నవతెలంగాణ-కల్లూరు

మండల పరిధిలోని కొర్లగూడెం గ్రామపంచాయతీ నందు కేంద్ర ప్రభుత్వం నుండి స్టడీ టూర్‌కు వచ్చిన అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు అన్ని శాఖల అధికారులతో ఎంపీడీఓ ఈ.చంద్రశేఖర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అన్ని శాఖల నుండి అభివృద్ధి కార్యక్రమాలు గురించి తెలుసుకున్నారు. అదేవిధంగా రైతువేదికను సందర్శించి రైతులకు ప్రభుత్వం నుండి అందుతున్న సహాయ సహకారాల గురించి, ఏ పంటలు సాగు చేస్తున్నారు. ప్రభుత్వం నుండి ఎటువంటి సహాయం అందుతుంది, రుణమాఫీ గురించి తెలుసుకోన్నారు. గ్రామంలో రేషన్ దుకాణం స్వయం సహాయక సంఘాల నిర్వహణ, రోడ్లు, డ్రయినేజీ పరిసరాల పరిశుభ్రత అందరితో కలిసి పరిశీలించారు.

మెస్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలి

• కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్

నవతెలంగాణ-ఖమ్మం

గత ఆరు మాసాలుగా పెండింగ్‌లో ఉన్న హాస్టల్ మెస్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద గల ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిపార్ట్మెంట్ అటాచ్డ్ హాస్టళ్లలను మనోహర్ సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సర్వేలో అనేక అంశాలు వెల్లడయ్యాయని, జిల్లా కేంద్రంలో ఉన్నటువంటి డీఏహెచ్ హాస్టల్స్‌లలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బాత్రూం, లెట్రిన్స్ లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. హాస్టల్‌లో పనిచేస్తున్న వర్కర్లకు అరకొరగా ఇస్తున్న కొద్దిపాటి వేతనాలు కూడా గత ఆరు మాసాలుగా రాకపోవడంతో బిక్కు బిక్కుమంటూ పూట గడుపుతున్నారని సర్వేలో వర్కర్లు వాపోయారని అన్నారు. ప్రీమెట్రిక్ హాస్టల్స్ లో మాదిరిగా డిఎహెచ్ హాస్టల్ వర్కర్లను అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్యూర్ ఫైడ్ వాటర్ ప్లాంట్, కిటికీలకు దోమజాలీలు, డైనింగ్ హాల్స్, హాస్టల్ నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలను వెంటనే జిల్లా అధికారులు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హాస్టల్స్ సమస్యలపై అధికారులు స్పందించకపోతే రానున్న కాలంలో కెవిపిఎస్ ఉద్యమించనున్నట్లు హెచ్చరించారు.



పారా వెంకట రామమ్మకు నివాళి

నవతెలంగాణ - బోనకల్

మండల పరిధిలోని ఆళ్లపాడుకు చెందిన పారా వెంకట రామమ్మ చిత్రపటానికి డీసీసీబీ మాజీ చైర్మెన్ కూరాకుల నాగభూషణం మంగళవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వెంకట్ రావమ్మ ఈనెల 20న అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన వెంట కూరకుల నాగభూషణం సతీమణి యాదమ్మ సీపీఐ(ఎం) గ్రామ శాఖ కార్యదర్శి బండి నాగేశ్వరరావు, నాయకులు పారా వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ మర్రి తిరుపతి రావు కుటుంబ సభ్యులు ఉన్నారు.



పంచాయతీ కార్యదర్శి పరుశురాంకు ఘన సన్మానం

నవతెలంగాణ-బోనకల్

మండల పరిధిలోని ఆళ్లపాడు గ్రామపంచాయతీ కార్యదర్శి జొన్నలగడ్డ పరశురామును ఎస్సై కడగండ్ల మధుబాబు, గ్రామస్తులు మంగళవారం ఆళ్లపాడులో ఘనంగా శాలువాతో సన్మానించి వీడ్కోలు పలికారు. ఆళ్లపాడు పంచాయతీ కార్యదర్శిగా పరశురాము 5వేల పాటు పనిచేశారు. ఈ సందర్భంగా ఎస్సై మధుబాబు, కాంగ్రెస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు కందుల పాపారావు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల కాలంలో గ్రామపంచాయతీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు బుంగ రాములు, నాయకులు పారా వెంకట మోహన్ రావు, తోటకూర వెంకటేశ్వరరావు, మంద రామారావు, మరీదు బరకయ్య, షేక్ నాగుల్ మీరా, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగర్ జలాలను తక్షణమే విడుదల చేయాలి

- షరతులు లేకుండా రైతు రుణమాఫీ అమలు చేయాలి
- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు డిమాండ్

నవతెలంగాణ-నేలకొండపల్లి

ఎగువ రాష్ట్రాలలో కురుస్తున్న వర్షాలతో శ్రీశైలం డ్యాం ద్వారా నాగార్జునసాగర్ జలాశయానికి నీరు చేరుతున్నందున నేలకొండపల్లి మండలంతో పాటు పరిసర ప్రాంతాలలో రైతులు వానాకాలం పంటలు సాగు చేసుకునేందుకు ప్రభుత్వం తక్షణమే సాగర్ ఎడమ కాలువ, పాలేరు పాత కాలువ ద్వారా జలాలను విడుదల చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఐ(ఎం) కార్యాలయం రావెళ్ల సత్యనారాయణ భవనంలో తెలంగాణ రైతు సంఘం సమావేశం మారుతి కొండలరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు విస్తారంగా కురుస్తాయన్న వాతావరణ శాఖ ప్రకటనలతో ఇప్పటికే మండల వ్యాప్తంగా చాలామంది రైతులు వరినార్లు కూడా పోశారన్నారు. మరి కొంతమంది రైతులు నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారన్నారు. ముందస్తుగా వరినారులు పోసిన రైతులు నారుమడులు పెరిగిపోతుండడంతో సాగర్ జలాల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. కురుస్తున్న వర్షాలతో జలాశయాలలో పూర్తిస్థాయిలో నీరు చేరుతుండడంతో ప్రభుత్వం సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి నీటి విడుదలలో జాప్యం లేకుండా చూడాలన్నారు. రైతు రుణమాఫీలో ఎటువంటి షరతులు లేకుండా రెండు లక్షల రుణం ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ అందజేయాలన్నారు. కొన్ని బ్యాంకులు రుణమాఫీ డబ్బులు రైతుల ఖాతాలో జమ చేసేందుకు మిగతా బ్యాంకులలో అప్పులు లేనట్లుగా నోడ్యూ సర్టిఫికెట్ తీసుకురమ్మని ఇబ్బందులకు గురి చేయటం సరైనది కాదన్నారు. రెండు లక్షల లోపు రుణం ఎన్ని బ్యాంకుల్లో ఉన్న ఆయా రైతులందరికీ రుణమాఫీ అందజేయాలన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం నాయకులు రచ్చ నరసింహారావు, ఇంటూరి అశోక్, రాసాల కనకయ్య, కట్టెకోల వెంకన్న, ఆలగడప అంజయ్య, బలుసు హనుమంతరావు, చింతలపాటి భాస్కర్, గురజాల వెంకటేశ్వర్లు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



వైరా రిజర్వాయర్ ఆయకట్టకు సాగునీరు విడుదల చేయాలి

• తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆయకట్టు రైతులు ఇరిగేషన్ అధికారులకు వినతి

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా రిజర్వాయర్ ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయాలని, సాగర్ జలాలతో నింపాలని తెలంగాణ రైతు సంఘం, రిజర్వాయర్ ఆయకట్టు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఇరిగేషన్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ గత రబీ సీజన్లో రిజర్వాయర్ ఆయకట్టులో సాగునీరు విడుదల చేయకపోవడం వల్ల పంటలు వేయలేదని అన్నారు. ఈ సీజన్లో వర్షాలు సానుకూలంగా కురుస్తున్న నేపథ్యంలో వరి సాగుకు నీరు విడుదలపై సత్వరమే నిర్ణయం చేయాలని డిమాండ్ చేశారు. రిజర్వాయర్ నుంచి మిషన్ భగీరథ మంచినీరు పంపిణీకి వినియోగించిన నీటిని సాగర్ జలాలతో నింపాలని, అలా ప్రభుత్వం చేయకపోవడంతో సాగు నీరు విడుదల కాక 20 వేల ఎకరాల్లో సాగు ప్రశ్నార్థకంగా మారుతోందని, సాగర్ జలాలతో రిజర్వాయర్‌ను నింపాలని కోరారు. ఆగస్టు మొదటి, రెండవ వారంలో గోదావరి జలాలు వైరా రిజర్వాయర్‌కు విడుదల చేయుటకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం చేసినందున వరి నాట్లు అలస్యం కాకుండా ప్రస్తుతం ఉన్న నీరు నారుమళ్లకు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం వైరా పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, జిల్లా కమిటీ సభ్యులు వనమా చిన్న సత్యనారాయణ, పైడిపల్లి సాంబశివరావు, హరి వెంకటేశ్వరరావు, బెజవాడ వీరభద్రం, కురుగుంట్ల శ్రీనివాసరావు, పల్లెబోయిన కృష్ణ, పారుపల్లి కృష్ణారావు, మాడపాటి మల్లికార్జున్, మాడపాటి వెంకట్, మల్లెంపాటి ప్రసాదరావు, పుచ్చకాయల రామయ్య చిత్తారు మురళి, కొంగర సుధాకర్, సామినేని గోవిందరావు, రుద్రాక్షల నరసింహాచారి, వడ్లమూడి మధు, సీఐటీయూ జిల్లా నాయకులు సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, బాజోజు రమణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గుమ్మా నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

మరోసారి వార్తల్లోకి ఎక్కిన తెల్లం...

- బీఆర్ఎస్ శాసనసభ్యులతో ఎమ్మెల్యే చిట్ చాట్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు మరోసారి వార్తల్లో నిలిచారు. మంగళవారం శాసనసభ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ శాసనసభ పక్ష కార్యాలయానికి తెల్లం వెళ్లి బీఆర్ఎస్ శాసనసభ్యులతో చిట్‌చాట్ నిర్వహించిన ఫోటోలు సోషల్ మీడియా వేదిక హల్చల్ చేస్తుండగా పార్టీ మార్పుపై అనేక రకాల పుకార్లు షికారులు చేస్తున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గులాబీ జెండా కారు గుర్తుపై గెలిచిన ఏకైక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు తన రాజకీయ గురువు అయిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ తీర్థాన్ని పుచ్చుకున విషయం తెలిసిందే. అనంతరం మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో మరొక 9 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సైతం కాంగ్రెస్లో చేరగా ఆ సంఖ్య మొత్తం పది అంతేకాకుండా కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలకు తగిన ప్రాధాన్యత ఇవ్వటం లేదన్న నేపంతో మంగళవారం గద్వాల్ ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి సైతం తిరిగి బీఆర్ఎస్ గూటికి చేరిన కొన్ని గంటల్లోనే తెల్లం బీఆర్ఎస్ శాసనసభ పక్ష కార్యాలయంలో ప్రత్యక్షమవడం ఇప్పుడు రాజకీయ చర్చకు అవకాశం ఇస్తుంది. ఈ నేపథ్యంలో తెల్లం సైతం తిరిగి సొంత గూటికి చేరటంలో ఎటువంటి ఆశ్చర్యం లేదని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఏదేమనప్పటికీ భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు మరోసారి వార్తలు నిలిచారని స్పష్టమవుతుంది.

అసత్య ప్రచారాన్ని నమ్మొద్దు : తెల్లం



అసెంబ్లీ లాబింగ్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి టీ తాగిన ఫోటోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ పార్టీ మారుతున్నానని తనపై చేసిన దుష్ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దు. ఎట్టి పరిస్థితులలో కాంగ్రెస్ పార్టీని వీడేది లేదు. నియోజకవర్గ అభివృద్ధి కోసం పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీలో చేరానని చివరి వరకు కాంగ్రెస్ పార్టీతోనే కలిసి ప్రయాణం చేస్తానని ఎట్టి పరిస్థితులలో అనాలోచిత నిర్ణయాలు తీసుకోనని ఆయన ఈ సందర్భంగా పత్రిక ముఖంగా తెలియజేశారు. కావాలనే కొందరు ఇటువంటి దుష్ప్రచారాన్ని చేస్తున్నారని అటువంటి ప్రచారాలను పార్టీ కార్యకర్తలు నియోజవర్గ ప్రజలు నమ్మవద్దని తెల్లం కోరారు.

స్వచ్ఛ కార్మికులకు రూ.10వేల వేతనం చెల్లించాలి

పాల్వంచ : స్వచ్ఛభారత్ పేరుతో ఇంటింటికీ చెత్త సేకరిస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, మున్సిపాలిటీ నుంచి రూ.10వేల వేతనాలు చెల్లించాలని, హరితహారం పేరుతో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు బండి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛ కార్మికులతో కలిసి మున్సిపల్ కమిషనర్ స్వామికి సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా జీతభత్యాలు లేకుండా ఇంటింటి చెత్త సేకరణ చేస్తూ మున్సిపాలిటీకి అనేక అవార్డులు రావటానికి కారణమైన స్వచ్ఛ కార్మికులను వేతనాలు చెల్లించి ఆదుకోవాలన్నారు. సమస్యలపై స్పందించిన కమిషనర్ స్వామి తన పరిధిలో ఉన్న సమస్యలన్నిటినీ త్వరితగతిన అమలు చేయటానికి చర్యలు చేపట్టనున్నట్టు, ఉన్నతాధికారుల పరిధిలో ఉన్న సమస్యలపై జిల్లా, రాష్ట్ర అధికారులకు లేఖ ద్వారా తెలియజేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి ఇట్టి వెంకట్రావు, వనపర్ల జకరయ్య, వల్లపు యాకయ్య, శనగరపు శ్రీనివాసరావు, మన్యం వెంకన్న, కార్మికులు దారావత్ బాలాజీ, నాగరాజు, యాకుబ్ పాషాలి తదితర కార్మికులు పాల్గొన్నారు.

సబ్ జైలును సందర్శించిన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి

నవతెలంగాణ-ఇల్లందు



ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి ఇల్లందు సబ్ జైలును మంగళవారం సందర్శించారు. అనంతరం పలు రికార్డులు తనిఖీ చేశారు. ఖైదీలకు మెనూ ప్రకారం సదుపాయాలు అందుతున్నాయో లేవో అని వారిని అడిగి తెలుసుకున్నారు. ఖైదీలు వర్షాకాలంలో వ్యాధుల బారిన పడకుండా పరిశుభ్రత పాటిం చాలని, ఆర్థిక స్తోమత లేని ఖైదీలకు ఫ్రీ లీగల్ ఎయిడ్ క్లినిక్ ద్వారా న్యాయ వాదిని నియమిస్తామని సందర్భంగా వారు తెలిపినారు. ఈ కార్యక్రమంలో సబ్ జైల్ సూపరింటెంట్ ఎస్.చంద్రశేఖర్, హెడ్ వార్డెన్ సిహెచ్.భుజరంగ రాజు, సబ్ జైల్ సిబ్బంది కె.శ్రీనివాస్ లీగల్ ఎయిడ్ న్యాయవాదులు కే.ఉమామహేశ్వరరావు, కీర్తి కార్తీక్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేద రైతుల కల సాకారం

- ఎన్నికల హామీని నిలబెట్టుకున్న కాంగ్రెస్
- సొసైటీ మాజీ చైర్మెన్ పోతిరెడ్డి

నవతెలంగాణ-బూర్గంపాడు



ఎన్నికల సందర్భంగా రైతు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ తన వాగ్దానాన్ని నిలబెట్టుకుందని బూర్గంపాడు మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి అన్నారు. ఆగస్టు 15 లోపు రైతు రుణమాఫీ చేస్తానని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన విధంగా దశలవారీగా మొదట లక్ష రూపాయలు, రెండో విడత లక్షన్నర రుణమాఫీ చేసిన ముఖ్యమంత్రి ఆగస్టు 15లో మూడో విడత రెండు లక్షలు రుణమాఫీ చేయనున్నారని ఆయన తెలిపారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదల పక్షపాతిగా, రైతు పక్షపాతిగా కాంగ్రెస్ పార్టీ నిలిచిందని ఆయన పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కాంగ్రెస్ పార్టీ కృతనిచ్చేయంతో ఉన్నదని ఆయన తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఆవు, ఎద్దు మృతి

ఆళ్ళపల్లి : అనుమానాస్పదస్థితిలో ఆవు, ఎద్దు మృతి చెందిన ఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధిత రైతుల కథనం ప్రకారం మండల పరిధిలోని చింతోళ్లగుంపు గ్రామం చింత రామకృష్ణకు చెందిన రెండు ఆవు, ఎద్దు మంగళవారం మధ్యాహ్నం లక్ష్మీపురం ఎట్టి శ్రీను వ్యవసాయ భూమిలో అనుమానాస్పదంగా విగతజీవిగా కనిపించాయన్నారు. మైదానంలో మొత్తం 6 పశువులు మేత మేస్తూ ఉండగా అందులో రెండు మాత్రమే చనిపోవడం జరిగిందన్నారు. పశువుల మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

విద్యార్థులకు యూనిఫాం అందించండి

- మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎండీ యాకూబ్ పాషా

నవతెలంగాణ-పాల్వంచ

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మైనారిటీ గురుకుల విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు యూనిఫాంలు తక్షణమే అందించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎండీ యాకూబ్ పాషా ప్రభుత్వాన్ని మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. జూన్ 1న కళాశాలలు, జూన్ 12న పాఠశాలలు ప్రారంభమై నెల దాటినా, నేటి వరకు విద్యార్థులకు మైనారిటీ గురుకుల సంస్థ వారు యూనిఫాంలను అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది 204 మైనారిటీ గురుకుల పాఠశాలలు, 204 మైనారిటీ గురుకుల కళాశాలలో సుమారు 1,25,218 మంది విద్యార్థులు ప్రవేశం పొందారని, వీరందరూ యూనిఫాంల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని, యూనిఫాంల పంపిణీలో జాప్యం వల్ల విద్యార్థులలో తీవ్ర అసౌకర్యం, అసమానతలు ఏర్పడుతున్నాయని, విద్యార్థులలో సమానత్వం, క్రమ శిక్షణని పెంపొందించటంలో యూనిఫాంలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. సీఎం వెంటనే స్పందించి రాష్ట్ర వ్యాప్తంగా గల గురుకులాల్లో ఉన్న విద్యార్థులకు యూనిఫాంలు అందించి వారిలోని వేరుబాటు తనాన్ని రూపుమాపాలని కోరారు.

పశువైద్యాధికారి మన్యం రమేష్ బదిలీ

దమ్మపేట : మండల పశువైద్యాధికారిగా పనిచేస్తున్న మన్యం రమేష్ బదిలీ అయ్యారు. ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా ఆయన ఖమ్మం జిల్లాలోని వనంవారి కిష్టాపురం పశువైద్యాధికారిగా బదలీ కాబడ్డారు. కాగా మంగళవారం స్థానిక కార్యాలయంలో వినాయకపురం పశువైద్యాధికారిని స్వప్న నూతన బాధ్యతలు చేపట్టారు. మన్యం రమేష్ మండలంలోని దమ్మపేట, పట్వారిగూడెం, నాగుపల్లి కేంద్రాల్లో 17ఏళ్ళుగా విధులు నిర్వహించారు. అదే విధంగా దమ్మపేట గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారిగా పనిచేశారు. వీడ్కోలు సమావేశంలో ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరావు, వైస్ ఎంపీపీ దారా మల్లిఖార్జునరావు, అంకత ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల అక్రమ అరెస్టులను ఖండించండి : సీఐటీయూ

నవతెలంగాణ-ఇల్లందు



ఆశా వర్కర్లు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఛలో కమిషనరేట్ పిలుపునిచ్చారు. దాన్ని నిలువరించడానికి పరిధిలో పనిచేస్తూ ఉన్న ఆశా వర్కర్లను రాత్రి ఇల్లందు పోలీసులు అరెస్టు చేశారు. సమాచారం అందుకున్న సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నబి, సీఐటీయూ మండల కార్యదర్శి తాలూరి కృష్ణ తదితరులు పోలీస్ స్టేషన్కు వెళ్లారు. సమస్యల సాధనకై హైదరాబాద్ వెళ్తున్న ఆశ వర్కర్ల అరెస్టు సరికాదని, రాత్రిపూట అరెస్టు చేయడం సరికాదని ఈ చర్యలు తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పోలీసులు కేసు నమోదు చేసుకుని విడిచిపెట్టారు. అనంతరం ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా సహాయ కార్యదర్శి చీమల రమణ మాట్లాడారు. న్యాయమైన డిమాండ్ల సాధనకు కృషి చేయకుండా పోలీసులతో నిర్బంధించం సరికాదని అన్నారు. తాళ్లూరి కృష్ణ మాట్లాడుతూ ప్రజా పాలన సాగిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి నిర్బంధాలు విధించడం సరికాదని అన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రకళ, సావిత్రి, అమల, నాగలక్ష్మి, మణెమ్మ, ఝాన్సీ, రాంబాయి, కళ, కౌసల్య కమల, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

5న సింగరేణి పరిరక్షణ యాత్ర ముగింపు బహిరంగ సభ

విజయవంతం చేయాలి

- హాజరుకానున్న పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ ఎంపీ విజయరాఘవన్
- బొగ్గు బ్లాకులను వేలం పెట్టడం దుర్మార్గం
- విలేకర్ల సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కనకయ్య



నవతెలంగాణ-కొత్తగూడెం

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న సింగరేణి పరిరక్షణ యాత్ర ముగింపు బహిరంగసభను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య పిలుపు నిచ్చారు. ఈ బస్సుయాత్రకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీరయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, ఆశయ్యలు నాయకత్వం వహిస్తున్నారని తెలిపారు. మంగళవారం స్థానిక మంచికంటిభవన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో కనకయ్య మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం బొగ్గు గనులను వేలం వేస్తూ ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో సింగరేణి సంస్థకు ఇవ్వాల్సిన బొగ్గు బ్లాకులను వేలంలో పెట్టడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఒకవైపు వేలం వేస్తూ మరోవైపు సింగరేణి సంస్థను ప్రయివేటీకరించడం లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. లాభాల్లో ఉన్న సింగరేణి సంస్థకు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న బొగ్గు బ్లాకులను కేటాయించాలని, సింగరేణి సంస్థను రక్షించుకునేందుకు సీపీఐ(ఎం) నిర్వహిస్తున్న పోరాటంలో ప్రజలంతా పాల్గొనాలని కోరారు. సింగరేణి సంస్థ ద్వారా బొగ్గు అన్వేషణ చేయించి, ప్రయివేటు వారికి కట్టబెట్టడం సరికాదన్నారు. సింగరేణి సంస్థద్వారా ఏడాదికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వేల కోట్లు పన్నుల రూపంలో చెల్లి స్తున్నారని, ఇదే ప్రయివేటు వారికి కట్టబెడితే పన్నులు వచ్చే అవకాశం లేదన్నారు. విద్యుత్ సంస్థలు నేడు సింగరేణి ద్వారా తక్కువ ధరకు బొగ్గు కొనుగోలు చేస్తున్నాయన్నారు. ప్రయివేటు వారి చేతుల్లోకి బొగ్గు బావులు చేరితే రేటు పెంచే ప్రమాదం ఉందన్నారు. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న 30 వేల మంది కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, శ్రావణ పల్లి బొగ్గు బ్లాకును సింగరేణికి కేటాయించాలని, కార్మికుల సొంత ఇంటి కల అమలు చేయాలని, సింగరేణి పరిరక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందిచాలని, అసెంబ్లీలో తీర్మాణాలు చేయాలని డిమాండ్ చేశారు. ఆగష్టు 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలో సింగరేణి పరిరక్షణ బస్సుయాత్ర జరుగుతుందన్నారు. ఆగష్టు 5వ తేదీన కొత్తగూడెం రైల్వేస్టేషన్ వద్ద జరుగుతుందని, ఈ బహిరంగసభకు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ ఎంపీ విజయరాఘవన్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌లు పాల్గొంటారని తెలిపారు. బహిరంగ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు.

వరద బాధితులను ఆదుకోవాలి..

జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా నిర్వాసితులు అయిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని, వారికి పునరావాసం కల్పించాలన్నారు. గోదావరి వరదల వలన వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, పంట నష్టం పోయిన రైతులు మళ్లీ పంట వేసుకునే విధంగా వారిని ఆదుకోవాలని, పంట నష్టం కలిగిన వారికి పరిహారం చెల్లించాలన్నారు.

అశ్వారావుపేటలో వరద ఉధృతికి కొట్టుకుపోయిన పెద్దవాగును వెంటనే పూర్తిచేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పంటల సాగు, తెలంగాణలో పంట సాగుకు పెద్ద వాగు నీరందుతుందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని రెండు తెలుగు రాష్ట్రాలు స్పందించి పెద్ద వాగును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ విలేకర్ల సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలగాని బ్రహ్మచారి, ఎం.బాల నర్సారెడ్డి, లిక్కి బాలరాజులు పాల్గొన్నారు.

నత్తనడకన సెంట్రల్ లైటింగ్ పనులు

- ఇక్కట్లకు గురి అవుతున్న విద్యార్థులు

నవతెలంగాణ-అశ్వారావుపేట



అశ్వారావుపేట సెంట్రల్ లైటింగ్ పనులు నత్తనడకన సాగడంతో వాహన దారులు, విద్యార్థులు ఇక్కట్లకు గురి అవుతున్నారు. పట్టణంలో అశ్వారావుపేట ప్రధాన కూడలి నుండి జంగారెడ్డి, సత్తుపల్లి, భూర్గంపాడు రూట్లలో 2 కి.మీ మేర రహదారి విస్తరణ, మురుగు నీటి కాలువలు, డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడానికి గతేడాది బీఆర్ఎస్ ఆధ్వర్యంలోని కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం రూ.23 కోట్ల 50 లక్షలు వ్యయం అంచనాతో ప్రారంభించింది. పాలకులు మారారు, ప్రభుత్వం మారింది, కాంట్రాక్టర్ మారాడు అయినా ఇంకా నత్తనడక నే సాగుతున్నాయి. ఇదిలా ఉండగా అశ్వారావుపేట-సత్తుపల్లి రోడ్‌లో ఒక పక్క పనులు నిర్వహిస్తున్నారు. ఈ వైపున ప్రముఖ విద్యా సంస్థ, రెండు కళాశాలలు ఉన్నాయి. ఈ రెండు కళాశాలల ద్వారాలలో ఒక ద్వారం తెరిచి మరో ద్వారం వద్ద డ్రయినేజీ నిర్మిస్తున్నారు. ఈ పనులు నెలల పొడవునా నిర్వహించడంతో విద్యార్థులను రవాణా చేసే సంస్థ వాహనాలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతుంది. ఒక ద్వారం ఇంతకు పూర్వం వాడింది కాకపోవడంతో బస్‌లు దిగబడుతున్నాయి. అంతేగాక సిబ్బంది వాహనాలు రాకపోకలు కూడా కష్టంగా మారిందని వాపోతున్నారు. నడక మార్గంలో కళాశాలకు చేరుకునే విద్యార్థినీ, విద్యార్థులకు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేసారు. పనులు త్వరగా పూర్తి చేసి వాహనాల రాకపోకలకు మార్గం సుగమం చేయాలని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధికారులను కోరుతున్నారు.

నీటి గుంతలో పడి విద్యార్థి మృతి

నవతెలంగాణ-దమ్మపేట



ప్రభుత్వ పాఠశాల నుంచి ఆడుకుంటూ బయటికి వెళ్లిన విద్యార్థి మంగళవారం మధ్యాహ్నం మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం... మండలంలోని ఆర్లపెంట గ్రామంలోనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 2వ తరగతి చదువుతున్న తోలెం వరుణ్ (7) మధ్యాహ్నం భోజనం సమయంలో పాఠశాలలో భోజనం చేసి ఆర్లపెంట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు అనుకొని ఉన్న వరద కాలవ వద్దకు తన ముగ్గురు మిత్రులతో కలిసి మూత్ర విసర్జనకు వెళ్లారు. మూత్ర విసర్జన అనంతరం కాలవలో ఆడుకొని తిరిగి, బట్టల మొత్తం తడిసిపోయి పాఠశాలకు విద్యార్థులు తిరిగి వచ్చారు. పాఠశాల ఉపాధ్యాయురాలు సంధ్య, అక్కడ ఉన్న పాఠశాల సిబ్బంది విద్యార్థులను మందలించి తమ ఇళ్లకు వెళ్లి బట్టలు మార్చుకొని రావాలని ఆ ముగ్గురు విద్యార్థులను ఉపాధ్యాయురాలు ఇంటికి



పంపించారు. ఆ విద్యార్థులు ఇళ్లకు వెళ్లకుండా పాఠశాలకు కూత వేటు దూరంలో ఉన్న సీతారామ సాగర్ ప్రాజెక్ట్ కాలవ పక్కనే ఉన్న నీటి గుంత వద్దకు వెళ్లి ఆడుకుంటున్న సమయంలో తోలెం వరుణ్ ప్రమాదవశాత్తు నీటి గుంటలో పడి పక్కనే ఉన్న విద్యార్థులకు కనిపించకపోవడంతో, ఆ విద్యార్థులు తిరిగి తమ ఇళ్లకు వచ్చి జరిగిన విషయాన్ని తెలిపారు. దీంతో హుటాహుటిన విద్యార్థుల తల్లిదండ్రులు నీటి గుంత వద్దకు వెళ్లి చూడగా నీటిలో ఉన్న తోలెం వరుణ్‌ను గుర్తించి వెంటనే పట్వారిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు పరిశీలించి వరుణ్ మృతి చెందాడని నిర్ధారించడంతో, బాధిత కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న వివిధ రాజకీయ నాయకులు తీవ్ర సంతాపం తెలిపి ప్రభుత్వం మృతుడు కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామస్తులు పాల్వంచ దమ్మపేట రోడ్డుపై ధర్నా నిర్వహించారు. విద్యార్థి మృతికి కారణమైన ఉపాధ్యాయులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వారిని సముదాయించారు.

విద్యార్థి కుటుంబాన్ని పరామర్శించిన సీపీఐ నాయకులు

ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి మరణించిన విద్యార్థి కుటుంబాన్ని సిపిఐ నాయకులు పరామర్శించారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు నరాటి ప్రసాద్, జిల్లా సమితి సభ్యులు ఎండి యూసఫ్‌లు తల్లిదండ్రులకు ఓదార్చి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. విద్యార్థి కుటుంబానికి రూ.10లక్షల నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.

సింగరేణిలో సాధారణ ఉద్యోగి..

ఆయుర్వేద వైద్యంలో పేరు పొందిన డాక్టర్

తండ్రిని మించిన తనయుడు

- ప్రజా వైద్యుడిగా పేరుపొందిన డాక్టర్ పప్పుల జాన్







నవతెలంగాణ-మణుగూరు

సిరుల తల్లి సింగరేణిలో అంకితభావంతో ఉద్యోగ ధర్మం నిర్వహిస్తూనే మన చుట్టూ ఉన్న పరిసరాలలో మొక్కలు, చెట్లతో ప్రజలకు ఆయుర్వేదం వైద్యం నిర్వహిస్తూ డాక్టర్‌గా పలు ప్రశంసలు పొందారు పప్పుల జాన్. వారి సేవలను గుర్తించి డాక్టర్ బిరుదును అంకితం చేశారు. వైద్యరత్న, సేవరత్న బిరుదులను అందుకున్నారు పప్పుల జాన్. ఉద్యోగ విరమణ సందర్భంగా నవతెలంగాణ అందిస్తున్న ప్రత్యేక కథనం.

1985లో డాక్టర్ జాన్ సింగరేణి రన్నింగ్ ద్వారా ఉద్యోగం సంపాదించారు. 1986లో గోదావరిఖనిలో అండర్ గ్రౌండ్, మణుగూరులో పీకే 3 ఇంక్లైన్‌లో పనిచేశారు. భూపాలపల్లిలో లాంప్ రూమ్‌లో పనిచేస్తూనే భూపాలపల్లి బ్రాంచ్ ప్రధాన నాయకులుగా పని చేశారు. యూనియన్ ద్వారా కార్మికులకు అనేక సేవలు అందించారు. 1994లో మణుగూరుకు బదిలీ అయినారు. డ్రైవర్‌గా 2003 వరకు విధులు నిర్వహించారు. 1985 నుండి ఇప్పటివరకు ఈపీ ఆపరేటర్ 38 ఏండ్లుగా సింగరేణికి సేవలు అందిస్తూనే కాళీ సమయంలో వైద్యం నిర్వహిస్తూ జాతీయస్థాయిలో అనేక ప్రశంసలు అందుకున్నారు. నేడు సిరుల తల్లి సింగరేణి నుండి పదవి విరమణ పొందుతున్నారు. ఈ సందర్భంగా ఆయ నకు పలువురు మేధావులు, ప్రజలు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఉద్యోగం రాక ముందు నుండే తన తండ్రి ఆశీర్వాదం ద్వారా మూలిక వైద్యం నేర్చుకొని మణుగూరు పరిసర ప్రాంతాలలో 40 సంవత్సరాలుగా ఆయుర్వేద మూలిక వైద్యం నిర్వహిస్తూ ప్రజా వైద్యులుగా పేరుందిన జాన్ తండ్రిని మించిన తనయుడుగా పేరుపొందాడు. 2023 జనవరి 23, 24, 25 తేదీలలో ఎవి యూనివర్సిటీలోని శ్రీనివాస ఆడిటోరియంలో పారంపర్య వైద్యుల జాతీయా సదస్సు నిర్వహించారు. సాంప్రదాయ ఔషధములు, మూలికలు మొక్కల ప్రదర్శన నిర్వహించారు. తిరుపతిలో జరిగిన పారంపర్య వైద్యుల జాతీయ సమావేశంలో పాల్గొనడం సంతోషంగా ఉన్నదని ఆయన తెలిపారు. పప్పుల ఆశీర్వాదం (హనుమంతు) గుణమతమ్మ నాలుగవ కుమారుడు పప్పుల జాన్ సింగరేణిలో ఉద్యోగం నిర్వహిస్తూ దేశవ్యాప్తంగా 22 రాష్ట్రాలలో వైద్య సేవలు అందించి ప్రజల మన్ననలు పొందారు. ఆర్మీలో పనిచేస్తున్న ఆయన తండ్రి రెండో ప్రపంచ యుద్ధ సమయంలో బ్రిటిష్ వారికి దేశవ్యాప్తంగా ఆర్మీలో పని చేస్తున్న వారికి ఆయుర్వేద మూలిక వైద్యం నిర్వహించే వారిని తెలిపారు. పంజాబ్ రాష్ట్రంలో పనిచేస్తున్న జనరల్ డయర్‌కు వ్యక్తిగత భద్రతాధికారిగా పని చేశారని తెలిపారు. ఆ సమయంలో బ్రిటీష్ అధికారులకు వైద్యం అందించి తన తండ్రి అందరి చేత శభాష్ అనిపించుకున్నాడని ఆయన తెలిపారు. ఆయన ద్వారా వైద్య వృత్తిని వారసత్వంగా తీసుకుని పప్పుల జాన్ ప్రజలకు వైద్యం అందిస్తున్నారు. డాక్టర్ ఆనందయ్య, డాక్టర్ జమాల్ ఖాన్, ఆంధ్రప్రదేశ్ బయోడైవర్సిటీ బోర్డ్ చైర్మెన్ డాక్టర్ డిఎంకె రెడ్డి, ఎస్వీ యూనివర్సిటీ డిన్ సావిత్రమ్మ, యూనివర్సిటీ హెల్త్ క్లినికల్ రీసెర్చ్ బెంగళూరు జి.హరి రామ్మూర్తి, పారంపర్య జాతీయ వైద్యులు సంఘం అధ్యక్షుడు ఎస్.చంద్రశేఖర్ రాజు మహోన్నతులచేతుల మీదుగా సన్మానం పొందానని తెలిపారు. పప్పుల జాన్‌కు జాతీయస్థాయిలో ప్రశంసలు రావడంతో స్థానిక ప్రజాసంఘాలు, కార్మిక సంఘాలు హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా వైద్య సేవలు నిరంతరం కొనసాగిస్తానని జాన్ తెలిపారు. ఈ సందర్భంగా సిరుల తల్లి సింగరేణిలోఉద్యోగ విరమణ పొందుతున్న జాన్‌కు కార్మికులు, ప్రజలు ప్రత్యేక శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

గిరిజన డీఎల్ఈడీ కళాశాలలో ప్రవేశాలు ప్రారంభం

- ఐటీడీఏ పీవో బి.రాహుల్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

2024-26 విద్యా సంవత్సరానికి గాను గిరిజన డీఎల్ ఈడీ కళాశాలలో పదో బ్యాచ్ ప్రవేశమునకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కళాశాలలో 50 సీట్లు కలవని ఏజెన్సీ ప్రాంత విద్యార్థులకు మాత్రమే ఈ కళాశాలలో ప్రవేశమునకు అవకాశం కల్పించబడుతుందని ఆయన అన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో కనీసం 45 శాతం మార్పులతో ఉత్తీర్ణత సాధించాలని దరఖాస్తు ఫారాలు ఉట్నూరు, ఏటూరు నాగారం ఐటీడీఏలలో లభించునని దరఖాస్తు చేయు అభ్యర్థులు ప్రిన్సిపాల్ డీఎల్ ఈడీ కళాశాల చర్ల రోడ్డు భద్రాచలం నందు సంప్రదించాలని కోరారు. గిరిజన డీఎల్ఈడీ కళాశాల 2014-15 విద్యా సంవత్సరంలో ప్రారంభమైందని ఈ కళాశాల కేవలం ఏజెన్సీ ప్రాంత విద్యార్థులను ఉపాధ్యాయులుగా తయారు చేయాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేయబడిన ఏకైక ప్రత్యేక కళాశాలన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో డీఎడ్ కళాశాల లేకపోవడం వల్ల గిరిజన డీఎల్ఈడీ కళాశాలకు ఎస్‌సీఆర్‌టీ వారి నిర్వహించే ఎఫ్ఎల్ఎన్ ట్రైనింగ్ ఇతరాత్ర శిక్షణలో ప్రత్యేక గుర్తింపు ఉందని 2023 సంవత్సరంలో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎస్జీటీ పోస్టులు కేవలం డీఈడి చేసిన వారు మాత్రమే అర్హులని తీర్పు ఇవ్వడంతో గిరిజన డీఎడ్ కళాశాలకు మరింత ప్రాధాన్యత సంతరించుకుందని ఆయన అన్నారు. ఈ కళాశాల దరఖాస్తు చేసుకొనుటకు చివరి తేదీ 25 సెప్టెంబర్ 2024 వరకు అందజేయాలని మరిన్ని వివరములకు ప్రిన్సిపాల్ వై.కె.డి.భవాని చరవాణి 9959575539, 7981255624 నెంబర్లకు సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని ఆయన కోరారు.

4న సింగరేణి పరిరక్షణ యాత్రను జయప్రదం చేయాలి : సీఐటీయూ

నవతెలంగాణ-ఇల్లందు

సింగరేణి బొగ్గు గనులను వేలం ఆపాలని డిమాండ్ చేస్తూ సాగుతున్న సింగరేణి పరిరక్షణ యాత్ర జయప్రదం చేయాలని అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు ఈసం వెంకటమ్మ, తాళ్లూరి కృష్ణలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సొంతింటి కల అమలు చేయాలని, కోల్ ఇండియా తరహా ఇన్కమ్ ట్యాక్స్ పథకం అమలు చేయాలని కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, వారికి కనీస వేతనాలు రూ.26 వేలకు పెంచాలని కోరుతూ జరిగే యాత్ర ఇల్లందుకు ఆగస్టు నెల 4 చేరుకుంటుందని ఉదయం షిఫ్ట్ జేకే 5 ఓపెన్ కాస్ట్ వద్ద పిట్మీటింగ్ ఉందని తెలిపారు. అదే రోజు ఇల్లందు కొత్త బస్టాండ్ దగ్గర సభ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాంబాయి, కుమారి, శ్రీలత, వెంకటమ్మ, అరుణ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం...

ఆరు గ్రామాలకు రాకపోకలు బంద్

- గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలి : సీపీఐ
- వంతెనను పరిశీలించిన నాయకులు

నవతెలంగాణ-ములకలపల్లి



వంతెన కావాలని ఆరు గ్రామాల ప్రజలు కోరుకుంటే అసలు రహదారి లేకుండా చేసిన వైనం మండలంలోని తాళ్లపాయ పంచాయతీలో చోటుచేసుకుంది. ములకలపల్లి నుండి తాళ్లపాయ పంచాయతీకి వెళ్లే రహదారిలో పాములేరు వాగు పై వంతెన ఏర్పాటు చేయుట కోసం అప్రోచ్ వంతెనను ఏర్పాటు చేశారు. వర్షాకాలం కావడంతో చిన్నపాటి వర్షానికి ఆ వంతెన కొట్టుకుపోయినది. తరువాత 6 గ్రామాల గ్రామస్తులు వంతెన వద్దకు వచ్చి ధర్నా చేయడంతో తాత్కాలికంగా పాదచారులు నడిచే విధంగా ఇనుప వంతెనను ఏర్పాటు చేశారు. మొన్న కురిసిన భారీ వర్షానికి అట్టి వంతెన కుంగినది. ఆ వంతెనను మంగళవారం సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు నారాటి ప్రసాద్ పరిశీలించి, ఇది కేవలం అధికారుల నిర్లక్ష్యం కారణంగానే, ఏఈ వల్ల ఆరు గ్రామాల ప్రజలకు దారి సౌకర్యం లేకుండా పోయిందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో గ్రామస్తులకు సరైన రహదారి లేక చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ వంతెనను త్వరగా పూర్తిచేసి రహదారి సౌకర్యం కల్పించాలని వంతెనను పరిశీలించడానికి వచ్చిన ఐటీడీఏ డీఈ రామిరెడ్డిని, తహసీల్దార్ పుల్లారావుని చేతులు జోడించి వేడుకున్నారు.

గ్రామస్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి : జడ్పీటీసీ నాగమణి

అధికారుల అలసత్వం కారణంగానే ఆరు గ్రామాల ప్రజలకు రహదారి సౌకర్యం లేక చాలా ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలి. అలాగే చరవాణి ద్వారా అధికారులతో మాట్లాడి 6 గ్రామాల ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. కుంగిన వంతెనను వీలైనంత తొందరగా బాగు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పుష్పాల చందర్రావు, బండి కొమరయ్య, నారాటి రమేష్, బొప్పిడి ఇమ్మానియేల్, పుష్పాల హనుమంతు, సాయి, ఎంపీటీ లక్ష్మణరావు, గోపాల్ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పంట రుణం లబ్దిదారులు 11608 మంది

- లక్ష లోపు 7366,1 లక్ష 50 వేలు లోపు 4242 మంది

నవతెలంగాణ-అశ్వారావుపేట

సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఏర్పడిన తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పంట రుణ మాఫీ పథకంలో మంగళవారం రూ.1 లక్షా 50 వేలు లోపు ఉన్న పంట రుణం ఉన్న రైతులకు రుణ విముక్తి కలిగించింది. తొలి, మలి విడతలతో మొత్తం నియోజక వర్గంలో 11608 మందికి పంట రుణం మాఫీ లబ్దిదారులుగా ప్రకటించింది. మొదటి విడతగా రూ.1 లక్ష లోపు 7366 మందిని, రెండో విడతగా రూ.1 లక్ష నుండి 1 లక్షా 50 వేలు పంట రుణం ఉన్నవారికి మాఫీ చేసింది.

మండలం	తొలి	మలి	మొత్తం
అశ్వారావుపేట	1781	1082	2863
దమ్మపేట	2055	954	3009
ములకలపల్లి	1642	1052	2694
అన్నపు రెడ్డి పల్లి	764	458	1222
చంద్రుగొండ	1124	696	1820
మొత్తం	7366	4242	11608



1700 మంది రైతులకు రుణమాఫీ వర్తింపు

టేకులపల్లి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు సంబంధించి 1700 మంది రైతులకు లక్షన్నర లోపు రెండో విడత రైతు రుణమాఫీ వర్తిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి అన్నపూర్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో బేతంపూడి సొసైటీ అధ్యక్షుడు లక్కినేని సురేందర్ రావు, వైస్ ఎంపీపీ వుండేటి ప్రసాద్, సొసైటీ సీఈఓ ప్రేమా చారి, ఏఈఓలు శ్రావణి, రమేష్, ప్రవీణ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

8, 9న చలో ఢిల్లీ.. విజయవంతం చేయండి

- మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షులు గద్దల రమేష్

నవతెలంగాణ-పాల్వంచ

తెలంగాణలో జనాభా ప్రతిపదికన మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని మాదిగ జేఏసీ భద్రాద్రి, కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు, మాజీ సర్పంచ్ గద్దల రమేష్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం గద్దల రమేష్ మాట్లాడుతూ మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పిడమర్తి రవి నాయకత్వంలో ఆగస్టు 8, 9 తేదీలలో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా నుంచి అధిక సంఖ్యలో మాదిగ సోదరులు భారీగా తరలి రావాలని గద్దల రమేష్ పిలుపునిచ్చారు.



రేగళ్లలో వైద్యశిబిరం

లక్ష్మీదేవిపల్లి : కొత్తగూడెం మెడికల్ కాలేజ్ విద్యార్థుల ఆధ్వర్యంలో లక్ష్మీదేవిపల్లి మండలంలోని రేగళ్ల గ్రామంలో మంగళవారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజ్ కుమార్ ఆదేశాల మేరకు ఆ కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగం విద్యార్థులతో కలిసి పెద్ద తండా గ్రామం, రేగళ్ల పీహెచ్‌సీలో కుటుంబ దత్తత కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 2వ సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థులు ఇంటింటికీ సర్వే నిర్వహించి జనాభా వివరాలు, ఆంత్రోపోమెట్రీ కొలతలను నమోదు చేసి గ్రామంలోని కుటుంబ సభ్యులందరికీ అంటు వ్యాధులు, దీర్ఘ కాలిక వ్యాధులను గూర్చి పరీక్షించారు. ఈ కార్యక్రమంలో 340 ఫ్యామిలీలు అందులో మొత్తం 1298 జనాభకి పరీక్షలు జరిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వనిత యెల్ది, డాక్టర్ శివకృష్ణ, డాక్టర్ సంతోష్‌కుమార్, డాక్టర్ మనోహర్ ప్రకాష్, డాక్టర్ భూపతి రెడ్డి, డాక్టర్ జశ్వంత్, ఎంఎస్‌డబ్ల్యూ భద్రమ్మ, హెల్త్ ఎడ్యూకేటర్స్ ఆమని, కృష్ణవేణి, లక్ష్మీభాయ్, ల్యాబ్ టెక్నీషియన్ విష్ణు, సహాయక సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రీయ సాగుతో నాణ్యమైన దిగుబడులు

అశ్వారావుపేట : సేంద్రీయ సాగుతో పంట ఏదైనా నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని మెదక్ జిల్లా, తునికి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త శంభాజీ దత్తాత్రేయ మల్కర్ అన్నారు. వ్యవసాయ ఉద్యాన పంటల్లో జీవన ఎరువుల ప్రాముఖ్యత అనే అంశంపై మెదక్ జిల్లా, కౌడిపల్లి మండలం, తునికిలో గల భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి, డాక్టర్ రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్‌లో మంగళవారం ఉద్యాన శాఖ, తెలంగాణ ప్రభుత్వం వారి సౌజన్యంతో, భారతీయ ఆయిల్పామ్ పరిశోధనా సంస్థ వారి సాంకేతిక సహకారంతో, మహా రాష్ట్రకు చెందిన ఎం/ఎస్ లివ్ పామ్ రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ (లివింగ్ ఫుడ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారి అనుబంధ సంస్థ) ఆధ్వర్యంలో అశ్వారావుపేట ఆయిల్ పామ్ రైతుల ఎఫ్‌పీఓ ఔత్సాహిక రైతులకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఉద్యాన పంటల్లో జీవన ఎరువులు ఎంతో ప్రాముఖ్యం కలిగి ఉన్నాయని, మన పూర్వీకులు ఈ ఎరువులు వాడి సాగు చేసేవారని గుర్తు చేసారు. మారుతున్న జీవన వైవిధ్యం అనుగుణంగా రైతులు తమ వ్యవసాయ సాగు పద్ధతులను అవలంభించాలని పేర్కొన్నారు. మేనేజర్ కృష్ణ, కేవీకే సైంటిస్ట్‌లు శ్రీకాంత్, రవి, భారతి రాజాలు సాగు పద్ధతులు, ఎరువుల యాజమాన్యం, జీవన ఎరువులు తయారీ అంశాలను బోధించారు. ఈ కార్యక్రమంలో తుంబూరు మహేశ్వర రెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్య, తుమ్మ రాంబాబు, తగరం జగన్నాథం, సంతపురి చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనపల్లిలో విద్యార్థుల విద్యాంజలి ర్యాలీ

టేకులపల్లి : మండలంలోని బొమ్మనపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు విద్యాంజలి కార్యక్రమంలో భాగంగా ర్యాలీని మంగళవారం నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.జ్యోతి రాణి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో సమాజ భాగస్వామ్యం గురించి తల్లిదండ్రులు ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేసామన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మెన్ భవాని, అంగన్వాడీ టీచర్లు విజయలక్ష్మి విజయ, తల్లిదండ్రులు సురేష్, రవీంద్ర బాబు, అనిల్, బుజ్జి, నవగన్యా, నవ్యశ్రీ, సారిక, టీచర్ జె.పద్మ, ఐఆర్పి టీచర్ నీరజ, వాలంటీర్ శారద, ఎండీఎం ఇన్‌చార్జి సరోజ తదితరులు పాల్గొన్నారు.

విష్ణు మర్డర్ కేసులో కోర్టుకు నిందితులు

పాల్వంచ రూరల్ : విష్ణు మృతి కేసులో నిందితులుగా ఉన్న 11 మంది మైనర్లను సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్న గ్రామీణ పోలీసులు మంగళవారం కొత్తగూడెం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మొత్తం 15 మంది లో నలుగురు పరారీలో ఉన్నట్లు గ్రామీణ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. త్వరలో వారిని కూడా పట్టుకుని న్యాయస్థానంలో ప్రవేశపెడతామని స్పష్టం చేశారు.

వార్డ్ మెంబర్లకు గౌరవ వేతనం నెలకు రూ.2000 ఇవ్వాలి

జూలూరుపాడు : రాష్ట్రంలో జరగబోయే గ్రామపంచాయతీ ఎన్నికల్లో 24 గ్రామపంచాయతీలో వార్డ్ మెంబర్‌గా గెలుపొందిన ప్రతి ఒక్కరికీ గౌరవ వేతనం నెలకు రూ.2000 ఇవ్వాలని బీఎస్పీ మండల అధ్యక్షులు తంబర్ల నరసింహారావు ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీడీవో కరుణాకర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వార్డులలో ఉన్న సమస్యలను గ్రామసభలో పరిష్కరించే దిశగా అడుగులు వేసి ప్రతి గ్రామ పంచాయతీని సస్యశ్యామలం చేసి అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు.

పురుగుల మందు తాగి వ్యక్తి బలవన్మరణం

ఆళ్ళపల్లి : పురుగుల మందు తాగి గిరిజన వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆళ్ళపల్లి మండలంలో మంగళవారం చోటు చేసు కుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. అనంతోగు గ్రామానికి చెందిన గలిగె సాంబశివరావు అనే వ్యక్తి మంగళవారం గడ్డి మందు తాగారు. కుటుంబ సభ్యులు ఆళ్ళపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చి ఫస్ట్ ఎయిడ్ చేయించి మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడి భార్య గత కొన్ని సంవత్సరాల క్రితం మృతి చెందగా, నాలు సంవత్సరాల కుమారుడు ఉన్నాడు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.



అక్రమ రవాణాదారుల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎస్సై

నవతెలంగాణ-దమ్మపేట

అక్రమ రవాణా చేసే వారి పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సాయికిషోర్ రెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని గట్టుగూడెం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఎస్ఐ పాల్గొన్నారు. పిల్లలు సత్ప్రవర్తనతో పెరిగి మంచి నడవడిక కలిగి ఉండాలన్నారు. ఏదైనా సమస్య వస్తే 100 నెంబర్‌కు లేదా 1098కు ఫోన్ చేసి తెలపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం, ఎఐడి సంస్థ సోషల్ మొబలైజర్ మోహన్, అంగన్‌వాడీ టీచర్స్, కానిస్టేబుల్స్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ అందరికీ వర్తింపజేయాలి

- రైతు సంఘం మండల కార్యదర్శి రవికుమార్



ములకలపల్లి : బ్యాంకులో అప్పు ఉన్న ప్రతి ఒక్క రైతుకి 2 లక్షల లోపు రైతు రుణాలను తక్షణమే మాఫీ చేయాలని తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి ఉకంటి రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు సంఘం మండల కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త పట్టాదారు పాస్ పుస్తకం ఉన్న రైతులకే 2 లక్షల లోపు రైతు రుణాలు మాఫీ వర్తిస్తుందని ఆటంకాలు లేకుండా బ్యాంకులల్లో అప్పు ఉన్న ప్రతి రైతుకి రెండు లక్షల లోపు రైతు రుణాలు ప్రభుత్వం మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు గడ్డం వెంకటేశ్వర్లు, వర్స శ్రీరాములు, గోపగాని లక్ష్మీ నరసయ్య, నాయకులు బిబీనేని గడ్డయ్య, సీతారాములు, కొంగ్రు లక్ష్మి, నాగేశ్వరరావు, నాగులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

16377 మంది లబ్దిదారులకు రెండో విడత రైతు రుణమాఫీ

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్



నవతెలంగాణ-పాల్వంచ

రైతులు రుణమాఫీని సద్వినియోగపరచుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతు రుణమాఫీ కార్యక్రమంలో భాగంగా రెండో విడత రుణమాఫీ 2024 నిధుల విడుదల కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఐడీఓసీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన రైతు వేదికలో కలెక్టర్ పాల్గొన్నారు. మొదటగా హైదరాబాద్ నుంచి సీఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతుల ఖాతాల్లోకి నిధులు విడుదల చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో రైతు రుణమాఫీ పథకం అమలులో భాగంగా ఈరోజు రెండో విడత నిధుల విడుదలలో భాగంగా 1,50,000 లోపు రుణాలు ఉన్న రైతులు అందరికీ తమ ఖాతాల్లో నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. జిల్లాలో రెండో విడత రైతు రుణమాఫీలో భాగంగా 16377 మంది లబ్ధిదారులకు గాను రూ.137,21,96,477 రైతుల ఖాతాలలో జమ చేసినట్టు ఆయన తెలిపారు. రైతులు తమ ఇల్లు, పొలాలలో నీటి కుంటలు ఏర్పాటుకు ఉపాధి హామీ పథకం ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఆ నీటి కుంటల్లో ప్రభుత్వం తరఫున ఉచితంగా అజోల్ల నాచు పెంపకం చేపట్టాలన్నారు. నీటి కుంటలో కొర్రమీను చేపలు పెంపకం ప్రయోగత్మకంగా చేపట్టాలన్నారు. దీని ద్వారా రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చు అని తెలిపారు. రైతులు పశు సంపద సంరక్షణలో భాగంగా పశువుల కొట్టాలు ఏర్పాటు చేసుకోవాలని, ఉపాధి హామీ పథకం కింద ఏర్పాటు చేసిన పశువుల కొట్టాలకు తిరిగి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. జిల్లాలోని ములకలపల్లి మండలం పాతూరు గ్రామంలో రైతులు చేపలు పెంపకం చేపడుతున్నారని తెలిపారు. అదేవిధంగా దుమ్ముగూడెంలోని రైతులు బాతులు పెంపకం ద్వారా మంచి లాభాలను గడిస్తున్నారన్నారు.

రైతులు ధైర్యం చేసి వినూత్న పంటల వైపు అడుగు వేయాలని ఆయన తెలిపారు. రైతు రుణమాఫీలో ఎటువంటి సమస్య వచ్చినా బ్యాంకర్లు, ఏఈఓకు తెలియజేయాలని, వారు వెంటనే సమస్యను జిల్లా కార్యాలయానికి తెలియజేసి పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం రైతు రుణమాఫీ రెండో విడత నిధులు కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులైన రైతులకు కలెక్టర్ చెక్కులు అందించారు. ఈ కార్యక్రమంలో డీసీ ఎస్ఎంఎస్ చైర్మెన్ కొత్వాల శ్రీనివాస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు, జిల్లా ఉద్యానవన అధికారి సూర్యనారాయణ, జిల్లా సహకార అధికారి ఖుర్షిద్, కెవికె శాస్త్రవేత్త లక్ష్మీనారాయణమ్మ, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ రెడ్డి, అన్ని బ్యాంకుల మేనేజర్లు, తదితరులు పాల్గొన్నారు.

నేత్ర దానం చేసిన భద్రాచలం వాస్తవ్యులు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలంకు చెందిన కొణిజర్ల వెంకట నాగేశ్వర రావు (48) అనారోగ్యంతో మృతి చెందారు. తాను మరణించినప్పటికీ మరో ఇద్దరికి వెలుగునివ్వాలని తన రెండు కండ్లను కుటుంబ సభ్యుల అంగీకారంతో మంగళవారం నేత్ర దానం చేసి, ఇద్దరికి కంటి చూపును కల్పించారు. అగర్వాల్ ఐ బ్యాంక్ ద్వారా ఎవరైనా మృతి చెందితే 8 గంటల లోపు వారి కుటుంబ సభ్యుల అంగీకారంతో అక్కడే నేత్రాలను తీసుకొని అందత్వంతో బాధపడుతున్న వారికి కంటి చూపు కల్పిస్తున్నారు.

జీవో నెంబర్ 22 అమలు చేయాలి

మణుగూరు సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జీవో నెంబర్ 22 అమలు చేసి, నెలకు రూ.20,000 జీతం ఇవ్వాలని, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ)రాష్ట్ర కమిటీ సభ్యులు నందం ఈశ్వరరావు సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సింగరేణి కార్మికులను ఉద్దేశించి రామాలయం దగ్గరలో భోజనం విరామ సమయంలో సివిక్ అడ్డ మీటింగులో మాట్లాడారు. కార్మికుల సమస్యలు పరిష్కారానికి యాజమాన్యం కృషి చేయాలన్నారు. అనంతరం జిల్లా నాయకులు సత్రపల్లి సాంబశివరావు మాట్లాడుతూ మూడో తారీకు జరగబోయే బస్సు యాత్రను అధిక సంఖ్యలో పాల్గొని సింగరేణి కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ సమావేశంలో కాంట్రాక్ట్ కార్మిక నాయకురాలు ఇమాంబి, ఉపేంద్ర, భీమయ్య, రంగయ్య, నాగేశ్వరరావు, నాగరాజు, రాందాస్, సుజాత, అంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాకు టీచర్లు కావాలి...మా పిల్లలకు చదువు చెప్పాలి

- పాఠశాలలో ఉపాధ్యాయులు లేరని విద్యార్థులతో పాటు తల్లిదండ్రుల ఆందోళన



నవతెలంగాణ-కొత్తగూడెం

మాకు ఉపాధ్యాయులు కావాలని విద్యార్థులు...మా పిల్లలకు చదువు చెప్పాలని విద్యార్థుల తల్లి దండ్రులు ఆందోళన చేసిన సంఘటన కొత్తగూడెంలో చోటు చేసుకుంది. మంగళవారం పాఠశాలలో ఉపాధ్యాయులు లేరని, విద్యార్థులతో పాటు తల్లిదండ్రుల ఆందోళన నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పాత కొత్తగూడెం, హనుమాన్ బస్తి ప్రాథమిక పాఠశాలలో తమ పిల్లలకు పాఠాలు చెప్పేందుకు ఉపాధ్యాయులు సరిపడ పోకపోవడంతో తల్లిదండ్రులు, విద్యార్థులతో సహా పాఠశాల ముందు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఈ పాఠశాలలో సుమారు 189 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. కానీ వీరికి సరి పడ టీచర్లు లేరు. దీని వలన విద్యార్థులు సరైన విద్య అందక చదువుకు దూరం అవుతున్నారని వారి తల్లి దండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన ఉపాధ్యాయుల బదిలీలలో కొంత మంది టీచర్లు బదిలీ అయ్యారు. స్కూల్‌లో 189 మంది విద్యార్థులకు కేవలం ముగ్గురు టీచర్లే ఉండడం, అందులో ఒక టీచర్ లీవ్‌పై వెళ్లడంతో గత 15 రోజులుగా ఇద్దరు ఉపాధ్యాయులతో పాఠశాల నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు పాఠాలు బోధించే టీచర్ లేకుండా పోయారు. నలుగురు ఉపాధ్యాయులని డిప్యూటేషన్ మీద ఇతర పాఠశాలలకు పంపడంతో టీచర్ల కొరత ఏర్పడిందని, మిగతా ఉపాధ్యాయులు అంటున్నారు. తమకు ఉపాధ్యాయులు కావాలని విద్యార్థులు తరగతులు బహిష్కరించి స్కూల్ బయటికి వచ్చి కింద కూర్చొని ఆందోళన చేయడం జిల్లా వ్యాప్తంగా సంచలనం రేపింది. మధ్యాహ్నం భోజనం కూడా సరిపడా పెట్టడం లేదని, నాణ్యమైన కూరలు, అన్నం వడ్డించట్లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

డీఈఓ దృష్టికి తీసుకు వెళ్లి సమస్య పరిష్కరిస్తాం : ఎంఈఓ

మీడియా ద్వారా వెలుగు చూసిన ఆందోళన విషయం తెలుసుకున్న మండల విద్యాశాఖ అధికారి జుంకీలాల్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు ఇటీవల జరిగిన బదిలీలలో ఇతర పాఠశాలలకు బదిలీపై వెళ్లారని, ఉపాధ్యాయుల కొరత తీర్చేందుకు డీఈఓ దృష్టికి తీసుకువెళ్తానని, వెంటనే సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని తల్లిదండ్రులకు వివరించారు.

బొగ్గు బ్లాకుల వేలాన్ని నిరసిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.బ్రహ్మచారి



నవతెలంగాణ-కొత్తగూడెం

కేంద్ర బీజేపీ ప్రభుత్వం తెచ్చిన బొగ్గుబ్లాకుల వేలం పక్రియను నిరసిస్తూ రాష్ట్ర శాసన సభలో తీర్మాణం చేయాలని, ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యక్షపోరాటానికి ముందుకురావాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.బ్రహ్మచారి డిమాండ్ చేశారు. సింగరేణికాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ బ్రాంచి కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ అధ్యక్షతన వికే-5 మైన్‌లో జరిగిన ఫిట్ వీరీటింగ్‌లో బ్రహ్మచారి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రగతి కోసం సింగరేణి సంస్థను కాపాడుకోవాలని అన్నారు. బొగ్గు బ్లాకుల వేలం పక్రియ నిలిపివేయాలని, తెలంగాణలో వున్న బొగ్గు బ్లాకులను ఎటువంటి షరతులు లేకుండా సింగరేణి సంస్థకు కేటాయించాలని జూలై 29 నుండి సీపీఐ(ఎం) చేపట్టిన సింగరేణి పరిరక్షణ బస్సుయాత్రను జయప్రదం చేయాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. కొద్దిమంది కార్పొరేట్ అధిపతుల కోసం బంగారు బాతు లాంటి సింగరేణికి గనులు కేటాయించకుండా బీజేపీ చేస్తున్న కుట్రను రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తిప్పికొట్టాలన్నారు. అందుకు రాజకీయ పార్టీలను కార్మిక సంఘాలని కలుపుకొని ప్రజా ఉద్యమం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆగష్టు 5న కొత్తగూడెంలో జరిగే బస్సు యాత్ర ముగింపు సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సభలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్, ఎలగొండ రఘు, హరి నాయక్ తదితరులు పాల్గొన్నారు.



దేశ భవిష్యత్, అభివృద్ధి యువతపై ఆధారపడి ఉంది

- గంజాయి రహిత సమాజంలో అందరూ భాగస్వాములు కండి
- ఎస్పీ రోహిత్ రాజ్

నవతెలంగాణ-కొత్తగూడెం

దేశ భవిష్యత్, అభివృద్ధి యువతపై ఆధారపడి ఉందని, గంజాయి రహిత సమాజంలో అందరూ భాగస్వాములు అవుదామని ఎస్పీ రోహిత్ రాజ్ అన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్మించిన డ్రగ్స్, గంజాయి రహిత అవగాహన స్టిక్కర్స్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... "యువతను మత్తులో ముంచి చిత్తు చేసే గంజాయి, డ్రగ్స్ అక్రమ వినియోగానికి అడ్డుకట్ట వేయాలి" సకల అనర్ధాలకు అరాచకాలకు హత్యలకు ప్రేరణగా నిలిచే గంజాయి డ్రగ్స్ వాడకం వంటి మత్తు వ్యసనాలను దూరం చేయకుండా సమాజం బాగుపడదన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్, బడిపిల్లల నుండి వర్సిటీ స్టూడెంట్స్ దాకా రోజు కూలీ నుంచి సాఫ్‌వేర్ ఉద్యోగుల వరకు ఉందని, ముఖ్యంగా సినీ ప్రముఖులు, వ్యాపారవేత్తలు ఈ మత్తు మహమ్మారికి బానిసలౌతున్నారన్నారు. గంజాయి కొనడానికి డబ్బుల్విలేదని కన్నవారినే కడతేర్చిన ఉదంతాలు ఎన్నో ఉన్నాయన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం కఠిన చట్టాలను అమలు చేస్తుందని, యువత సైతం అదేవిధంగా అక్రమ రవాణాను అడ్డుకోవాలని కోరారు. సమాజంలో ఈ రుగ్మతలను పారదోలేందుకు డీవైఎఫ్ఐ బాధ్యత తీసుకుని 30,000 అవగాహన గోడ స్టిక్కర్స్ ముద్రించి బాధ్యత తీసుకోవటం అభినందనీయమన్నారు. మత్తులేని సమాజాన్ని నిర్మించే ఈ కృషిలో వీవైఎఫ్ఐ మంచి పాత్ర పోషించాలని, అందులో అందరూ భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లిక్కి బాలరాజు, కాళంగి హరికృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు బి.వీరభద్రం, నాయకులు నాగకృష్ణ, పగడాల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి పరిరక్షణ బస్సు యాత్రను జయప్రదం చేయాలి

- పోస్టర్ ఆవిష్కరణలో సీఐటీయూ బ్రాంచి కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్



నవతెలంగాణ-కొత్తగూడెం

సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో కోల్‌బెల్ట్ ఏరియాలో చేపట్టిన బస్సు యాత్ర జయప్రదం చేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) బ్రాంచి కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం సీఐటీయూ కార్యాలయంలో ఆరు డిమాండ్‌లతో కూడిన వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు వేలం పాటల కొనసాగింపును ఉపసమరించుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం వాడుకున్న రూ.30 వేల కోట్ల బకాయిలను తిరిగి చెల్లించాలని, సింగరేణి బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలని, సింగరేణి కార్మికుల సొంతింటి పథకం అమలు చేయాలని, పెర్క్స్ పైన ఇన్‌కంట్యాక్స్ సింగరేణి యాజమాన్యమే భరించాలని, లాభాల్లో వాటా 35 శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి అధ్యక్షులు గాజుల రాజారావు, వై.వి.రావు, భూక్య రమేష్, కొత్తపల్లి రమేష్ బాబు, లక్ష్మీ పి.వి. లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు : ఆగస్టు 3న మణుగూరులో జరగనున్న సీపీఐ(ఎం) సింగరేణి పరిరక్షణ యాత్రను జయప్రదం చేయాలని పార్టీ మండల కార్యదర్శి కొడిశాల రాములు పిలుపునిచ్చారు. మంగళవారం యాత్ర పోస్టర్లను ఆవిష్కరించి, మాట్లాడారు. సింగరేణి కార్మికులు, కార్మిక వర్గాల ప్రజలు ప్రజాస్వామ్యక వాదులు అందరూ యాత్రకి సంఘీభావం తెలుపుతూ స్వాగతించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు సత్రపల్లి సాంబశివరావు, మండల కమిటీ సభ్యులు నందం ఈశ్వరరావు, ఆఫీస్ కార్యదర్శి నరసయ్య, లారీ డ్రైవర్ అసోసియేషన్ నాయకులు వెంకన్న, పార్టీ సభ్యులు రాములు, తదితరులు పాల్గొన్నారు.

యాత్రను జయప్రదం చేయండి : సీఐటీయూ

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జరుగు సింగరేణి పరిరక్షణ బస్సు యాత్రను జయప్రదం చేయాలని సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి వెంకటరత్నం అన్నారు. మంగళవారం సీఐటీయూ కార్యలయంలో ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 3వ తారీకు మూడు గంటలకు అంబేద్కర్ సెంటర్లో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో లక్ష్మణరావు, రామ్మూర్తి, ఈశ్వరరావు, విల్సన్, ప్రభాకర్ రావు, రాజు, బొల్లం రాజు, శ్రీను, సుమన్, శ్రీకాంత్, బుచ్చిరెడ్డి బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్‌గా జీవీవీ ఎస్ఆర్కే చారి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



ఇంపాక్ట్ ఫౌండర్ మాస్టర్ మోటివేటర్ గంప నాగేశ్వరరావు స్థాపించిన ఇంపాక్ట్ ఫౌండేషన్ వారు ఇంటికో స్పీకర్..ఊరికో ట్రైనర్ అనే లక్ష్యంతో నిర్వహించిన ట్రైన్ ద ట్రైనర్స్ శిక్షణ శిబిరంలో భద్రాచలంకు చెందిన ఎల్ఐసీ ఏజెంట్ జీవివి ఎస్ఆర్కె.చారి 30 రోజుల ఆన్‌లైన్‌లో రెండు రోజులు సికింద్రాబాద్ మినర్వా గ్రాండ్ హెూటల్‌లో నిర్వహించిన ఆఫ్‌లైన్ సెషన్స్‌లోనూ పాల్గొని ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్‌గా సర్టిఫికెట్ పొంది, అర్హత పొందారు. ఈ సందర్భంగా జీవీవీ ఎస్ఆర్కె.చారి మాట్లాడుతూ... ఈ సర్టిఫికెట్‌ను ప్రముఖ నటులు, లైఫ్ కోచ్ పర్సనాలిటీ డెవలప్మెంట్ కార్పొరేట్ డెవలప్మెంట్ ట్రైనర్ శ్రీ.కె.వి.ప్రదీప్ మాస్టర్ మోటివేటర్ నాగేశ్వరరావుల చేతుల మీదుగా అందుకోవడం ఎంతో గర్వకారణం అని అన్నారు. ఈ ట్రైనింగ్ ప్రోగ్రాం బంధం టీం సుధీర్ బంధం ఆధ్వర్యంలో ఇన్‌చార్జి త్రినాథ్ అద్భుతంగా ఈ 30 రోజుల ఆన్లైన్‌లో ట్రైనింగ్స్ నిర్వహించారు. ఇందులో ట్రైనర్స్‌గా మమ్మల్ని మలిచిన విధానం అద్భుతం అద్వితీయం అని కొనియాడారు. నేను ట్రైనర్‌గా మారడానికి అవకాశం కల్పించిన గంప నాగేశ్వరరావుకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అలాగే అత్యద్భుతంగా మమ్మల్ని తీర్చిదిద్దిన బంధం టీం సుధీర్, త్రినాధ్‌కి, ఈ 32 రోజులు కోఆర్డినేటర్స్, మెంటార్స్‌గా, కో మెంటర్స్‌గా వ్యవహరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఆగస్టు ఒకటి, రెండు, మూడో తేదీల్లో హైదరాబాదులోని హరిహర కళాభవంలో మెగా ఇంపాక్ట్ నిర్వహిస్తున్న మోటివేషన్ క్లాసులో రకరకాల స్కిల్స్ నేర్పిస్తారని తెలియజేశారు. ఇప్పుడున్న స్థితి నుంచి ఉన్నత స్థితికి వెళ్లాలనుకుంటున్న ప్రతి ఒక్కరూ హాజరు కావచ్చని కోరారు. మెగా కార్యక్రమంలో పాల్గొని మీలో ఉన్న స్కిల్స్‌ని డెవలప్ చేసుకుని అభివృద్ధి చెందాలని జీవీవీ ఆర్కే చారి కోరారు.

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం

జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ- ఖమ్మం

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే మహిళా శక్తి పథకం ముఖ్య ఉద్దేశ్యమని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. మంగళవారం టేకులపల్లిలోని మహిళా ప్రాంగణంలో మహిళా సమాఖ్యలకు నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సదస్సులో మహిళా శక్తి కార్యక్రమం, స్త్రీ, వైద్య, ఆరోగ్య సమస్యలు, స్త్రీ, శిశు సంక్షేమ కార్యక్రమాలు, జీవనోపాదులు, బ్యాంక్ లింకేజ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పురోగతి తదితరుల అంశాల పట్ల మహిళా సమాఖ్య సభ్యులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ సంఘంసభ్యులు, మహిళలకు జీవనోపాధి కల్పించాలని, వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలని అన్నారు. మహిళా శక్తి పథకాన్ని జిల్లాల్లో విజయవంతంగా అమలుపర్చాలన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా పలు రకాల పరిశ్రమలను ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఏర్పాటు చేసే ప్రతి పరిశ్రమపైన అవగాహన, స్థైర్యం ఉంటేనే వారు విజయం సాధిస్తారన్నారు. చిన్న పరిశ్రమలు వాటి ద్వారా తయారయ్యే వస్తువులు మార్కెట్, ప్రజల డిమాండ్ మేరకు చేయడం ద్వారా విజయం సాధించవచ్చన్నారు. సంఘాలు స్థాపించే చిన్న పరిశ్రమలు పూర్తి నాణ్యత పాటిస్తూ, ఆకర్షణీయమైన ముద్ర రూపొందించుకోవాలన్నారు. మహిళా సంఘంలోని గ్రూప్ సభ్యులందరూ సమన్వయంతో కృషి చేసి అభివృద్ధి సాధించాలని, మహిళా సంఘాలు అవగాహన ఉన్న పరిశ్రమల ఏర్పాటుపై అధికారులు ప్రోత్సహించాలన్నారు. చిన్న పిల్లలు, గర్భిణీలు, మహిళలకు సరైన విధంగా పౌష్టికాహారం అందించాలని, అలాగే గుడ్లు, ఐరన్ మాత్రలు అందేలా చూడాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. వాతావరణ మార్పు సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు వహించాలన్నారు.



రవీందర్ బాబుకు నాగా సీతారాములు పరామర్శ

నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి

మైలారం రోడ్డులో జరిగిన యాక్సిడెంట్‌లో గాయాలపాలై కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కిసాన్ కాంగ్రెస్ జిల్లా సెక్రటరీ, బొజ్జలగూడెం వాసి పూసం సత్యనారాయణ కుమారుడు రవీందర్ బాబును టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ లక్ష్మిదేవిమండల అధ్యక్షులు అజ్మీరా మోహన్, మండల ఓబీసీ అధ్యక్షులు బొబ్బిశెట్టి వీరబాబు, లక్ష్మిపురం మాజీ సర్పంచ్ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండుగగా శత చండీయాగం

నేడు పూర్ణాహుతి - అన్న ప్రసాద వితరణ

నవతెలంగాణ-ఖమ్మం

"లోక కళ్యాణార్థం"... బ్రహ్మశ్రీ రెంటాల సతీష్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో భారత దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 40 మంది రుత్విక బృందంతో శత చండీ యాగ సహిత రుద్ర యాగంను సునీత భక్త బృందం భవ్యశ్రీ హృద్ధాశ్రమం, జ్యోతిషాలయం ఖమ్మం వారు 5 రోజులు... ఖమ్మం నగరం సుందర్ టాకీస్ రోడ్డు "అయోధ్య" రామరాజ్యంలో నివాసం ప్రాంగణంలో నిర్వహిస్తున్నారు. ఈ రోజు నాల్గవ రోజు "అడి కృత్తికా" సందర్భంగా... చండీ యాగంతో పాటు మహా సర్వశుక్త హెూమం, "పాల కావడి" మహెూత్సవ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కటకం ఉమ, చిన్ని, రాయపూడి రాజు, గిరిప్రసాద్, గొలి అనూప్ పాల్గొన్నారు. బుధవారం పూర్ణాహుతి, అన్న పసాద వితరణ జరుగునని కార్య నిర్వాహకులు సునీత తెలిపారు.

మురికి కూపంలా అంతర్గత రహదారులు

నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ -దుమ్ముగూడెం



మురికి కూపంలా దర్శనమిస్తున్న చిన్న బండి రేవు గ్రామ అంతర్గత రహదారులు అనే నవతెలంగాణ కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. మంగళవారం గ్రామంలో గల అంతర్గత రహదారులకు ఇరువైపులా బ్లీచింగ్ చల్లడంతో పాటు చెత్తాచెదారాన్ని తొలగించారు. దీంతోపాటు ఇండ్ల ముందు నిల్వ ఉన్న నీటిని బయటకు పోయే విధంగా చర్యలు చేపట్టారు. ట్రాక్టర్ల సంచారం గ్రామంలో అధికంగా ఉండటం వల్ల రహదారులు చిత్తడి అవుతున్నాయని ట్రాక్టర్ యజమానులకు నోటీసులు అందజేయనున్నట్లు కార్యదర్శి మంగీలాల్ నవతెలంగాణకు తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షించిన రైతులు

నవతెలంగాణ-పినపాక

మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి రెండో విడత రుణమాఫీ నిధుల విడుదలపై రైతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించామని వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర్లు తెలియజేశారు. మంగళవారం పినపాక రైతు వేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున రైతులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కంది సుబ్బారెడ్డి, ఏఈఓ లు కొమరం లక్ష్మణ్ రావు, కే రమేశ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రామనాథం పాల్గొన్నారు.

తక్కువ ప్రీమియంతో ఎక్కువ బోనస్

- **భద్రాచలం పోస్టల్ నార్త్ సబ్ డివిజన్ ఏఎస్పీ అశోక్ కుమార్**

నవతెలంగాణ -దుమ్ముగూడెం

గ్రామీణ తపాల శాఖలో తక్కువ ప్రీమియం చెల్లించి ఎక్కువ బోనస్ పొందవచ్చు అని భద్రాచలం నార్త్ సబ్ డివిజనల్ పోస్టల్ ఏఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. మంగళవారం తపాలా శాఖ భద్రాచలం సబ్ డివిజన్ పరిధిలోని సీతారాంపురం బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్ నందు డీసీడీపీ ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంత పోస్ట్ ఆఫీస్‌లో లభిస్తున్న అన్ని రకాల ఇన్సూరెన్స్, బ్యాంకింగ్ సేవల గురించి ఆయన వివరించారు. ఎల్పిపిబి ద్వారా జనరల్ ఇన్సూరెన్స్ సంవత్సరానికి రూ.520 ప్రీమియం చెల్లిస్తే పది లక్షల బీమా, రూ.755తో 15 లక్షల బీమా పొందవచ్చు అని అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పిఎం వివేక్, ఎంపీపీఎస్ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు సుజాత, పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించాలి

- **ఎంఈఓ కీసర లక్ష్మి**

నవతెలంగాణ - అశ్వారావుపేట

విద్యార్థుల్లో అంతర్గతంగా దాగిన సామర్థ్యాలను వెలికి తీసేందుకు శిక్షణలు దోహదం చేస్తాయని ఇన్‌చార్జీ ఎంఈఓ కీసర లక్ష్మి సూచించారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మండల వ్యాప్తంగా ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న "నాస్" శిక్షణలను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ మండల నోడల్ అధికారి, మామిళ్ళ వారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్.ఎం ప్రసాదరావు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పి. హరిత, జీహెచ్ఎస్, గుమ్మడి వల్లి ప్రధానోపాధ్యాయులు సి.హెచ్. వెంకయ్య, వీరేశ్వరరావు, రిసోర్స్ పర్సన్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు వేతనాలు చెల్లించాలి

నవతెలంగాణ-అశ్వాపురం

ఉపాధి హామీ కూలీలకు బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని సీపీఐ(ఎం) నాయకులు దండి రాములు కోరారు. మంగళవారం మల్లెలమడుగు గ్రామంలో ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో పనిచేస్తున్న కూలీలకూ డబ్బులు రాకపోవడపై తీవ్రంగా మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు బార నర్సయ్య, సర్గం రాఘవులు, బొమ్మరోతు రాములు, వెల్పుల రాఘవులు, రాములు పాల్గొన్నారు.

జీవో నెంబర్ 27ను అమలు చేయాలి

- **రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాంబాబు, ముసలయ్య**
- **కలెక్టర్ ఎదుట ధర్నా, కలెక్టర్ హామీతో ఆందోళన విరమణ**

నవతెలంగాణ-పాల్వంచ

జీవో నెంబర్ 27 ను అమలు చేయాలని, మెడికల్ కాలేజ్‌లో రజక లబ్దిదారులతో నింపాల్సిందేనని రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముదిగొండ రాంబాబు, చిటికెన ముసలయ్య డిమాండ్ చేశారు. జిల్లా రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మెడికల్ కాలేజ్‌లో దోబీ పోస్టులు రజకులకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మెడికల్ కాలేజీలో ధోబి పోస్టులకు ఓపెన్ క్యాటగిరిలో 129 మంది దరఖాస్తు చేసుకున్నారని, ఆ దరఖాస్తుల్లో రజకులు 60 మందిలోపే ఉన్నారని చెప్పారు. అ పోస్టులను రజకులతో నింపాలన్నారు. దానికి కలెక్టర్ స్పందించి రజక వృత్తిదారులతోనే నింపుతామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు నంద్యాల వెంకటేశ్వర్లు, ఉప్పునూరు నాగయ్య, సాలికుల శివ కుమారి, కంచర్ల శ్రీను పాల్గొన్నారు.

అశ్వారావుపేట కాంప్లెక్సులో తిథిభోజనం

నవతెలంగాణ - అశ్వారావుపేట

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జె.వి.ఆర్ వెజిటబుల్స్, కేశవ ఫెర్టిలైజర్స్ అశ్వారావుపేట వారి సహకారంతో తిథిభోజనాన్ని ఏర్పాటు చేశారు. గత వారం రోజులుగా అన్ని పాఠశాలల్లో నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ ముగింపులో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్సు ప్రధానోపాధ్యాయులు పి.హరిత, పాఠశాల మధ్యాహ్నం భోజనం ఇంచార్జి మధు, పాల్గొన్నారు.

దుమ్ముగూడెం : మండలంలోని నర్సాపురం గ్రామంలో గల సూదిరెడ్డి నాగిరెడ్డి ఆదిలక్ష్మమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం "తిథిభోజనం" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ పూజారి రత్నకుమారి కృషితో ఐ.కె.పి. సభ్యులు వి.కృష్ణవేణి, జి.దుర్గారాణి, కె. వెంకట నరసమ్మ, నాగరాజు,కె భద్రమ్మ సహకారంతో విద్యార్థులందరికీ పౌష్టికాహారంతో మధ్యాహ్న భోజనం అందజేశారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు బెక్కంటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

1.36 లక్షల మందికి రుణవిముక్తి

- **రెండో విడత ఖమ్మంలో రూ.262, భద్రాద్రిలో రూ.137 కోట్లు మాఫీ**
- **ఖమ్మం జిల్లాలో 33,942 మందికి రూ.262.50 కోట్లు**
- **భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 16,377 మందికి రూ.137.21 కోట్లు**
- **రెండు విడతల్లో కలిపి ఉమ్మడి జిల్లాలో రూ.790 కోట్లు మాఫీ**

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

రెండో విడత రుణమాఫీ నిధులు మంగళవారం విడుదలయ్యాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిధులను విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 7 లక్షల మంది రైతులకు రూ.6,191 కోట్లు విడుదల కాగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రెండో విడత 50,319 మంది రైతులకు రూ.399.71 కోట్లు మాఫీ చేశారు. ఖమ్మం జిల్లాలో 33,942 మందికి రూ.262.50 కోట్లు మాఫీ అయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 16,377 మందికి రూ.137.21 కోట్లు మాఫీ చేశారు. రెండు విడతల్లో కలిపి ఉమ్మడి జిల్లాలో 1.36 లక్షల మందికి రూ.790 కోట్ల రుణవిముక్తి లభించింది. డిసెంబర్ 12, 2018 నుంచి డిసెంబర్ 9, 2023 తేదీల మధ్య రూ.2 లక్షలలోపు పంట రుణాలు తీసుకున్న రైతులను లబ్ధిదారులుగా గుర్తిస్తున్నారు. చివరి విడత రుణమాఫీ ఆగష్టు 15న కావచ్చని భావిస్తున్నారు. తొలి విడత తరహాలోనే రేషన్‌కార్డు లేనివారికి, రీషెడ్యూల్ చేసిన వారికి రుణమాఫీ కాలేదనే ఫిర్యాదులు వస్తున్నాయి. ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌కు ప్రధానంగా ఈ రెండు సమస్యలపైనే కంప్లయింట్లు వస్తుండటం గమనార్హం.

ఖమ్మం జిల్లాలో రెండు విడతల్లో...

ఖమ్మం జిల్లాలో రెండో విడత 33,942 మంది రైతులకు రూ.262,50,56,893 విడుదల కాగా మొదటి విడత ఈనెల 18న 57,857 మంది రైతులకు రూ.258,25,75,452 రుణాలు మాఫీ అయ్యాయి. జిల్లాలో రెండు విడతల్లో కలిపి 91,973 మంది రైతులకు రూ.520.75 కోట్లు మాఫీ చేసినట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. కుటుంబానికి రూ.2 లక్షల కంటే ఎక్కువగా రుణం ఉంటే నిబంధనల ప్రకారం ముందుగా మహిళల పేరుతో ఉన్న రుణాన్ని మాఫీ చేస్తున్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో...

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండు విడతల్లో 44,395 మంది రైతులకు రూ.269.27 కోట్ల రుణమాఫీ చేసినట్లు ఆ జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. తొలి విడత రూ.లక్షలోపు ఉన్న రైతుల రుణాలను మాఫీ చేశారు. దీనిలో భాగంగా 12 బ్యాంకుల్లోని 28,018 మంది రైతులకు రూ.132,06,83,789 రుణాలను మాఫీ చేశారు. రెండో విడత రూ.1.50 లక్షల రుణాల మాఫీలో భాగంగా 16,377 మంది రైతులకు చెందిన రూ.137,21,96,477 రుణాల నగదును ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసింది.



పండుగలా రుణమాఫీ...సీఎం ఫొటోకు పాలాభిషేకం

రుణమాఫీ పథకాన్ని ప్రభుత్వం పండుగలా నిర్వహిస్తోంది. అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేసిన వెంటనే రాష్ట్రంలో హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాల కలెక్టరేట్లలో రుణమాఫీపై ఆయా జిల్లాల కలెక్టర్లు విలేకరులు, రైతులతో సమావేశాలు నిర్వహించారు. రుణమాఫీ పథకానికి సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. పథకం వివరాలను వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కతో పాటు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

కుటుంబాన్ని గుర్తించేందుకే రేషన్‌కార్డు : కలెక్టర్

జిల్లా వార్షిక రుణప్రణాళికను ఇరు జిల్లాల కలెక్టర్లు ఆవిష్కరించారు. ఖమ్మంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆవిష్కరణ అనంతరం వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులను ఉద్దేశించి మాట్లాడారు. రేషన్‌కార్డు రుణమాఫీ పథకానికి ప్రామాణికం కాదన్నారు. కేవలం కుటుంబాన్ని గుర్తించేందుకే దాన్ని వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. భూమితో పాటు నిర్దిష్ట గడువులోపు ఉన్న రూ.2 లక్షలలోపు పంట రుణం ప్రతీ రైతు కుటుంబానికి అందుతుందన్నారు. రానున్న వారం రోజుల్లో రూ.లక్షన్నర లోపు రుణమాఫీ నిధులు పూర్తిస్థాయిలో రైతులకు అందుతాయన్నారు. రుణమాఫీ పథకంపై రైతుల ఫిర్యాదులను నమోదు చేసుకొని పరిష్కరిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారులు నూతన ఆవిష్కరణలు చేయాలన్నారు. రైతువేదికల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం వ్యవసాయానికి ఇచ్చే ప్రాధాన్యాన్ని గుర్తించుకొని కలెక్టరేట్ ప్రవేశ ద్వారం వద్ద సైతం రైతు, వ్యవసాయ నేపథ్యంతో పెయింటింగ్ చేయించామన్నారు. కలెక్టర్‌తో పాటు ఈ సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ, సహకార అధికారులు విజయనిర్మల, మురళీధర్‌రావు, ఎల్డీఎం శ్రీనివాసరెడ్డి, జిల్లా రైతు సమన్వయ సమితి మాజీ చైర్మన్ నల్లమల వెంకటేశ్వరరావు, జిల్లా ఉద్యాన అధికారి బీవీ రమణ, బ్యాంకర్లు, ఇతర అధికారులు పాల్గన్నారు.

డీఎల్సీ సమావేశంలో ఆమోదం పొందిన

పోడు భూములకే హక్కు పత్రాలు

- **కలెక్టర్ జితేష్ వి పాటిల్**

నవతెలంగాణ-దుమ్ముగూడెం



గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి తీర్మానం చేసిన భూములను ప్రత్యేకంగా సర్వే చేసి డీఎల్సీ సమావేశంలో ఆమోదించిన తర్వాతనే గిరిజన రైతులకు పోడు వ్యవసాయం చేసుకోవడానికి హక్కు పత్రాలు అందించామని, అంతవరకే సాగు చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ రైతులకు సూచించారు. మంగళవారం దుమ్ముగూడెం అటవీ రేంజ్ పరిధిలోని గౌరవరం గ్రామానికి చెందిన గిరిజన రైతులు తమను వ్యవసాయం చేసుకోకుండా ఫారెస్ట్ వారు అడ్డుకుంటున్నారని తెలిపారు. 23 మంది గిరిజన రైతులు హైకోర్టులో పిటిషన్ వేయగా, కోర్టు ఆదేశాల మేరకు ఐటీడీఏ పీవో బి.రాహుల్‌తో కలిసి క్షేత్రస్థాయిలో ఆ గిరిజనులకు సంబంధించిన భూములను ఫారెస్ట్ అధికారులు గిరిజన రైతుల సమక్షంలో పరిశీలించారు. హక్కు పత్రాలలో ఉన్న భూమినే కాక ఫారెస్ట్‌కు సంబంధించిన భూమిని కూడా నరికివేసి వ్యవసాయం చేసుకుంటున్నారని, మాకు అన్యాయం జరిగిందని ఫారెస్ట్ వారు మా పంటలను ధ్వంసం చేస్తున్నారని గిరిజన రైతులు హైకోర్టులో పిటిషన్ వేయడం జరిగిందని అన్నారు. తీరా భూములు పరిశీలించాక వారికి సంబంధించిన భూమి కాక ఫారెస్ట్ భూమిని కొందరు గిరిజనులు ఆక్రమించినట్టు మా దృష్టికి వచ్చిందని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం మీకున్న భూమి గురించి ఫారెస్ట్ వారితో ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకొని రావాలని ఆయన గిరిజన రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఆర్డీవో దామోదర్ రావు, ఎఫ్ఆర్ఓ కనకమ్మ, తహసీల్దార్ మణిధర్, గిరిజన రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- **రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మెన్ కొత్వాల**
- **రుణమాఫీని హర్షిస్తూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సంబరాలు**

నవతెలంగాణ-పాల్వంచ



రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన సాగిస్తున్నదని, ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి జిల్లాల డీసీఎంఎస్ చైర్మెన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన 1 లక్ష నుండి 1.50 లక్షల రుణమాఫీని హర్షిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులు, కార్యకర్తలు సంబురాలు నిర్వహించారు. మంగళవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట భారత పార్లమెంటరీ ప్రతిపక్ష నేత, అఖిల భారత కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిల ఫ్లెక్సీలకి పాలాభిషేకం చేశారు. స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ ఒకే దఫా 2 లక్షల రూపాయల రుణమాఫీ చరిత్రాత్మకమన్నారు. ఇప్పటి వరకు 3 సార్లు కాంగ్రెస్ ప్రభుత్వాలే 2 లక్షల రూపాయల రుణమాఫీ చేశాయన్నారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, రైతు ఇన్సూరెన్సు, 24 గంటల ఉచిత విద్యుత్ కాంగ్రెస్ కే సాధ్యం అని అన్నారు. రైతు రాజ్యం కాంగ్రెస్ ప్రజాప్రభుత్వానికే సాధ్యం అని కొత్వాల అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు జాలే జానకిరెడ్డి, మాజీ జడ్పిటిసి యర్రంశెట్టి ముత్తయ్య, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కొండం వెంకన్న, నూకల రంగారావు, ఎల్‌డీఎం కోఆర్డినేటర్ బద్ది కిషోర్, కాంగ్రెస్ నాయకులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కనగాల నారాయణరావు, కాపర్తి వెంకటాచారి, నాగిరెడ్డి, బాలినేని నాగేశ్వరరావు, చింతా నాగరాజు పాల్గొన్నారు.

పేరుకే గురువు... గుణములలో లఘువు

- **విద్యార్థినీలపై ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన**
- **తల్లిదండ్రుల దేహశుద్ధి**
- **పోలీసులకు ఫిర్యాదు,**
- **ఫోక్సో కేసు నమోదు...?**

నవతెలంగాణ-ఇల్లందు



ఎన్ని చట్టాలు చేసినా, పోలీసులు కఠినమైన కేసులు నమోదు చేస్తున్న విద్యార్థినిలపై అసభ్య ప్రవర్తన, లైంగిక వేధింపులు ఆగడం లేదు. బాల బాలికలను కన్న బిడ్డల్లాగా చూసుకోవాల్సిన వారే ఇబ్బందులకు గురిచేస్తున్నారు. గౌరవప్రదమైన బాధ్యతాయుతమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నటువంటి వారు పేరుకే గురువు... గుణములలో లఘువులుగా మారుతున్నారు. తాజాగా పట్టణంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడు ఎ.రాందాస్ గౌరవప్రదమైన వృత్తిలో ఉండి విద్యా బుద్ధులు నేర్పించాల్సిన బాధ్యతను మరిచి విద్యార్థినీలపై లైంగిక వేధింపులకు పాల్పడి మానసిక ఒత్తిడిలకు గురి చేస్తూ అసభ్యకరంగా ప్రవర్తించారు.

పట్టణంలోని పాత గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో రాందాస్ అనే సిఆర్టి ఉపాధ్యాయుడు ఫిజిక్స్ బోధిస్తున్నాడు. ఏడాది క్రితం నుంచి ఇదే పాఠశాలలో పనిచేస్తున్నాడు. 9వ తరగతి విద్యార్థినిలను పట్ల గత కొంతకాలంగా రాందాస్ అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. గతంలో కూడా ఇదే విధంగా జరిగినట్లు తెలిసింది. వార్నింగ్ ఇచ్చి వదిలేసినట్లుగా సమాచారం. అయినప్పటికీ ఆగడాలు ఆగలేదు. చేతులు పట్టుకోవడం భుజాలు తడవడం చిలిపి చేష్టలు, రూముకు రమ్మని చెప్పడం చేస్తూ వేధింపులకు గురి చేయడం చేస్తున్నాడు. విద్యార్థినులు తల్లిదండ్రులకు విషయం తెలియజేశారు. తల్లిదండ్రులు కోపోద్రేకులై ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేశారు. దీంతో పాఠశాలలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ప్రిన్సిపాల్ ఏటిడబ్ల్యూఓ, డీడీ, ఐటీడీఏ జిల్లా అధికారులకు సమాచారమిచ్చినట్లు తెలిసింది. తల్లిదండ్రులు విద్యార్థినులు, ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారించిన పోలీసులు ఉపాధ్యాయుడు పై ఫోక్సో కేసు నమోదు చేసినట్లు సమాచారం.

విద్యార్థినిలపై వేధింపులకు గురిచేసిన ఉపాధ్యాయుడిని వెంటనే ఉద్యోగంలో నుండి డిస్మిస్ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి పృథ్వీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పురుగు మందు తాగి యువరైతు ఆత్మహత్య

నవతెలంగాణ-టేకులపల్లి

మండలంలోని కోయగూడెం గ్రామంలో యువరైతు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం జరిగింది. టేకులపల్లి ఎస్.ఐ. పోగుల. సురేష్ కథనం ప్రకారం కోయగూడెం గ్రామానికి చెందిన జాలా పెద్ద లాలయ్య కుమారుడు జాల ఉపేందర్ (33) గత నాలుగు సంవత్సరాల కిందట అప్పుచేసి రెండు ఎకరాల భూమి కొన్నాడు. ఆ అప్పులు తీరనందున మద్యానికి బానిసై , సోమవారం రాత్రి 7 గంటల సమయంలో కోయగూడెంలోని తన భూమిలో పురుగుమందు తాగాడు. అది గమనించిన పక్క పొలం వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు తెలిపారు. మృతుని తండ్రి జాల పెద్ద లాలయ్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ పోగుల సురేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతునికి భార్యతో పాటు ఒక పాప, బాబు కలరు.

నిత్యావసర వస్తువులు వితరణ

నవతెలంగాణ భద్రాచలం రూరల్

మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోనీ శ్రీరామ్ నగర్ కాలనీలో గల కారుణ్య చిల్డ్రన్స్ హెూమ్‌లోని 54 మంది అనాథ పిల్లలకి నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు కొప్పుల మురళి మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని పిల్లలను చేరదీసి వారికి ఆశ్రయాన్ని కల్పించి బాగోగులు చూసుకుంటున్న నిర్వాహకులు ఆవులూరి సునీల్ సేవలను కొనియాడారు.

చిన్నబీరవల్లిలో తక్షణ చర్యలు చేపట్టిన అధికారులు

నవతెలంగాణ - బోనకల్



చిన్నబీరవల్లి గ్రామంలో మంగళవారం మండల పరిషత్ అధికారులు, మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది తక్షణ చర్యలు చేపట్టారు. నవతెలంగాణ దినపత్రికలో మంగళవారం 'చిన్న బీరవల్లిలో కాళ్ల నొప్పులు, జ్వరంతో బాధలు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి మండల అధికారులు వెంటనే స్పందించారు. ఎంపీడీవో లకావత్ రాజు, ఎంపీఓ వ్యాకరణం వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, సిహెచ్ఓ పెద్దినేని శ్రీనివాసరావు గ్రామంలో బాధితుల ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. అదే విధంగా గ్రామంలోని వీధుల మొత్తం పరిశీలించారు. సైడ్ డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగింపునకు చర్యలు చేపట్టారు. ఆరుగురు పంచాయతీ కార్యదర్శులతో గ్రామంలో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. అధికారులు అక్కడే తిష్ట వేసి పరిశుభ్రత చర్యలు చేపట్టారు. ఆరుగురు పంచాయతీ కార్యదర్శులు దగ్గరుండి మల్టీపర్పస్ వర్కర్ల చేత పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని కూడా నిర్వహించారు. పది రోజులుగా గ్రామంలో కాళ్ల నొప్పులు జ్వరంతో బాధపడుతున్నా పట్టించుకోని అధికారులు 'నవ తెలంగాణ' కథనంతో స్పందించి తక్షణ చర్యలు చేపట్టడం పట్ల గ్రామస్తులు నవతెలంగాణకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు

నిద్రిస్తున్న సమయంలో ఇల్లు దగ్ధం

ఇద్దరి పరిస్థితి విషమం

నవతెలంగాణ-వేంసూరు

నిద్రిస్తున్న సమయంలో ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కావడంతో పూరిల్లు దగ్ధం అవడంతో నలుగురులో ఇద్దరికీ శరీరం కాలింది. వారి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తరలించారు. సోమవారం రాత్రి రామన్నపాలెం గ్రామంలో చుక్క హరిబాబు నివాసం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ మూలంగా ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఆ సమయంలో హరిబాబు, ఆయన భార్య, కుమార్తె, కుమారుడు నిద్రిస్తున్నారు. ఈ ప్రమాదంలో కూతురు, భార్య శరీరం ఎక్కువగా కాలడంతో చికిత్స కొరకు ఖమ్మం తరలించారు. వారి పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించి చికిత్స అందిస్తున్నారు. హరిబాబుకి, ఆయన కుమారిడికి స్వల్ప గాయాలయ్యాయి. ఇల్లు పూర్తిగా దగ్ధం అవడంతో ఇంట్లో ఉన్న నగదుతో పాటు బంగారం వస్తువులు, దుస్తులు అన్నీ పూర్తిగా దగ్ధమయ్యాయి. సంఘటనా స్థలాన్ని తహశీల్దార్, ఎంపీడీవో పరిశీలించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన

నవతెలంగాణ-కల్లూరు

పట్టణ పరిధిలోని బాలికల ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థినీ విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాలకు బాలికల ఉన్నది పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.పద్మ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాసిరెడ్డి నాగపద్మ అధ్యక్షత వహించారు. కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నవ్య కాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ రామారావు మాట్లాడారు.కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది వసంత, మణెమ్మ, రజిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

గుంపెన సొసైటీ వైస్ చైర్మెన్ నల్లమోతు వెంకటనారాయణ

నవతెలంగాణ-చండ్రుగొండ

బ్యాంకుల్లో, సహకార సంఘాల్లో పంట రుణాలు తీసుకున్న రైతులందరికీ భేషరతుగా రుణమాఫీ చేయాలని గుంపెన సొసైటీ వైస్ చైర్మెన్ నల్లమోతు వెంకటనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం రైతువేదికలో రుణమాఫీ రెండో విడత జాబితా విడుదల సందర్భంగా మండల వ్యవసాయశాఖ అధికారి వినయ్‌కి వినతిని సమర్పించారు. ఈ సందర్భంగా వెంకటనారాయణ మాట్లాడుతూఏజెన్సీ ఏరియాలో అడంగల్, పహణీ నకళ్లతో పంట రుణాలను రైతులు తీసుకున్నారని, వారందరికీ మాఫీ వర్తింపజేయాలన్నారు. ఏజెన్సీ ఏరియాలో అన్ని రకాలు పంట రుణాలు కండీషన్లు, కొర్రీలు పెట్టకుండా రుణమాఫీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సమితి మండల సభ్యులు నరుకుల్ల వాసు, బీఆర్ఎస్ నాయకులు చిన్నం రామక్రిష్ణ, రైతులు గాలిబ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు, నిరుపేదలకు దుస్తులు పంపిణీ

నవతెలంగాణ- కల్లూరు

మేజర్ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు, నిరుపేదలకు మంగళవారం ఏసీపీ రఘు చేతుల మీదుగా దుస్తులు పంపిణీ చేశారు. జిఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులు 75 మందికి, 200 మంది నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. మేజర్ పంచాయతీ ఆవరణలో జరిగిన సభలో ఏసీపీ మాట్లాడుతూ జిఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 2008 నుంచి సేవా కార్యక్రమాలు నిర్వహించడం, నిరుపేదలను ఆదుకోవడం అభినందనీయం అన్నారు. నిర్వాహకులు జాస్తి శ్రీనివాసురావును ఈ సందర్భంగా కొనియాడారు. ఈ సందర్భంగా జాస్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏసీపీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సై ఎస్కే షాకీర్, గ్రామపంచాయతీ ఈవో ఎం.నాగేశ్వరరావు, రిటైర్డ్ ఎంఈఓ కాకర్ల రంగారావు, మండల పరిషత్ కోసం సభ్యుడు ఎస్.కె కష్మి, చిట్టిబాబు, మాజీ ఎంపీటీసీ పోర్టు శ్రీనివాసరావు, కట్టా గోపాలరావు పాల్గొన్నారు.


బీరువాలు, కుర్చీలు వితరణ

నవతెలంగాణ- కల్లూరు

మండల పరిధిలోని మర్లపాడు ప్రాథమిక ఉన్నత పాఠశాలకు ఆసిఫాబాద్‌లో ఆర్టీవోగా పని చేస్తున్న శంకర్‌నాయక్, పి.శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదగా పాఠశాలకు మంగళవారం బీరువాలు, కుర్చీలు, విద్యార్థులకు టై, బెల్టు, బ్యాగులు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోమ్లానాయక్ సహకారంతో ఆర్టీవో 30 వేల రూపాయలు విలువ గల సామాగ్రిని వితరణ చేయడానికి ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆర్టీవో శంకర్ నాయక్ మాట్లాడుతూ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలని తద్వారా ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.సోమ్లానాయక్, ఎం.సీతారత్నం, ఏ.పుల్లయ్య, ఎం.రోజను, జి.గుత్య, ఎం.అనూష, విద్యార్థులు పాల్గొన్నారు.

శిరీషను విధుల్లోకి తీసుకోవాలి

నవతెలంగాణ-కల్లూరు



మండల పరిధిలోని పేరువంశం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ సస్పెండ్ గురైన శిరీషను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ యుటిఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డిఓ రాజేందర్ గౌడ్‌కి వినతిపత్రం అందజేశారు. అదే విధంగా తహసిల్దార్ పులి సాంబశివుడికి, ఎంపీడీవో డి.చంద్రశేఖర్‌కు వినతిపత్రాలు అందించారు. సంఘటన జరిగిన తర్వాత ప్రాథమిక విచారణ కూడా లేకుండా షోకాజ్ నోటీస్ ఇవ్వకుండా వెంటనే సస్పెండ్ చేయటం అన్యాయమని, ఇలాంటి సంఘటన వల్ల భవిష్యత్తులో టీచర్లకు విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పే పరిస్థితి ఉండదని అన్నారు. న్యాయ విచారణ చేసి చర్య తీసుకోవాలని, వెంటనే సస్పెండ్ రద్దు చేసి విధుల్లోకి తీసుకోవాలన్నారు.

కరువు భత్యం బకాయిలు
విడుదల చేయాలి

- ఈహెచ్‌ఎస్ స్కీమ్ ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స అందించాలి : ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి
- పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి
- పక్షం రోజుల్లో పరిష్కారం : ప్రొ.కోదండరామ్
- ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో పెన్షన్‌దారుల మౌనదీక్ష



నవతెలంగాణ - ముషీరాబాద్

పెన్షనర్లకు కరువు భత్యం బకాయిలు వెంటనే విడుదల చేయాలని, ఈహెచ్‌ఎస్ స్కీమ్ ద్వారా అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో పెన్షనర్లకు నగదు రహిత చికిత్స వర్తింపజేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్‌దారుల సంయుక్త కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద మౌన దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, ప్రొఫెసర్ కోదండరామ్ హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ.. పెన్షనర్లకు బకాయి ఉన్న నాలుగు కారుణ్య భత్యాలు వెంటనే విడుదల చేయాలన్నారు. ఈహెచ్‌ఎస్ స్కీంను యూనివర్సిటీ రిటైర్డ్ కాలేజీ టీచర్స్, జీహెచ్ఎంసీ, ఎయిడెడ్ పాఠశాలల సిబ్బందికి, మార్కెటింగ్ శాఖల పెన్షనర్లకు కూడా వర్తింపజేయాలని కోరారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు మూడు నెలల్లో చెల్లించేలా ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన ఐఆర్ ఐదు శాతాన్ని కనీసం 20 శాతానికి పెంచాలని, పీఆర్సీ రిపోర్టును వెంటనే తెప్పించుకొని అమలు చేయాలని కోరారు. ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రభుత్వ పెన్షనర్లకు ప్రభుత్వం ఇన్సెంటివ్ ఇచ్చి గుర్తింపు ఇస్తుందని తెలిపారు. తెలంగాణ జనసమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల ఫ్రెండ్లీ ప్రభుత్వమని అన్నారు. కొన్ని అత్యవసర సమస్యల వల్ల పెన్షనర్ల ఇబ్బందులు పరిష్కరించడం ఆలస్యమైందని చెప్పారు. పక్షం రోజుల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉందని తెలిపారు.

పెన్షనర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, వాటి పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలకుర్తి కృష్ణమూర్తి, సమైక్య కార్పొరేషన్ జాతీయ చైర్మెన్ కృష్ణమోహన్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు జంగయ్య, డా.సదయ్య, సోమయ్య, అశోక్ కుమార్, నాగిరెడ్డి, డా.జి.నిర్మల, జేఏసీ నాయకులు శుభాకర్‌రావు, కృష్ణమూర్తి, రాజేంద్రబాబు, భరత్ రెడ్డి, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులపై నిర్బంధం

- చలో హైదరాబాద్‌కు అనుమతివ్వని పోలీసులు
- అయినా ధర్నా విజయవంతం
- ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ 8న రాష్ట్రవ్యాప్త సమ్మె
- ఏడు నెలలుగా వేతనాలివ్వకుంటే ఎలా?
- పర్మినెంట్ చేయాల్సిందే : పాలడుగు భాస్కర్ డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గ్రామపంచాయతీ కార్మికులపై ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగించింది. సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించతలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి పోలీసులు అనుమతి నిరాకరించారు. అయినా హైదరాబాద్‌కు వేలాది మంది పంచాయతీ కార్మికులు చేరుకుని ధర్నాను విజయవంతం చేశారు. గ్రామపంచాయతీ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని ఆ యూనియన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కనీస వేతనాలు అమలు చేయాలనీ, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలనీ, కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని కోరింది. పంచాయతీ కార్మికుల వేతనాలకు ప్రభుత్వమే ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలనీ, పీఆర్సీ పరిధిలోకి వారిని తేవాలని సూచించింది. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ పంచాయతీ కార్మికులపై ప్రభుత్వం వివక్ష చూపుతున్నదని విమర్శించారు. ఆరు నుంచి ఏడు నెలలుగా వారికి వేతనాలు చెల్లించకుండా కాలయాపన చేసిందన్నారు. రూ.150 కోట్లు విడుదల చేసినా కింది స్థాయిలో వేతనాలు చెల్లించకుండా నిర్లక్ష్యం జరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస వేతనాల్లేక, సకాలంలో రాక వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వివరించారు. కార్మికులందరికీ వేతనాలు సకాలంలో అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 20 నుంచి 30 ఏండ్లుగా పనిచేస్తున్నా పర్మినెంట్‌కు నోచుకోక పర్మినెంట్ కాక ఉద్యోగ భద్రత లేక అభద్రతాభావంతో బతుకుతున్నారని అన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా పంచాయతీ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరారు. కనీస వేతనం రూ.18 వేలు అమలు చేయాలనీ, ప్రమాదాల్లో మరణించిన వారికి ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలనీ, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని సూచించారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. అనేక జిల్లాల్లో కార్మికులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించకుంటే వచ్చేనెల 8న రాష్ట్రవ్యాప్తంగా ఎంపీడీవో కార్యాలయాల ముందు ఒక్కరోజు సమ్మెను నిర్వహిస్తామని హెచ్చరించారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల మెడకు ఉరితాడుగా మల్టీపర్పస్ వర్కర్ విధానం ఉందనీ, దాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 51 జీవోను సవరించాలనీ, పాత కేటగిరీలను కొనసాగించాలని కోరారు. బకాయి ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించాలని చెప్పారు. ప్రతినెలా ఒకటో తేదీన జీతాలివ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గ్యార పాండు, వర్కింగ్ ప్రెసిడెంట్ పైళ్ల గణపతిరెడ్డి, ఉపాధ్యక్షులు పాలడుగు సుధాకర్, మహిళా కన్వీనర్ పొట్ట యాదమ్మ కోశాధికారి గడ్డం ఈశ్వర్, రాష్ట్ర ఆఫీసు బేరర్లు తునికి మహేష్, పి వినోద్‌కుమార్, మండల రాజు, పి శ్రీకాంత్, పులి మల్లేషం, నారోజు, రామచందర్, నాయకులు రాపర్తి రాజు, ఆశన్న పాల్గొన్నారు.

ఎక్కడికక్కడ అడ్డగింతలు..

అర్ధరాత్రి ఆశాలు, జీపీల ముందస్తు అరెస్టులు

నవతెలంగాణ- మొఫసిల్ యంత్రాంగం



తమ సమస్యల పరిష్కారం కోసం, కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ చేపట్టిన చలో హైదరాబాద్‌కు రాకుండా గ్రామ పంచాయతీ కార్మికులు, ఆశా కార్యకర్తలను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. కార్యక్రమాలను భగ్నం చేసేందుకు జిల్లాల్లో వారిని ఎక్కడికక్కడ అడ్డగించి అరెస్టు చేసి స్టేషన్లకు తరలించారు. నిజామాబాద్‌లో సోమవారం అర్ధరాత్రి నాయకుల ఇండ్లకు వెళ్లి పోలీసులు నోటీసులు ఇచ్చి.. భయభ్రాంతులకు గురిచేయడమే కాకుండా హౌస్ అరెస్టు చేశారు.

ఖమ్మం జిల్లా వైరాలో ఆశా కార్యకర్తలను అరెస్టు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులో అరెస్టు చేసి.. కేసులు నమోదు చేశారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల, కొత్తూరు, మంచాల, వికారాబాద్ జిల్లా తాండూర్, యాలాల మండలాల్లో సీఐటీయూ నాయకులు, జీపీ కార్మికులు, ఆశాలను అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో వందలాది మంది ఆశాలు, గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్మికులను ముందస్తు అరెస్టు చేశారు. వనపర్తి, వీపనగండ్ల మండల కేంద్రాల్లోనూ జీపీలను ముందస్తు అరెస్టు చేశారు. వరంగల్, హనుమకొండ జిల్లా వ్యాప్తంగా ఆశాలను ముందస్తు అరెస్టు చేశారు. సీఐటీయూ జిల్లా ముఖ్య నేతలను నిర్బంధించారు. హనుమకొండ జిల్లా శాయంపేట గ్రామపంచాయతీ కార్యాలయం ముందు జీపీ ఉద్యోగులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు.

జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలో పంచాయతీ సిబ్బందిని ముందస్తు అరెస్టు చేశారు.నల్లగొండ జిల్లాలోని వేములపల్లి, చిట్యాల, దేవరకొండలో ఆశాలు, నార్కట్‌పల్లి, నాంపల్లిలో సీఐటీయూ నాయకులను, జీపీ కార్మికులను తెల్లవారుజామునే అరెస్టు చేశారు. సూర్యాపేట జిల్లా.. ఆత్మకూర్, మఠంపల్లి మండలంలో సీఐటీయూ నాయకులు అరెస్టయ్యారు. యాదాద్రిభువనగిరి జిల్లా వ్యాప్తంగా ఆశాలు, గ్రామపంచాయతీ కార్మికులను ముందస్తు అరెస్టు చేశారు. ఉమ్మడి మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లోనూ అరెస్టులు జరిగాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఆశాలు, గ్రామపంచాయతీ కార్మికులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. అరెస్టులపై సీఐటీయూ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.నిజామాబాద్‌లో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్‌తోపాటు పలువురు నాయకులకు నోటీసులు అందజేసి సోమవారం రాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు హౌస్ అరెస్టు చేశారు. కాగా, మున్సిపల్ కార్మికులను, ఆటో డ్రైవర్లను కూడా అక్రమంగా అరెస్టు చేసి నిర్బంధించడాన్ని నిరసిస్తూ ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా పలువురు నాయకులను, కార్మికులను ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

నిండుకుండలా శ్రీశైలం

నవతెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

నారాయణపూర్, ఆల్మట్టి నుంచి భారీగా వరద వస్తుండటంతో జూరాలను దాటి శ్రీశైలం రిజర్వాయర్ నిండుకుండలా మారింది. దీంతో అధికారులు శ్రీశైలం ఏడు క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర ఎత్తి సాగర్‌కు నీటిని వదిలారు. సోమవారం మూడు గేట్లను ఎత్తగా, మంగళవారం మరో నాలుగు గేట్లు తెరుచుకున్నాయి. వడివడిగా కృష్ణమ్మ సాగర్‌కు పరవళ్లు తొక్కుతోంది. గేట్లు ఎత్తడంతో సందర్శకుల తాకిడి పెరిగింది. పోలీసులు, నీటిపారుదల శాఖ అధికారులు ఎప్పటికప్పుడూ సమీక్షిస్తున్నారు. వాహనదారులను ప్రాజెక్టు సమీపానికి వెళ్లకుండా నివారిస్తున్నారు. కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల ద్వారా కూడా నీరు దిగువకు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులకు 215 టీఎంసీలకు సమానంగా చెప్పొచ్చు. 2023లో శ్రీశైలం పూర్తిస్థాయిలో నిండలేదు. ఈ సారి భారీగా వరద వస్తుండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం 882.50అడుగులకు చేరుకున్నది. 201.58 టీఎంసీలు నిల్వ ఉన్నది. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది.

ఫిరాయింపు ఎమ్మెల్యేల్లపై పిటిషన్లపై కోర్టు ఆదేశాలు జారీ చేయొచ్చు

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తరఫున గండ్ర వాదనలు

నవతెలంగాణ -హైదరాబాద్

బీఆర్ఎస్ తరఫున గెలిచాక కాంగ్రెస్‌లో చేరిన ముగ్గురు ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్, తెల్లం వెంకట్రావులను అనర్హులుగా ప్రకటించాలనే పిటిషన్లపై హైకోర్టు విచారణ ఆగస్టు ఒకటో తేదీకి వాయిదా పడింది. వాళ్లను ఎమ్మెల్యేలుగా కొనసాగించడానికి వీల్లేదనీ, అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద వేసిన పిటిషన్లపై మంగళవారం వాదనలు జరిగాయి. స్పీకర్ కార్యాలయానికి నోటీసు ఇవ్వొచ్చునని పిటిషనర్ల న్యాయవాది, స్పీకర్ రాజ్యాంగపరంగా అత్యున్నత పదవిలో ఉన్నందున కోర్టులు నోటీసులు జారీ చేయడానికి వీల్లేదని ప్రతివాదులైన కడియం, దానం న్యాయవాదులు వాదించారు. విచారణను వాయిదా వేస్తున్నట్టు జస్టిస్ విజయసేన్‌రెడ్డి వెల్లడించారు.

ప్రజావాణికి 455 దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 455 దరఖాస్తులు అందాయి. రెవెన్యూపరమైన సమస్యలకు సంబంధించి 94 , పౌరసరఫరాల శాఖకు సంబంధించి 77, విద్యుత్ శాఖకు సంబంధించి 45, హౌజింగ్‌కు సంబంధించి 44 దరఖాస్తులు, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 40, ఇతర శాఖలకు సంబంధించి 155 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్‌కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.



యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ డే సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ఆ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ, కమిషనర్ కాంతి వెస్లీ, ప్రజ్వల ఫౌండేషన్ నిర్వహకురాలు సునీతా కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ముట్టడికి కేజీబీవీ కాంట్రాక్టు టీచర్ల యత్నం

- ముఖ్యమంత్రి మాటిచ్చి మరిచారని ఆవేదన
- ఎక్కడికక్కడ అరెస్టులు చేసిన పోలీసులు



నవతెలంగాణ-చాంద్రాయణగుట్ట

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల టీచర్లు మంగళవారం అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. ఖమ్మం, సూర్యాపేట, నారాయణపేట, మహబూబ్‌నగర్ రంగారెడ్డి తదితర జిల్లాల నుంచి వచ్చిన వారు అసెంబ్లీ ముట్టడికి బయల్దేరగా.. నగరంలో ఎక్కడికక్కడ పోలీసలు అరెస్టు చేశారు. అనంతరం వారిని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. దాదాపు 150 మంది ఉద్యోగులను ఫలక్‌నుమా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వరంగల్‌కు చెందిన కాంట్రాక్ట్ టీచర్ మహేశ్వరి మాట్లాడుతూ.. "మీ సమస్య చాలా చిన్న సమస్య.. మేము అధికారంలోకి వచ్చాక ఒక చాయ్ తాగినంత సమయంలో మీ పని చేస్తాం" అని ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట ఇచ్చారన్నారు. కానీ ఆ తర్వాత తమను మర్చిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. 15 సంవత్సరాలుగా కేజీబీవీలో తాము పని చేస్తున్నామని, పని గంటలు ఎక్కువ.. చాలీచాలని వేతనాలతో నెట్టుకొస్తున్నామని చెప్పారు. తమను సీనియారిటీ ప్రకారం రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేశారు.

కదం తొక్కిన ఆశాలు

(మొదటిపేజీ తరువాయి)

స్తంభించిపోయాయి. ఉదయం 11 గంటలకు మొదట 300 మందికిపైగా ఆశాలు దిల్‌సుఖ్‌నగర్ బస్టాప్ పక్కనున్న కమిషనర్ కార్యాలయం ప్రధాన గేటు నుంచి లోనికి వెళ్లేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన పోలీసులు గేటును మూసేయడంతో అక్కడే కూర్చుని ధర్నా చేపట్టారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అప్రమత్తమైన పోలీసులు వారిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కొద్ది సేపటికి తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి.జయలక్ష్మి ఆధ్వర్యంలో రెండు వేల మందికి పైగా కార్యకర్తలు మెడికల్ కాలేజి నుంచి ర్యాలీగా తరలి వచ్చారు. దాంతో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఖంగుతిన్న పోలీసులు అదనపు బలగాలను రప్పించి వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ కార్యాలయం చుట్టు పక్కల మోహరించారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు వివిధ జిల్లాల నుంచి వేలాదిగా ధర్నా స్థలికి తరలి వచ్చారు. ప్రధాన రహదారిపై కూర్చుండి తమ డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఉద్యోగ భద్రతతో పాటు కనీస వేతనం రూ.18 వేలు, పీఎఫ్, ఈఎస్ఐ



సౌకర్యం కల్పించాలనీ, ఆశా కార్యకర్తల సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి నెలా 1 నుంచి 5వ తేదీ మధ్య జీతాలు చెల్లించాలని కోరారు. మధ్యాహ్నం 1.30గంటలకు పోలీసులు ధర్నా చేస్తున్న వారి వద్దకొచ్చి జయలక్ష్మితో పాటు 10 మంది డెలిగేషన్‌ను లోనికి అనుమతించారు. కమిషనర్‌తో పాటు ఉన్నతాధికారులెవరూ అందుబాటులో లేకపోవడం, ఉన్న వారు సరిగా స్పందించకపోవడంతో లోనికెళ్లిన ప్రతినిధి బృందం తిరిగి ప్రధాన గేటు వద్దకొచ్చి లోపలివైపే కూర్చొని ఆందోళన కొనసాగించారు. ఈ క్రమంలో మధ్యాహ్నం 1.50 గంటలకు కొంతమంది గేటు పైకిఎక్కి లోనికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో ఒక్కసారిగా కార్యకర్తలు దూసుకొచ్చారు. కొద్ది సేపు పోలీసులకు ఆశాలకు మధ్య తోపులాట జరిగింది. గేటు తోసుకొని 1000 మందికి పైగా కమిషనర్ కార్యాలయంలోనికి వెళ్లారు. ఈ క్రమంలో ఆక్టోపస్ కార్యాలయం ముందున్న గేటును మూసేసిన పోలీసులు వారిని అక్కడే అడ్డుకున్నారు. ఈ లోపు ప్రధాన గేటు వద్దకు అదనపు బలగాలు చేరుకుని గేటు మూసేశాయి. కమిషనర్ కార్యాలయం లోపల గేటు వద్ద కొంత మంది, బయట గేటు వద్ద మరి కొంత మంది ఆందోళన కొనసాగించారు. దాంతో దిగొచ్చిన సర్కార్ కమిషనర్ కర్ణన్‌ను ధర్నా స్థలికి పంపించింది. ఆశాలతో చర్చించిన ఆయన పలు డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆశాలు తాత్కాలికంగా ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నీలాదేవి, కోశాధికారి పి.గంగమణి, ఆఫీస్ బేరర్స్ ఎం.శ్రీలత, ఎం.కొండాలక్ష్మి, పద్మ, వరలక్ష్మి, సునీత, లత, కళావతి, రాష్ట్ర నాయకులు ఎం.మీనా, వెంకటమ్మ, సుశీల, సమ్మక్క, శ్రీవాణి, ఉపేంద్ర, సావిత్రి, ప్రవీణ, బుచ్చమ్మ, బాలమణి, సునీత, రేవతి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

గద్వాల ఎమ్మెల్యే బ్యాక్ టు బీఆర్ఎస్..

- అసెంబ్లీ లాబీల్లో మాజీ మంత్రి కేటీఆర్‌తో భేటీ
- ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌తో చర్చలు
- సలహాల కోసమే కలిశానంటూ వివరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కొద్ది రోజుల క్రితం బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తిరిగి గులాబీ గూటికి చేరారు. మంగళవారం అసెంబ్లీ లాబీల్లో ఆయన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో భేటీ అయ్యారు. అభివృద్ధి కోసమే తాను అధికార పార్టీలో చేరుతున్నట్టు గతంలో ప్రకటించిన ఆయన... కొద్ది రోజుల్లోనే సొంతగూటికి చేరుకోవటం ఇప్పుడు చర్చనీయాంశమైంది.

కృష్ణమోహన్‌రెడ్డి 2018 అసెంబ్లీ ఎన్నికల్లో గద్వాల నుంచి పోటీ చేసి, సిట్టింగ్ ఎమ్మెల్యే డీకే అరుణను ఓడించారు. అయితే ఆయన ఎన్నికల్లో తప్పుడు అఫిడవిట్‌ను సమర్పించారంటూ డీకే అరుణ హైకోర్టుకెళ్లారు. దీంతో ఆయన ఎన్నిక చెల్లదంటూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఈ క్రమంలో కృష్ణమోహన్‌రెడ్డి సుప్రీంకోర్టు నుంచి స్టే తెచ్చు కున్నారు. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ గద్వాల నుంచే పోటీ చేసి గెలుపొందారు. కానీ ఈసారి బీఆర్ఎస్ కాకుండా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. దీంతో అభివృద్ధి కోసమంటూ బండ్ల హస్తం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

ఈ క్రమంలో మొన్నటి ఎన్నికల్లో ఆయనపై పోటీ చేసి ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థి సరిత... బండ్ల రాకను తీవ్రంగా వ్యతిరేకించారు. ఆమె తన అనుచరులతో కలిసి హైదరాబాద్‌లోని గాంధీ భవన్ వద్ద ధర్నా చేసిన సంగతి విదితమే. దీంతో ఆమెతో సీఎం రేవంత్ చర్చలు జరిపారు. రాజకీయ భవితవ్యంపై ఆయన హామీ ఇవ్వటంతో ఆమె సైలెంటయ్యారు. కానీ అంతకుముందే ఆమె కృష్ణమోహన్‌రెడ్డిపై కోర్టులో కేసు వేశారు. తప్పుడు అఫిడవిట్ సమర్పించిన ఆయనపై అనర్హత వేటేయాలంటూ కోరారు.

ఈ విషయంలో కాంగ్రెస్ పెద్దలు నచ్చజెప్పినా ఆమె వెనక్కి తగ్గలేదు. మరోవైపు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ కూడా పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేయాలంటూ డిమాండ్ చేస్తోంది. ఈ అంశంపై సుప్రీంకోర్టును సైతం ఆశ్రయి స్తామంటూ చెబుతోంది. ఈ క్రమంలో తనపై కోర్టు అనర్హత వేటేస్తే ఎలా..? అదే జరిగి ఉప ఎన్నికొస్తే అప్పుడు ఖర్చు భరించటం మరింత కష్టమనే పద్ధతుల్లో బండ్ల ఆలోచించినట్టు సమాచారం. ఆయన బాటలోనే గూడెం మహిపాల్‌రెడ్డి, పోచారం శ్రీనివాసరెడ్డి, కాలె యాదయ్య తదితరులు ఉన్నట్టు తెలంగాణ భవన్ వర్గాలు చెబుతున్నాయి.

కాగా తనపై డీకే అరుణ కోర్టులో కేసు వేసినప్పుడు బీఆర్ఎస్ లీగల్ అడ్వైజర్ రాంచందర్... సుప్రీంకోర్టులో కేసు వాదించి, స్టే తెచ్చారని కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. అయితే ఇటీవల తాను కాంగ్రెస్‌లో చేరిన నేపథ్యంలో తన కేసు నుంచి రాంచందర్‌ను తప్పించారని చెప్పారు. అందువల్ల ఈ విషయంలో సహాయం చేయాలనీ, తన లీగల్ అడ్వైజర్‌గా ఆయన్నే కొనసాగించాలని కోరేందుకే కేసీఆర్, కేటీఆర్‌తో భేటీ అయినట్టు బండ్ల వివరించారు. అంతేతప్ప తాను పార్టీ మారబోవటం లేదంటూ ఆయన వివరణివ్వటం గమనార్హం.

పార్టీ మారటం లేదు : తెల్లం

తాను కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరుతున్నట్టు వచ్చిన వార్తలను భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఖండించారు. తాను పార్టీని వీడటం లేదనీ, కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని స్పష్టం చేశారు. కాలె యాదయ్య సైతం అధికార పార్టీలోనే కొనసాగుతానని వెల్లడించారు.

కేజ్రీవాల్ ప్రాణాలకు ముప్పు

- ఆయనను విడుదల చేయాలి
- ఇండియా బ్లాక్ నేతల డిమాండ్
- జంతర్ మంతర్ వద్ద ఆందోళన

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తీహార్ జైలులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రాణాలకు ముప్పు ఉందని ప్రతిపక్ష ఇండియా బ్లాక్ నేతలు డిమాండ్ చేశారు. కేజ్రీవాల్ ఆరోగ్యం క్షీణిస్తున్న నేపథ్యంలో ఆయనను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం నాడిక్కడ జంతర్ మంతర్‌లో ఇండియా బ్లాక్ పార్టీలు భారీ ఆందోళన నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, ఎన్‌సీపీ నేత శరద్ పవార్, సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, ఎస్పీ నేత అఖిలేశ్ యాదవ్, కాంగ్రెస్ నేతలు ప్రమోద్ తివారీ, గౌరవ్ గొగోయ్, సీపీఐఎంఎల్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, కేజ్రీవాల్ భార్య సునీత, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, డీఎంకే ఎంపీ తిరుచ్చిశివ, శివసేన నేత సంజయ్ రావత్, టీఎంసీ ఎంపీ సాగరిఘోష్, ఆర్‌జెడి ఎంపీ మనోజ్ కుమార్ ఝా తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీతారాం ఏచూరి మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించే విస్తృత పోరాటంలో భాగమే కేజ్రీవాల్ విడుదల పోరాటమని అన్నారు. 80 ఏండ్ల వృద్ధుడు స్టాన్ స్వామిని ఎలాంటి ఆధారాలు లేకుండా జైళ్లోపెట్టి క్రూరత్వానికి పాల్పడ్డారని విమర్శించారు. నేరం రుజువయ్యే వరకు ఒక వ్యక్తి నిర్దోషి అని చట్టం చెబుతోందని, అయితే, ఈ ప్రభుత్వ హయాంలో నిర్దోషి అని రుజువయ్యేంత వరకు ఒకరు దోషిగా ఉండటమే ఆచారమైందని విమర్శించారు. ఈ పరిస్థితిలో రాజకీయ శతృత్వంతో జైలులో ఉన్న అమాయకులందరినీ విడుదల చేయాలన్న ప్రచారాన్ని మరింత బలోపేతం చేయాలని ఏచూరి పిలుపునిచ్చారు.

గత 22 ఏండ్లుగా మధుమేహంతో బాధపడుతున్న అరవింద్ కేజ్రీవాల్‌కు జైల్లో ఇన్సులిన్ కూడా అందకుండా చేస్తున్నారని కేజ్రీవాల్ భార్య సునీతా కేజ్రీవాల్ అన్నారు. ఆయన తన మధుమేహం స్థితిని తెలుసుకోవడానికి తన చేతికి సెన్సార్‌ను ధరించారని, ఫలితంగా, ఆయన మధుమేహ పరిస్థితిలో అనేక ప్రమాదకరమైన మార్పులు వచ్చాయని అన్నారు. ప్రాణాపాయం లేదని అధికారులు చెప్పడం వింతగా ఉందని సునీత అన్నారు.

కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ ప్రమోద్ తివారీ మాట్లాడుతూ కేజ్రీవాల్ భార్య సునీతను "ప్రతిఘటనకు చిహ్నం"గా పేర్కొన్నారు. అరవింద్ కేజ్రీవాల్ అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో కాంగ్రెస్ పూర్తి నైతిక మద్దతు ఇచ్చేందుకు తాము వచ్చామని అన్నారు. బీజేపీ దురుద్దేశం తప్ప మరొకటి లేదని ఆయన ఆరోపించారు.

సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య మాట్లాడుతూ ముగ్గురు సీనియర్ ఆప్ నేతలు కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, సత్యేందర్ జైన్‌లను "కుట్రలో భాగంగా" జైలులో పెట్టారని అన్నారు. ఢిల్లీ ప్రభుత్వ పనిని కేంద్రం అడ్డుకుంటోందని, రాజేందర్ నగర్ కోచింగ్ సెంటర్‌లో మరణాలతో సహా దేశ రాజధానిలో పరిస్థితికి బీజేపీదే బాధ్యతని ఆయన విమర్శించారు. కుట్రలో భాగంగా ఆప్‌ను అంతం చేయాలని, ఢిల్లీ ప్రభుత్వాన్ని నిర్వీర్యం చేయాలని బీజేపీ యత్నిస్తుందని అన్నారు.

సీపీఐ ప్రధాన కార్యదర్శి డి రాజా మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత, ప్రజాస్వామ్యం ప్రజల కోసం కాకుండా పోయిందని విమర్శించారు. "మోడీ ప్రభుత్వం ఉపయోగించే కేంద్ర సంస్థల బాధితుల్లో కేజ్రీవాల్ ఒకరు. దీనిని మనం అనుమతించగలమా? దేశంలో ఈ పరిస్థితిని ఇంకా ఎంతకాలం తట్టుకోగలం.

కేజ్రీవాల్ ఆరోగ్యం బాగాలేదు. ఆయన ఆరోగ్యం క్షీణించింది" అని ఆయన అన్నారు. ఆప్ ఢిల్లీ కన్వీనర్ గోపాల్ రాయ్ మాట్లాడుతూ కేజ్రీవాల్ షుగర్ లెవల్స్ అదుపులో పడిపోతున్నాయని అన్నారు. "ఆయనకి ట్రయల్ కోర్టు, సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే ఆయన్ని జైలులో ఉంచడానికి కుట్ర జరిగింది. ప్రతిపక్ష నాయకులను ఎందుకు జైల్లో పెట్టాలని బీజేపీ కోరుకుంటుంది?" రాయ్ ప్రశ్నించారు.

కేజ్రీవాల్‌ను రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్న బీజేపీ, ఢిల్లీ ప్రభుత్వ అధికారాలను లాక్కుందని అన్నారు. వారికి హక్కులు కావాలని, బాధ్యత వహించాల్సి వచ్చినప్పుడు పారిపోతుందని ఎద్దేవా చేశారు.

రోజూ నడిస్తే...

కోవిడ్-19 అనంతరం ప్రజలంతా ఆరోగ్యం పట్ల అధిక శ్రద్ధ వహిస్తున్నారు. ఆరోగ్యంగా ఉండడానికి మంచి ఆహారంతో పాటు తగిన వ్యాయామాలు, యోగ వంటివి అలవాటు చేసుకుంటున్నారు. వీటన్నింటితో పాటు రెగ్యులర్ వాకింగ్ కూడా చేస్తున్నారు. అయితే, వాకింగ్ విషయంలో కొన్ని చిట్కాలు పాటిస్తే మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. ప్రతి రోజూ వాకింగ్ చేసేవారు వేగంగా నడిస్తే ఆరోగ్యానికి చాలా మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. రోజు పదివేల అడుగులు నడవడం వలన గుండె సంబంధిత సమస్యలు ఉండవు. అకాల మరణం ముప్పు కూడా తగ్గుతుందని సూచిస్తున్నారు. బీపీ, కొలెస్ట్రాల్ కూడా తగ్గుతాయి. వాకింగ్ చేయడం వలన ఒత్తిడి కూడా పూర్తిగా తగ్గిపోతుంది. నరాల పనితీరు కూడా బాగుంటుంది. వేగంగా నడిస్తే మెదడు పని తీరుపై అనుకూల ప్రభావం కనబడుతుంది. మూడ్ స్వింగ్స్,



జ్ఞాపకశక్తి, మంచి నిద్రకి కూడా మేలు చేస్తుంది. వేగంగా నడవడం వల్ల మరేన్నో ఉపయోగాలు ఉంటాయి. అవేంటో ఇక్కడ తెలుసుకుందాం..

మీరు టైప్ 2 డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గించుకోవాలనుకుంటే ప్రతిరోజూ గంటకు నాలుగు లేదా అంతకంటే ఎక్కువ కిలోమీటర్ల వేగంతో నడవాలని సర్వేలో తేలింది. వాకింగ్ వేగం ఎంత ఎక్కువగా ఉంటే.. దానితో సంబంధం ఉన్న ప్రమాదం అంత తక్కువగా ఉంటుందని పరిశోధనలు చెబుతున్నాయి. గంటకు 3-5 కిలోమీటర్ల సగటు నడక వేగం టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదాన్ని 15శాతం తగ్గిస్తుందని పరిశోధనలు చెబుతున్నాయి. వేగంగా నడవటం వల్ల మధుమేహం నివారణలో సహాయపడటమే కాకుండా అనేక సామాజిక, మానసిక, శారీరక ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది.

మాములు నడక కంటే వేగంగా నడవటం వల్ల గుండె సంబంధిత వ్యాధులు, క్యాన్సర్ వంటి ముప్పు నుంచి రక్షించుకోవచ్చని పరిశోధకులు చెబుతున్నారు. వేగంగా నడవటం వల్ల ఏరోబిక్ ఆక్టివిటీ పెరుగుతుంది. బీపీ, కొలెస్ట్రాల్ సైతం నియంత్రణలో ఉంటాయి. వాకింగ్ చేయడం వల్ల ఒత్తిడి దూరం అవుతుంది. నరాల పనితీరు మెరుగుపడుతుంది. వేగంగా నడవటం వల్ల మెదడు పనితీరుపై అనుకూల ప్రభావాన్ని చూపుతుంది. ఇది మూడ్ స్వింగ్స్, జ్ఞాపకశక్తి, నిద్రకు మేలు చేస్తుంది.

నేలపట్ల మట్టి తల్లి

కళ ప్రజల కోసం కనాలి... ప్రజా ఆశయాల కోసం కనాలి... ఇదే లక్ష్యంతో ప్రజల కోసం తన గళాన్ని వినిపిస్తోంది. ప్రజా గొంతుకై ఉద్యమ, విప్లవ వీరుల పాటలు పాడుతోంది. తన పాటలతో ప్రజల్ని చైతన్యం చేస్తుంది. చౌటుప్పల్ మండలం, నేలపట్ల గ్రామానికి చెందిన ప్రముఖ గాయని పబ్బతి స్వాతి గౌడ్. ప్రజా గాయినిగా మంచి గుర్తింపు తెచ్చుకుంటున్న ఆమె పరిచయం నేటి మానవిలో...

స్వాతి తండ్రి పుల్లయ్య. గ్రామంలో వ్యవసాయం చేస్తూ ప్రజా కళాకారుడిగా ప్రజా నాట్యమండలిలో పని చేస్తూ, ప్రజలతో మమేకమై పాటలు పాడుతుంటాడు. అతనికి నలుగురు కూతుళ్లు. మూడో కూతురు స్వాతిపై పుల్లయ్య ప్రభావం పడింది. ఆయన ప్రోత్సాహంతో చిన్నతనం నుండి తాను విద్యనభ్యసించిన ప్రభుత్వ పాఠశాలలో పాటల పోటీలో పాల్గొని బహుమతి అందుకుంది. అలాగే చౌటుప్పల్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న రోజుల్లో కళాశాల వారు నిర్వహించే ప్రతి కార్యక్రమంలో పాల్గొంటూ పాటలు పాడి పలువురి ప్రశంసలు పొందింది. ప్రస్తుతం మాతృశ్రీ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి డయోగ్నస్టిక్ కంప్యూటర్ ఉద్యోగం చేస్తోంది. ఉద్యోగం చేస్తూనే ప్రజల్ని, వృత్తిదారులను ఆలోచింపజేసేలా చాలా వేదికలపై చైతన్యవంతమైన పాటలు పాడి అందరినీ ఆకట్టుకుంటుంది.

కండ్ల ముందు నిలుపుతోంది

సామాజిక, ప్రజా సంక్షేమం కోసం ఆమె పాట ఉద్యమ బాటై నిలుస్తుంది. ఉద్యమ పాటలే కాకుండా జానపద పాటలు పాడి ప్రజల జీవితాలు ఎలా ఉంటాయో సూచిస్తూ తన గళంతో ఉత్సాహం కలిగిస్తుంది. తన గళాన్ని విస్తృతం చేస్తూ, శ్రామికుల కష్టాలను, పల్లెల బతుకు చిత్రాలను కండ్ల ముందు పెడుతుంది. వీరుల గాథల గురించి పాడే పాటలు మనలో స్ఫూర్తినింపుతాయి. ప్రతి పాటను అలవోకగా పాడే ఆమె స్వరం ఇప్పుడు ఎంతో మందికి దగ్గరవుతోంది. అందుకే ఆమె కళను గుర్తించి పలు స్టూడియోల వారు ఆమె పాడిన పాటలను ఆల్బమ్స్‌గా రూపొందించి విడుదల చేస్తున్నారు.

వీక్షకులకు దగ్గరయ్యింది

రేలారే రేలా పల్లె పాట, సరంగదరియా తదితర కార్యక్రమాలలో పాల్గొని తన గానంతో వీక్షకులకు దగ్గరయ్యింది. వివిధ టీవీ ప్రసారమాధ్యమాల్లో పాల్గొంటూ మధుప్రియతో కలిసి తన స్వరాన్ని కలిపింది. ఎంతో మంది ప్రముఖుల ప్రశంసలు అందుకుంది. పల్లెటూర్లలో వ్యవసాయమే ప్రజల ప్రధాన వృత్తి. రైతే దేశానికి వెన్నుముక అన్నారు. అలాంటి రైతులు వరి నాట్లు వేసేటపుడు వారితో కలిసి పదం పాడుతూ కదం తొక్కుతుంది. 'ముసురు ముసురు పెట్టే / మురిపెంగ కురిసే వాన / గట్లపైన కురిసే / గలగల పారెను వాన' అంటూ వారి శ్రమను మర్చిపోయే పాటలు వినిపిస్తోంది. ఈ పాట పల్లెల్లో చిగురించిన ప్రకృతిని ఒడిసి పడుతుంది.

రైతుల ఎద గోస

'మట్టిని తాకే చేతులకు / పరి పరి దండాలో' అంటూ పల్లెల్లో వ్యవసాయమే జీవన వృత్తి కాబట్టి అలాంటి రైతుల ఎదలోని బాధలను ఈ పాటలో తెలియజేస్తుంది. 'ఉద్యమాల యుద్ధభేరి సాంబశివుడురో / అమ్మానాన్నలు పెట్టిన పేరు ఐలన్న రో'.... తెలంగాణ గొప్ప ఉద్యమకారుడుని జీవితం గురించి తెలియజేసిన ఈ పాట అమరుల త్యాగాలను తెలియజేస్తోంది. నాటి దేశ్‌ముఖ్‌ల అరాచకాలను గుర్తుచేస్తూ ఉద్యమం అంటే ఏంటో చూపిస్తుంది. 'పచ్చని మా పల్లెటూరు / పాడిపంటల సెలయేరు / కరువుకోనల్లో చిక్కిందో / ఎండినావో బొద్దు మల్లెలార' అంటూ ప్రకృతి విలయతాండవాన్ని, కరువు రక్కసి రావడం, వర్షాలు పడకుండా పంటలు పండక పోవడంతో రైతు పడే బాధలను తెలియజేసే ఈ పాట ఈమె నోటి నుండి వింటే కన్నీరు పెట్టుకోవల్సిందే.



త్యాగాలని తలపిస్తూ...

నేలపట్ల మట్టి గర్భాన/పుట్టిన చిన్న నలుసుని/ ఉట్టిపడుతుందమ్మా/నాలో నా మట్టి వాసన/ పల్లెదనం నా గొంతు వాసన/ అంటూ తాను పుట్టిన ఊరిని గుర్తు చేసుకుంటూ పాడిన ఈ పాట విన్న తర్వాత కందాల రంగన్న, కాచం కృష్ణమూర్తి వంటి వీరులు గుర్తుకు వస్తారు. నిజానికి నేలపట్ల మట్టి గర్భంలో జన్మించిన ఆ వీరుల త్యాగాన్ని వినిపిస్తూ, తలపిస్తూ నేలపట్ల మట్టి పాట అయింది స్వాతి. 'ధనాధనా డప్పుల్లో / దరువు లేస్తాము / బతుకమ్మ నీ చుట్టూ ఆటలాడెదము' అంటూ తెలంగాణకే పరిమితమైన స్త్రీల పండుగలలో బతుకమ్మ పండుగ ఎంతో ముఖ్యమైంది. పల్లెటూర్ల ఆనందాన్ని, తెలంగాణ ప్రతీక అయిన బతుకమ్మ పుట్టుపూర్వోత్తరాలను కలిపే అంశాలు ఈ పాటలో మనకు కనబడతాయి. బతుకమ్మ పాటగా స్త్రీల నాలుకలపై తాను పాడిన ఈ పాట నిత్యం నర్తిస్తూనే ఉంటుంది.

విశేషమైన ప్రజాధరణ

'ఆడోల్లకు ఏమిచ్చే/ అంగట్లో అమ్మేత్తే / వరల్డ్ బ్యాంకుకి / పోరు బాటలో పోదాము' అంటూ గద్దర్ రాసిన పాట ఎంతో మందిని చైతన్య పరిచింది. ఇదే పాటను తన గళంతో వినిపించి మరోసారి పాటై పూసింది. స్త్రీలపై జరుగుతున్న దాడులను, చట్టాలు ఉన్నా హింసించే వారికి చుట్టాలుగా మారాయని, పోరు బాటలో పోవడమే పరిష్కారమని వినిపించిన ఈ పాటలో మహిళల ఆవేదన వినిపిస్తుంది. కాబట్టే విశేషమైన ప్రజాధరణ పొందింది. చాలా కాలం నుండి సోషల్ మీడియా, ఇనిస్టాగ్రామ్, యూట్యూబ్‌తో పాటు అనేక ప్రసార మాధ్యమాలలో తన పాటలతో చైతన్యాన్ని చాటుతున్న ఉద్యమ గాయని స్వాతి. తన విప్లవ గేయాలతో నేలపట్ల మురిసిపోయేలా, ప్రజలు గర్వించేలా చేస్తోంది.

- బూర్గు గోపికృష్ణ,
7995892410.



మహానగరంలో దారుణాలు

నవతెలంగాణ-ఓయూ/వనస్థలిపురం

మహిళలపై లైంగిక వేధింపులు అరికట్టేందుకు ప్రభుత్వాలు ఎన్ని కఠిన చర్యలు తీసుకుంటున్నా నేరాలు మాత్రం ఆగడం లేదు. తాజాగా రాష్ట్రంలో రెండు వేర్వేరు చోట్ల దారుణాలు చోటుచేసుకున్నాయి. కదులుతున్న బస్సులో ఓ మహిళపై అర్థరాత్రి డ్రైవర్ లైంగికదాడికి పాల్పడగా.. మరో ఘటనలో యువతిపై స్నేహితులే దారుణానికి ఒడిగట్టారు.

ఓయూ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓ మహిళ తొమ్మిదేండ్ల కుమార్తెతో కలిసి ఏపీలోని ప్రకాశం జిల్లా పొదిలి వెళ్లడానికి హరికృష్ణ ప్రయివేటు ట్రావెల్స్ బస్సులో సీటు రిజర్వు చేసుకుంది. సోమవారం రాత్రి ఆదిలాబాద్ జిల్లా నిర్మల్ నుంచి ప్రకాశం జిల్లాకు బస్సు బయల్దేరింది. సీటు నెంబర్ 1లో కూర్చున్న ఆ మహిళతో డ్రైవర్ కృష్ణ మాటలు కలిపాడు. మార్గ మధ్యలో మెదక్ జిల్లా చేగుంట వద్ద డిన్నర్ కోసం బస్సును ఆపారు. అప్పుడే డ్రైవర్ పథకం వేశాడు. తల్లీబిడ్డలకు 1వ నెంబర్ సీటు సరిపోవడం లేదు.. వెనకాల ఫుల్ బెర్త్ సీటు ఖాళీగా ఉంది, వెళ్లి అక్కడ కూర్చోండని నమ్మబలికాడు. మరో డ్రైవర్ సైదయ్యకు డ్రైవింగ్ అప్పగించాడు. అర్ధరాత్రి 12 దాటాక ప్రయాణి కులందరూ నిద్రలో ఉండగా.. డ్రైవర్ కృష్ణ ఆ మహిళ వద్దకు వెళ్లి నోటిపై బెడ్ షీటుతో అదిమిపట్టి బలవంతంగా లైంగికదాడి చేశాడు. గమనించిన తోటి ప్యాసింజర్లు 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. విషయం పసిగట్టిన డ్రైవర్ మార్గ మధ్యలో బస్సు నుంచి దూకి పారిపోయాడు. అప్రమత్తమైన పోలీసులు బస్సును హైదరాబాద్ తార్నాక ప్రాంతంలో ఛేజ్ చేసి పట్టుకున్నారు. డ్రైవర్ సైదయ్యను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. బాధిత మహిళను వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు సెక్షన్ 64 (1) బీఎస్ఎస్ కింద కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌పై ఇద్దరు యువకుల లైంగికదాడి

వనస్థలిపురంలో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌పై ఇద్దరు స్నేహితులు లైంగికదాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఓ యువతికి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం వచ్చింది. ఈ సందర్భంగా ఆమె సోమవారం రాత్రి తన చిన్ననాటి మిత్రుడు గౌతమ్ రెడ్డి, మరో స్నేహితుడితో కలిసి వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓంకార్‌నగర్‌లో గల బొమ్మరిల్లు బార్ అండ్ రెస్టారెంట్‌కు వచ్చింది. అక్కడ వారు మద్యం సేవించారు. అనంతరం అక్కడే ఉన్న రూంలో మత్తులో ఉన్న యువతిపై ఇద్దరు స్నేహితులు లైంగికదాడి చేశారు. కొంత సమయం తర్వాత స్పృహలోకొచ్చిన యువతి తాను మోసపోయినట్టు గుర్తించి.. తన ఇతర స్నేహితులకు ఫోన్ చేయగా వారు ఆమెను ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. అనంతరం బాధితురాలు వనస్థలిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

పీఎం కిసాన్ లబ్దిదారులపై వేటు

రెండున్నరేండ్లలో 1.54 కోట్ల మంది తొలగింపు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం కిసాన్) లబ్దిదారుల సంఖ్యను కేంద్ర ప్రభుత్వం ఏడాదికేడాది తగ్గిస్తోంది. దాదాపు రెండున్నరేండ్లలో 1,54,20,502 మంది లబ్దిదారులను తొలగించింది. లోక్‌సభలో ఎంపీ అడిగిన ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2021-22లో 10,79,92,336 మంది రైతులు పీఎం కిసాన్‌లో లబ్దిదారులుగా ఉండగా, వారికి రూ.67,147.36 కోట్లు ఇచ్చారు. 2022-23లో వారి సంఖ్య 10,74,35,548కి తగ్గగా, ఇచ్చే మొత్తం కూడా రూ.58,303.25 కోట్లు తగ్గింది. అంటే ఏడాదిలో 5,56,788 మంది లబ్దిదారులను తొలగించారు. అలాగే పీఎం కిసాన్ మొత్తం కూడా రూ.8,844.11 కోట్లు కోత విధించింది. 2023-24లో లబ్దిదారుల సంఖ్య 9,90,30,164 కి తగ్గింది. అంటే ఏడాదిలో 84,05,384 మంది లబ్దిదారులను తొలగించారు. 2024-25 (2024 జులై 22)లో లబ్దిదారుల సంఖ్య 9,25,71,834కి తగ్గింది. ఏడాదిలో 64,58,330 లబ్దిదారులను తొలగించారు.తెలంగాణలో 2020-21లో 36,37,112 మంది లబ్దిదారులు ఉండగా, 2021-22కి 36,53,195 మందికి పెరిగారు. 2022-23లో 47,83,989 మంది ఉండగా, 2023-24లో 44,88,790 మందికి తగ్గారు. 2024-25 (2024 జులై 22) నాటికి లబ్దిదారుల సంఖ్య 41,28,288 మంది ఉన్నారు.

కేరళలో పెను విషాదం

(మొదటిపేజి తరువాయి)

గంటలకు, తిరిగి 4.30 గంటలకు విరిగిపడిన కొండచరియల కింద వందలాది మంది చిక్కుకుపోయారు. ఈ విషాద ఘటన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రెండు రోజుల సంతాప దినాలను ప్రకటించింది. రక్షణ భద్రతా దళానికి చెందిన 200 మంది సైనికులు, ఎన్‌డీఆర్ఎఫ్ దళాలు ముమ్మరంగా సహాయక చర్యలు చేపట్టాయి. కేరళ విపత్తు నిర్వహణ దళాలు, అగ్నిమాపక బృందాలు కూడా సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. అయితే భారీ వర్షాల కారణంగా సహాయక చర్యలకు అంతరాయం కలుగుతోంది. క్షతగాత్రులకు తక్షణ సేవలు అందించడానికి వైద్య బృందాన్ని ఏర్పాటు చేశారు. సులూర్ వైమానిక స్థావరం నుంచి రెండు హెలికాప్టర్లను కూడా పంపారు.



శిథిలాల కింద ఉన్న మృతదేహాలను గుర్తించి బయటికి తీసేందుకు ప్రత్యేక దళాన్ని వినియోగించారు. శిక్షణ పొందిన సైనిక జాగిలాలను కూడా పంపారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అభ్యర్థన మేరకు ప్రత్యేక దళాన్ని పంపాలని కేంద్రం నిర్ణయించింది. ఈ విధ్వంసం కారణంగా జిల్లాలోని చూరాల్‌మలా ప్రాంతం బాగా దెబ్బతిన్నది. అనేక ఆవాసాలు నేలమట్టమయ్యాయి. అట్టమాలా, నూల్‌పుజా గ్రామాలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి. ముండక్కై గ్రామం ఆనవాలు కూడా కన్పించడం లేదు. వాయనాడ్ జిల్లా కేంద్రంలోని ఆస్పత్రి వద్ద మృతుల బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతదేహాలను నేలపై వరుసగా ఉంచడంతో వాటిని గుర్తించేందుకు బంధువులు ఆరాటపడుతున్న దృశ్యాలు అందరినీ కలచివేస్తున్నాయి. వాయనాడ్‌లో 45 శిబిరాలను ఏర్పాటు చేశామని, వాటిలో మూడు వేల మందికిపైగా ఆశ్రయం కల్పించామని ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 118 సహాయ శిబిరాలను ఏర్పాటు చేశామని, వాటిలో 5,500 మందికిపైగా ప్రజలు తలదాచుకుంటున్నారని వివరించారు. 34 మృతదేహాలను గుర్తించామని, 18 మృతదేహాలను బంధువులకు అప్పగించామని ఆయన చెప్పారు. గుర్తుతెలియని మృతదేహాలకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తారు. ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోడీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుండి రెండు లక్షల రూపాయల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేస్తారు. గాయపడిన వారికి యాభై వేల రూపాయల చొప్పున ఇస్తారు. ప్రతిపక్ష నేత, వాయనాడ్ మాజీ ఎంపీ రాహుల్ గాంధీ బాధిత కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. బాధితులను ఆదుకునేందుకు, వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, నష్టపరిహారాన్ని పెంచాలని లోక్‌సభలో ప్రభుత్వాన్ని కోరారు. దీనిని జాతీయ విపత్తుగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. వాయనాడ్, పశ్చిమ కనుమలలో కొండచరియలు



విరిగిపడుతున్న ఘటనలు పెరుగుతున్నాయని అంటూ ఇలాంటి ప్రకృతి వైపరీత్యాల కారణంగా జరిగే నష్టాన్ని సాధ్యమైనంత వరకూ తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. సహాయక చర్యల కోసం సైన్యాన్ని పంపాలని కేరళ ప్రభుత్వం కోరడంతో కేంద్రం ఇన్‌ఫాంట్రీ బెటాలియన్‌కు చెందిన రెండు బృందాలను పంపింది. బాధితులకు సాయం చేయడానికి నౌకాదళానికి చెందిన 30 మంది గజ ఈతగాళ్లను రప్పించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సైనిక దళాల ప్రధానాధికారి జనరల్ ఉపేంద్ర ద్వివేదితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పినరయితో ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా మాట్లాడారు. కేంద్రం నుండి అవసరమైన సహాయాన్ని అందజేస్తామని హామీ ఇచ్చారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కూడా పినరయితో మాట్లాడారు. సీఎం సహాయ నిధుల నుండి ఐదు కోట్లు విడుదల చేయాలని స్టాలిన్ ఆదేశించారు. అగ్నిమాపక సిబ్బంది, వైద్య సిబ్బందిని వెంటనే కేరళ పంపుతున్నట్లు చెప్పారు.

యుద్ధప్రాతిపదికన కేంద్రం సహాయాన్ని అందించాలి

(మొదటిపేజి తరువాయి)

ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్టు ప్రకటనలో తెలిపింది. కేరళ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నిపుణులు, స్థానికుల సహాయంతో భారీ ఎత్తున రెస్క్యూ ఆపరేషన్ల ప్రారంభించిందని తెలిపింది. కేంద్ర ప్రభుత్వం కూడా యుద్ధ ప్రాతిపదికన సహాయ, పునరావాస కార్యక్రమాల కోసం రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ అన్ని విధాలుగా సహాయం అందిస్తుందని ఆశిస్తున్నట్టు పొలిట్ బ్యూరో ఈ ప్రకటనలో తెలిపింది.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

(మొదటిపేజి తరువాయి)

మంగళవారం సీపీఐ(ఎం) జిల్లా ప్లీనరీ జరిగింది. ఈ సందర్భంగా తమ్మినేని హాజరై మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి పూర్తిగా అన్యాయం జరిగిందన్నారు. అయినా బీజేపీ ఎంపీలు నోరు మెదపలేదని, రాష్ట్ర ప్రజలకు వారు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి బడ్జెట్ కేటాయింపులో అన్యాయం చేసిన బీజేపీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలదీయడంతో పాటు నిధుల కోసం ఒత్తిడి పెంచాలని సూచించారు. ప్రజావ్యతిరేక విధానాల్లో బీజేపీపై చేసే పోరాటంలో కాంగ్రెస్ ముందుండాలన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ చేసే న్యాయబద్ధమైన పోరాటాల్లో తాము సహకరిస్తామని తెలిపారు. రాష్ట్రంలో, దేశవ్యాప్తంగా పెరుగుతున్న మతతత్వ బీజేపీ ప్రమాదాన్ని ఎదిరించడంలో ప్రగతిశీల శక్తులు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై పార్టీ శ్రేణులు పోరాటాలు ఉధృతం చేయాలని చెప్పారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై నిధులు కేటాయించకుండా ఉత్తుత్తి మాటలు చెబితే ఉపయోగం లేదని, ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నూతన రేషన్‌కార్డులపై వెంటనే జీవో విడుదల చేయాలని కోరారు.

పేద ప్రజలు ఆక్రమించుకున్న ప్రభుత్వ భూముల్లో వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ విధానాలను కాంగ్రెస్ కూడా అనుసరిస్తే పోరాటాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఎండీ.జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరు బాలరాజు, కల్లూరి మల్లేశం, దోనూరు నర్సిరెడ్డి, దాసరి పాండు, మేక అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేరళ విలయంపై చర్చకు నో

(మొదటిపేజి తరువాయి)

విషాదం జరిగిం దని, కేంద్రం అవసరమైన సహాయం అందించాలని ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే అన్నారు.అయితే ఈ ఘటనపై కేరళకు చెందిన ఎంపీలు తీవ్ర నిరసన వ్యక్తం చేసినప్పటికీ ఛైర్మెన్ చర్చకు అనుమతి ఇవ్వకుండా దాట వేసేందుకు ప్రయత్నించారు. ముఖ్యమంత్రితో ప్రధాని మాట్లాడినట్టు ధన్కర్ తెలిపారు. ఈ దుర్ఘటనతో యావత్ దేశం విషాదంలో మునిగి పోయిందని, ఉదయం నుంచి సహాయక చర్యలు ప్రారంభమయ్యాయని తెలిపారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవసరమైన చర్యలు చేపట్టాయనే అంశంపై చర్చించడానికి ఏమి మిగిలి ఉంది. తమ ఆందోళనను నమోదు చేయడం తప్ప ఇంకేం చేయగలమని కేరళ ఎంపీలతో ధన్కర్ అన్నారు. పెను విషాద ఘటనను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చర్చకు అనుమతించాలని ఎంపీలు డిమాండ్ చేశారు. దీంతో ఈ వ్యవహారానికి సంబంధించి ఎంపీలు మాట్లాడేందుకు ఛైర్మెన్ ధన్కర్ అవకాశం కల్పించారు.

కేంద్ర రక్షణ, హెూం, ఆర్థిక శాఖలు చొరవ తీసుకోవాలి : జాన్ బ్రిట్టాస్

వాయనాడ్‌లో పెను విషాదం చోటుచేసుకుందని, కేంద్రం మేల్కొని పని చేయాలని సీపీఐ(ఎం) నేత జాన్ బ్రిటాస్ కోరారు. కేంద్ర రక్షణ, హెూం, ఆర్థిక శాఖలు ఇందుకు చొరవ తీసుకోవాలని అన్నారు. అవసరమైన ఆర్థిక సహాయం అందించాలని, సహాయక చర్యల కోసం సైన్యాన్ని పంపాలని తెలిపారు. కొండచరియలు విరిగిపడడంతో సుమారు 500 కుటుంబాలు నష్టపోయాయని, బడ్జెట్‌లో ప్రత్యేక వరద సాయం పొందిన రాష్ట్రాల జాబితాలో కేరళను చేర్చాలని ఎంపీలు వి.శివదాసన్, ఎ.ఎ.రహీమ్, పి.సంతోష్ కుమార్, జోస్ కె.మణి తదితరులు కోరారు. దీనిపై కేంద్ర ఆరోగ్య మంత్రి, సభానాయకుడు జేపీ నడ్డా స్పందిస్తూ.. కేరళకు అవసరమైన సహాయాన్ని కేంద్రం అందజేస్తుందని చెప్పారు.

ప్రభుత్వ ఖజానాకు విరాళాల గండి

(మొదటిపేజి తరువాయి)

సంస్థ లు, అసోసియేషన్ ఆఫ్ పర్సన్స్ (ఏఓపీలు), బాడీ ఆఫ్ ఇండివిద్యు వల్స్ (బీఓఐలు), వ్యక్తులు, హిందూ అవిభక్త కుటుంబాలు పన్ను మినహా యింపు కోరవచ్చు. చెక్కులు, ఖాతా లకు బదిలీలు, ఎన్నికలబాండ్లు కూడా వీటిలో ఉన్నాయి. 2022-23లో పన్ను మినహాయింపుల కారణంగా ప్రభుత్వ ఆదాయానికి రూ.3,967.54 కోట్ల గండి పడిందని అంచనా. ఇందులో కార్పొరేట్ పన్ను చెల్లింపుదారులు అందించిన విరాళాలపై సెక్షన్ 80 జీజీబీ కింద ఇచ్చిన మినహాయింపుల కారణంగా ప్రభుత్వం రూ.2,003.43 కోట్ల ఆదాయం కోల్పోయింది. ఈ సెక్షన్ కింద వ్యక్తులు రూ.1,862.38 కోట్లు, కార్పొరేట్ యేతర పన్ను చెల్లింపుదారులు రూ.101.73 కోట్లు మినహాయింపు కోరారు.

జార్ఖండ్‌లో రైలు ప్రమాదం

రాంచీ : జార్ఖండ్‌లో రైలు పట్టాలు తప్పిన ప్రమాదంలో ఇద్దరు మరణించగా, 20 మంది గాయపడ్డారు. చక్రధర్‌పూర్ వద్ద మంగళవారం తెల్లవారు జామున 3:45 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. హౌరా నుంచి ముంబయి వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైలు 18 బోగీలు పట్టాలు తప్పాయి. ఈ ప్రమాద వార్త తెలిసిన వెంటనే అధికారులు అక్కడకు చేరుకుని సహాయక కార్యాక్రమాలు ప్రారంభించారు. జంషెడ్‌పూర్‌కు 80 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రమాదం జరిగింది. రైలుల్లోని 80 శాతం ప్రయాణీకులను బస్సుల ద్వారా చక్రధర్‌పూర్‌కు తరలించారు. మిగిలిన ప్రయాణీకుల కోసం ఒక రెస్క్యూ రైలును ప్రమాద ప్రాంతానికి అధికారులు పంపించారు. ఈ ప్రమాదం కారణంగా ఐదు ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేశారు. మరికొన్ని రైళ్లను దారి మళ్లించారు. చక్రధర్‌పూర్ వద్ద జరిగిన రైలు ప్రమాదానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని జార్ఖండ్‌లోని అధికార పార్టీ జేఎంఎం డిమాండ్ చేసింది. రైల్వే మంత్రి సోషల్ మీడియాలో జెఎంఎంపై రీల్స్ పోస్టు చేయడం మాని, రైల్వే భద్రతపై దృష్టి పెట్టాలని కోరింది. 'ఈ ప్రమాదంలో హేమంత్ సోరెన్‌కు గానీ, ఇండియా వేదికకు గానీ ఎలాంటి హస్తం లేదు. మమ్మల్ని ఇడి, సిబిఐతో ట్రాప్ చేస్తామని బెదిరించవద్దు' అని జెఎంఎం ఎక్స్‌లో పోస్టు చేసింది. ఈ ప్రమాదానికి కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యతని ఎస్‌పి అధ్యక్షులు అఖిలేష్ యాదవ్ విమర్శించారు. ఇప్పటికే పేపర్ లీకేజీల సంఖ్యపై రికార్డు సృష్టించిన కేంద్రం రైల్వే ప్రమాదాల్లో రికార్డు సృష్టించాలని కోరుకుంటుందని అన్నారు. రైల్వే రక్షణ, భద్రత కోసం భారీ బడ్జెట్‌ను ప్రకటించినా ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయని అఖిలేశ్ ప్రశ్నించారు.

నవచిత్రం

అందర్నీ అలరించే శివంభజే




మహేశ్వర్‌రెడ్డి మూలి

గంగా ఎంటర్‌టైనర్‌మైంట్స్ బ్యానర్ మీద అప్సర్ దర్శకత్వంలో అశ్విన్ బాబు హీరోగా, దిగంగనా సూర్యవంశీ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'శివం భజే'. ఈ చిత్రం ఆగస్టు 1న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్మాత మహేశ్వర్ రెడ్డి మూలి మంగళవారం మీడియాతో సినిమా గురించి పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

- హీరో అశ్విన్ బాబు బర్త్ డే సందర్భంగా అని ఈ సినిమాను ఆగస్టు 1న రిలీజ్ చేయడం లేదు. మేం ఒక డేట్ అనుకున్నాం. అది ఆయన బర్త్ డే కావడం యాదృచ్ఛికం. మంచి కంటెంట్‌తో రాబోతున్నాం.
- ఈ కథని ముందుగా నేను విన్నాను. నాకు చాలా నచ్చింది. ఆ తరువాత ఈ కథను అశ్విన్ దగ్గరకు తీసుకెళ్లాం. ఆయనకు కూడా బాగా నచ్చింది. ఐదు నిమిషాల్లోనే ఓకే చెప్పేశారు. ప్రస్తుతం కథను పూర్తిగా రివీల్ చేయలేను. చాలా లేయర్స్ ఉంటాయి. ఇది ఒక జోనర్‌కు మాత్రమే పరిమితం అవుతుందని కూడా చెప్పలేను. ఐదారు జోనర్లు కలిసి తీసిన సినిమాలా ఉంటుంది. అన్ని రకాల అంశాలుంటాయి. అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది. ట్విస్టులను అయితే ఇప్పుడు రివీల్ చేయలేను.
- మ్యూజిక్ డైరెక్టరే ఈ చిత్రానికి హీరో. హిడింబ చూశాక ఆయన్ను తీసుకోవాలని అనుకున్నాం. అద్భుతమైన పాటలు, ఆర్ఆర్ ఇచ్చారు. ఈ మూవీని హైదరాబాద్ చుట్టూనే తీశాం. హీరో వెంకటేష్ ట్రైలర్ చూసి మెచ్చుకున్నారు. కంటెంట్ బాగుంటే ఆడియెన్స్ సినిమా చూస్తారు. టికెట్ రేట్లు తక్కువ పెట్టినా, ఎక్కువ పెట్టినా కూడా సినిమా బాగుందనే మౌత్ టాక్ వస్తేనే సినిమాను చూస్తారు. 'ఐఐటీ కృష్ణమూర్తి' టీమ్‌తో ఓ సినిమాను ప్లాన్ చేస్తున్నా. కార్తికేయతో ఓ సినిమా ఉంది. ఈ సినిమా హిట్ అయితే తమిళంలోనూ రీమేక్ చేస్తాం. ఇప్పటికే హిందీ డబ్బింగ్ రైట్స్ సేల్ అయ్యాయి. ఈ చిత్రం హిట్ అయితే.. రెండో పార్ట్‌ని కూడా ప్లాన్ చేస్తాం.

పవర్‌ఫుల్ కంటెంట్‌తో



రాజ్ తరుణ్ హీరోగా, ఎఎస్-రవికుమార్ చౌదరి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'తిరగబడరసామీ'. మాల్వి మల్హోత్రా కథానాయిక. సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ మీడియా బ్యానర్ పై మల్కాపురం శివకుమార్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం ఆగస్ట్ 2న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో నిర్మాత మల్కాపురం శివ కుమార్ మీడియాతో మాట్లాడుతూ, 'ఈ ప్రాజెక్ట్ 2023లో స్టార్ట్ అయ్యింది. డైరెక్టర్ రవికుమార్ కథ చెప్పగానే నచ్చింది. సింగిల్ సిట్టింగ్‌లో ఓకే చేశాను. ఈ కథకు రాజ్ తరుణ్ యాప్ట్‌గా ఉంటాడని తీసుకున్నాం. రాజ్ తరుణ్ క్లాస్‌గా ఉంటాడు కదా.. ఇందులో వైలెన్స్ కనిపిస్తోంది అని అందరూ అడుగుతున్నారు. ఎవరైనా సిట్యువేషన్ బట్టే బిహేవ్ చేస్తారు. సైలెంట్‌గా ఉన్న పర్సన్‌ని వైలెంట్‌గా మార్చేది పరిస్థితే. ఈ కథలో కూడా అలాంటి పరిస్థితి ఉంటుంది. ఒక మామూలు కుర్రాడిని తన లైఫ్‌లో వచ్చే పరిస్థితులు ఎలా మార్చాయనేది చాలా ఆసక్తికరంగా ఉంటుంది. రాజ్ తరుణ్ చాలా అద్భుతంగా నటించారు. భార్యా భర్తలు మూడు ముళ్ళ బంధానికి ఏ విధంగా కట్టుబడి ఉండాలనడానికి నిదర్శనం ఈ సినిమా. కంటెంట్ చాలా బావుంటుంది. అందరికీ నచ్చుతుంది. ఇందులో మన్నారా నెగిటివ్ ఫీమేల్ లీడ్ చేస్తుంది. సినిమా అంతా ఉంటుంది. ఈ పాత్రకు తను యాప్ట్. చాలా అద్భుతంగా పోషించింది. దర్శకుడు రవికుమార్ చాలా హార్డ్ వర్క్ చేశారు. చెప్పినదాని కంటే అద్భుతంగా తీశారు. బిజినెస్ పరంగా చాలా బాగా వర్క్ అవుట్ అయ్యింది. అందుకే హ్యాపీగా రిలీజ్ చేస్తున్నాం.బాలీవుడ్‌లో చేస్తున్న కథ చాలా నచ్చింది. నా స్నేహితుడు రాజ్ డైరెక్షన్ చేస్తున్నారు. అలాగే 'రాహు కేతు' అనే వెబ్ సిరీస్ కూడా చేస్తున్నాం. దీనితోపాటు తిరుపతి బాలాజీపై ఒక వెబ్ సిరీస్ నిర్మాణంలో ఉంది. జేడీ చక్రవర్తి, నరేష్ అగస్త్య, సీరత్ కపూర్‌తో తెలుగులో ఓ సినిమా జరుగుతోంది. ఈ సినిమా ద్వారా శ్రవణ్ అనే దర్శకుడిని పరిచయం చేస్తున్నాం' అని చెప్పారు.

మ్యూజిక్ సిట్టింగ్స్‌లోవిక్రమ్ కే దాస్

ఎస్ఎస్ఎల్ఎస్ క్రియేషన్స్ పతాకంపై నిర్మాత కంచర్ల అచ్యుత రావు నిర్మించబోయే 8వ చిత్రం 'విక్రమ్ కే దాస్'. ఈ సినిమా మ్యూజిక్ సిట్టింగ్స్ జరుగు తున్నాయి.

అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే రీతిలో కథ, కథనంతో ఈ సినిమాని తెరకెక్కించబోతున్నారు. నిర్మాత కంచర్ల అచ్యుత రావు, దర్శకుడు బాలు పొలిచెర్ల ప్రత్యేక శ్రద్ధతో మ్యూజిక్ సిట్టింగ్స్‌లో పాల్గొంటున్నారు. సంగీత దర్శకుడు పృథ్వి వీనుల విందుగా సంగీతం అందిస్తున్నారు అని చిత్ర యూనిట్ నమ్మకంగా చెబుతోంది. యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌తో రూపొందు తున్న చిత్రం అయినప్పటికీ సంగీతానికి కూడా మంచి ప్రాధాన్యత ఉంటుందని దర్శక, నిర్మాతలు చెబుతున్నారు.

ఈ బ్యానర్ మీద ఇప్పటికే 'ఉపేంద్ర గాడి అడ్డా' సినిమా విడుదలై, చక్కని విజయం అందుకుంది. కాగా, రెండవ సినిమాగా 'కంచర్ల' వచ్చే నెలలోనే విడుదల కానుంది. ఈ నేపథ్యంలో 8వ చిత్రంగా 'విక్రమ్ కే దాస్' సినిమాతో హీరో కంచర్ల ఉపేంద్ర మాస్ ఇమేజ్ సంపాదించడం ఖాయం అంటున్నారు. ఈ బ్యానర్ మీద ఒకేసారి ఎనిమిది సినిమాల నిర్మాణం జరగడం ఒక రికార్డుగా చెప్పుకుంటున్నారు.



పారిస్‌లో మను బాకర్ చరిత్ర సృష్టించింది. ఒలింపిక్ చరిత్రలోనే భారత్ ముందునెన్నడూ ఎరుగుని రికార్డును మను బాకర్ బద్దలుకొట్టింది. ఒకే ఒలింపిక్స్‌లో ఏకంగా రెండు మెడల్స్ సాధించిన ఏకైక భారత అథ్లెట్‌గా చరిత్ర పుటల్లో నిలిచింది. మహిళల 10మీ ఎయిర్ రైఫిల్‌లో వ్యక్తిగత కాంస్యం సాధించిన మను బాకర్.. మంగళవారం 10మీ ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో సరబ్జోత్ సింగ్‌తో కలిసి బ్రాంజ్ మెడల్ సొంతం చేసుకుంది. 2024 ఒలింపిక్స్‌లో భారత్ ఖాతాలో పడిన రెండు కాంస్య పతకాలు మను బాకర్ సాధించినవే కావటం విశేషం.

మను చరిత్ర

పారిస్ 2024 ఒలింపిక్స్

- పారిస్‌లో రెండో కాంస్యం నెగ్గిన మను బాకర్
- మిక్స్‌డ్ టీమ్‌లో సరబ్జోత్‌తో కలిసి పతక ప్రదర్శన

నవతెలంగాణ-పారిస్ :

యువ షూటర్ మను బాకర్ (22) పారిస్‌లో పతకాల వేట సాగిస్తోంది. మూడు రోజుల వ్యవధిలో మను బాకర్ ఏకంగా రెండు పతకాలు సాధించింది. మంగళవారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగం ఫైనల్లో మను బాకర్, సరబ్జోత్ సింగ్ జోడీ గురి అదిరింది. అర్హత రౌండ్‌లో మెప్పించి నేరుగా కాంస్య పతక పోరుకు చేరుకున్న మను బాకర్, సరబ్జోత్ సింగ్ 16-10తో దక్షిణ కొరియా షూటర్లపై ఘన విజయం సాధించారు. మూడో స్థానం కోసం జరిగిన పోటీలో విజయం సాధించి కాంస్య పతకం సొంతం చేసుకున్నారు. ఈ విభాగంలో సెర్బియా స్వర్ణం సాధించగా, టర్కీ రజత పతకం ఖాతాలో వేసుకుంది.

సూపర్ జోడీ : లింగ సమానత్వం కోసం ఇటీవల ప్రవేశపెట్టిన మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్ భారత్‌కు పతకాల పంట పండించింది. 12 ఏండ్లుగా షూటింగ్‌లో ఒలింపిక్ మెడల్ కోసం నిరీక్షిస్తున్న భారత్‌కు మను బాకర్ మూడు రోజుల్లోనే రెండు పతకాలు అందించింది. కాంస్య పతక పోరులో 13 సెట్ల పోటీలో మనోళ్లు 8 సెట్లలో పైచేయి సాధించారు. తొలి సెట్‌లో మను బాకర్ 10.2 స్కోరు చేయగా.. సరబ్జోత్ సింగ్ 8.6 స్కోరుతో గురి తప్పాడు. ఈ సెట్‌ను భారత్ కోల్పోయింది. కానీ ఆ తర్వాత వరుసగా నాలుగు సెట్లను మను బాకర్, సరబ్జోత్ సింగ్ గెల్చుకున్నారు. 21-2-19.9, 20.8-19.8, 20.7-20.5, 20.1-19.5తో లక్ష్యంపై గన్ ఎక్కుపెట్టారు. ఆ తర్వాత దక్షిణ కొరియా షూటర్లు గట్టి పోటీ ఇచ్చినా.. మరో నాలుగు సెట్లలో పైచేయి సాధించిన మనోళ్లు 16-10తో గెలుపు గీత తాకారు.

దక్షిణ కొరియా షూటర్లు లీ, జిన్‌లు భారత షూటింగ్ జోడీకి గట్టి పోటీ ఇచ్చారు. మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో ప్రతి షూట్‌కు ఫలితం మారటంతో.. ఆరంభంలో సరబ్జోత్ సింగ్ చేసిన తప్పిదం పతక అవకాశాలను దెబ్బతీయలేదు. ఇప్పటికే పోటీపడిన రెండు ఈవెంట్లలో పతకాలు సాధించిన మను బాకర్ మరో మెడల్ రేసులో నిలిచింది. మహిళల 25 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో తెలుగు తేజం ఇషా సింగ్‌తో కలిసి పతక వేట సాగించనుంది.

క్వార్టర్స్‌లో సాత్విక్, చిరాగ్

ఐర్లాండ్‌పై హాకీ ఇండియా గెలుపు



పారిస్ (ఫ్రాన్స్) : భారత బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్స్ సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్ శెట్టి జోడీ పురుషుల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్నారు. గ్రూప్-సిలో వరుసగా రెండో విజయం సాధించిన సాత్విక్, చిరాగ్ జోడీ గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచారు. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో వరల్డ్ నం.7 జోడీ ఫజర్, రియాన్ (ఇండోనేషియా)పై 21-13, 21-13తో వరుస గేముల్లో అలవోక విజయం సాధించారు. బ్యాడ్మింటన్ మెన్స్ డబుల్స్‌లో క్వార్టర్‌ఫైనల్ మ్యాచులు గురువారం నుంచి ఆరంభం కానున్నాయి. మహిళల డబుల్స్‌లో తనీశ క్రాస్టో, అశ్విని పొన్నప్ప జోడీ నిరాశపరిచింది. వరుసగా మూడో ఓటమితో ఒలింపిక్స్ నుంచి నిష్క్రమించింది. 15-21, 10-21తో ఆసీస్ జోడీ చేతిలో ఓడిన అశ్విని, క్రాస్టోలు గ్రూప్‌లో అట్టడుగు స్థానానికి పరిమితమయ్యారు.

మెరిసిన హర్మన్‌ప్రీత్ : భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ డబుల్ గోల్స్‌తో కదం తొక్కాడు. ఒలింపిక్స్ హాకీ గ్రూప్-బిలో భారత్‌కు మరో విజయాన్ని అందించాడు. మంగళవారం ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 2-0తో విజయం సాధించింది. హర్మన్‌ప్రీత్ సింగ్ 11, 19వ నిమిషాల్లో పెనాల్టీ స్పాట్, పెనాల్టీ కార్నర్ నుంచి గోల్స్ కొట్టాడు. పారిస్ ఒలింపిక్స్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్‌కు ఇది నాల్గో గోల్ కావటం విశేషం. వరల్డ్ నం.6 భారత్ మ్యాచ్‌లో ఎక్కువ శాతం ఆధిపత్యం చూపించింది. ఈ విజయంతో గ్రూప్-బిలో భారత్ అగ్రస్థానానికి చేరుకుంది.

మెరిసిన బజన్ కౌర్ : భారత మహిళా ఆర్చర్ బజన్ కౌర్ వ్యక్తిగత విభాగంలో ఆకట్టుకునే ప్రదర్శన చేసింది. పోలాండ్ ఆర్చర్‌పై 6-0తో విజయం సాధించి ముందంజ వేసింది. అంతకుముందు ఇండోనేషియా ఆర్చర్‌పై బజన్ కౌర్ 7-3తో విజయం సాధించింది. అంకిత తొలి రౌండ్లోనే పరాజయం పాలైంది.

2013 చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలి

ఆర్బిట్రేషన్ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలి

- మొదటి విడత రైతులకూ నష్టపరిహారం పెంచివ్వాలి :తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నంద్యాల నరసింహారెడ్డి



'భారత్‌మాల' భూనిర్వాసితుల ర్యాలీ, ధర్నా

నవతెలంగాణ - జోగులాంబ గద్వాల

భారత్ మాల రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులందరికీ 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం జోగులాంబ గద్వాలలో స్థానిక వాల్మీకి కమ్యూనిటీ హాల్లో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జికె.ఈదన్న అధ్యక్షతన నిర్వహించిన నిర్వాసిత రైతుల సదస్సులో నంద్యాల పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ బైటాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా నంద్యాల నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. 2013 భూసేకరణ చట్టం ప్రకారం.. భూమికి బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధరకు అదనంగా నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులందరితో సమావేశాన్ని ఏర్పాటు చేసి వారి అభిప్రాయ సేకరణ మేరకే భూమి తీసుకోవాలని, కానీ రైతులను భయభ్రాంతులకు గురిచేసి భూమిని లాక్కున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూములతోపాటు బావులు, బోర్లు, పైపులైన్లు, చెట్లు కోల్పోయిన రైతులకు కూడా నష్టపరిహారం పెంచి ఇవ్వాలని చట్టం చెబుతున్నదని, కానీ ఇవేమీ పాటించకుండా రైతుల జీవనాధారమైన భూమిని లాక్కొని నిరాశ్రయులను చేస్తున్నారని అన్నారు. భూములు కోల్పోయిన రైతులకు ఆర్బిట్రేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేసి రెండో విడత భూసేకరణ సందర్భంగా ఇచ్చిన అవార్డు ప్రకారం మొదటి విడత భూములు కోల్పోయిన రైతులకు కూడా నష్టపరిహారం పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఆరు మండలాల పరిధిలోని 19 గ్రామాల్లో రైతుల నుంచి రెండు విడతలుగా దాదాపు 800 ఎకరాల భూమి సేకరించి.. వారికి తగిన నష్టపరిహారం ఇవ్వకుండా ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిప్పడం సరికాదన్నారు. రైతుల పొలాలకు వెళ్లేందుకు భారత్ మాల రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్లు వేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిడ్జిలను కూడా చాలా తక్కువ ఎత్తులో నిర్మించారని, దీనివల్ల రైతుల వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుందని, అందువల్ల ఎత్తు పెంచి బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

కలెక్టర్ స్పందిస్తూ.. నష్టపరిహారం పెంచి ఇవ్వడం కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని, నెల లోపల రైతులందరికీ నష్టపరిహారం వస్తుందని తెలిపారు. సర్వీస్ రోడ్ల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. రైతులు కోల్పోయిన బావులు, బోర్లు, పైపులైన్లు, చెట్లకు అధికారుల నుంచి రిపోర్టులు తెప్పించుకొని పరిశీలిస్తామన్నారు. ఆ తర్వాత రైతుల ధర్నా వద్దకు సెక్షన్ సూపరింటెండెంట్ నరేష్ వచ్చి కలెక్టర్ తరపున హామీ ఇచ్చారు. అనంతరం రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ.. నెలరోజుల లోపల సమస్యలు పరిష్కారం కానిచో మళ్లీ ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొంతల చంద్రారెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి డి.బాల్ రెడ్డి, కర్ణాటక ప్రాంత రైతు సంఘం రాయచూరు జిల్లా అధ్యక్షులు వీరన్న గౌడ, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ.వెంకటస్వామి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పేరు నరసింహ, గట్టన్న, వివిధ మండలాల రైతులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

బొగ్గు బ్లాకులపై అసెంబ్లీలో తీర్మానం చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిని రక్షించటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి కేటాయించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి నివేదిక పంపాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. బెల్లంపల్లిలో ప్రారంభమైన సింగరేణి పరిరక్షణ యాత్ర మంగళవారం శ్రీరాంపూర్‌కు చేరుకుంది. సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, పైళ్ల ఆశయ్య, సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావుతో కలిసి యాత్ర ను కొనసాగిస్తున్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పీ 3, 3ఏ, వర్క్‌షాప్, శ్రీరాంపూర్ ఉపరితల గనిలో గేట్ మీటింగ్, నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించి కార్మికులను చైతన్య పరిచారు. కార్మికులతో మమేకమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీసీసీ నుంచి శ్రీరాంపూర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. శ్రీరాంపూర్ బస్టాండ్ ఏరియాలోని సింగరేణి కార్మికుని విగ్రహానికి పూలమాల వేశారు.

ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. సింగరేణిలో కొత్త బొగ్గు బ్లాకులు సింగరేణికి కేటాయించకుంటే రానున్న మూడు సంవత్సరాల్లో బావులు మూతపడి మంచిర్యాల పట్టణం ఎడారిగా మారుతుందన్నారు. సింగరేణి ప్రాంత ప్రజల మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందని తెలిపారు. ప్రత్యక్షంగా సుమారు 40వేల మంది పర్మినెంట్, సుమారు 25వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు, పరోక్షంగా లక్షలాదిమంది పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుందని చెప్పారు. గత ప్రభుత్వంలో రెండు బొగ్గు బ్లాక్‌లను వేలం వేశారని, ఆ వ్యతిరేకతతో సింగరేణి ప్రాంతాల్లో కార్మికులు బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పి కాంగ్రెస్‌ను గెలిపించుకున్నారని అన్నారు. ఇప్పుడు శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ను వేలం వేస్తుంటే కాంగ్రెస్ చూస్తూ ఉంటోందని, వారికి కూడా కార్మికులు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. సింగరేణి విద్యుదుత్పత్తి చేసి యూనిట్ రూ.4కు ఇస్తుంటే, ప్రయివేట్ సంస్థలు రూ.18కు అమ్ముతున్నాయని తెలిపారు.

సింగరేణి విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్వంద్వ వైఖరి విడనాడాలని, సంస్థను ప్రయివేటుపరం చేయబోమని చెబుతూనే, మరోపక్క బొగ్గు బ్లాక్‌లను వేలం వేయడం అమానుషమని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పెద్దపల్లి జిల్లాలో పర్యటించిన సమయంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి.. గనులను ప్రయివేటుపరం చేయబోమని పార్లమెంట్‌లో చెప్పారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం సింగరేణిని ప్రయివేటుపరం చేయబోమంటూనే వేలంపాటలో పాల్గొనడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు నాలుకల ధోరణితో కార్మికులను, ప్రజలను మభ్యపెడుతున్నాయని విమర్శించారు. కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సింగరేణి సుమారు రూ.49వేల కోట్లు కేంద్రానికి డివిడెంట్ రూపంలో చెల్లించిందని, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం రూ.30వేల కోట్లు సింగరేణికి బకాయి పడి ఉందని వివరించారు. ఇంత చేసినా కార్మికుల శ్రమతో సింగరేణి ప్రతి సంవత్సరం రూ.2నుంచి 3వేల కోట్ల లాభాల్లో ఉందని అన్నారు. ఇప్పటికైనా గతంలో ప్రయివేట్‌పరం చేసిన కోయగూడెం, సత్తుపల్లి బ్లాక్‌లను సింగరేణికి అప్పగిస్తూ మిగతా గనుల వేలాన్ని ఆపాలని, లేనిపక్షంలో కార్మికులందరినీ ఐక్యం చేసి పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సింగరేణి పరిరక్షణ యాత్రలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోమాస ప్రకాష్, నాయకులు దుంపల రంజిత్ కుమార్, దూలం శ్రీనివాస్, గోమాస అశోక్, మీడివెల్లి రాజ్‌కుమార్, పాయిరాల రాములు, మహేష్, మోహన్, సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, కార్యదర్శి అంబాల శ్రీనివాస్, కోశాధికారి చంద్రశేఖర్, చీఫ్ ఆర్గనైజర్ వెంగళ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మిడివెల్లి శ్రీనివాస్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ముట్టడికి సమగ్ర శిక్ష ఉద్యోగుల యత్నం



- ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్
- సీఎం మాట నిలబెట్టుకోవాలని నినాదాలు
- పోలీసులు, ఉద్యోగుల మధ్య తీవ్ర వాగ్వాదం
- పలువురు ఉద్యోగుల అరెస్ట్

నవతెలంగాణ- హిమాయత్ నగర్/ సుల్తాన్‌బజార్

సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, బేసిక్ పే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. జిల్లాల నుంచి వందలాది మంది ఉద్యోగులు, నాయకులు తరలివచ్చి అసెంబ్లీకి ముట్టడికి బయల్దేరగా.. వారిని ఎక్కడికక్కడ పోలీసులు అడ్డుకున్నారు. దాంతో వారికి, ఉద్యోగులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఆందోళన చేస్తున్న కొంత మందిని పోలీసులు అరెస్టు చేసి పలు పోలీస్ స్టేషన్లకు తరలించారు. 2023 సెప్టెంబర్‌లో సమ్మె చేసిన సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులకు.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రెగ్యులర్ చేసి బేసిక్-పే ఇస్తామని అప్పటి టీపీసీసీ అధ్యక్షులు, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి తమకు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుండిగల్ యాదగిరి, ప్రధాన కార్యదర్శి జి.ఝాన్సీ సౌజన్య మాట్లాడుతూ.. విద్యాశాఖ సమగ్ర శిక్ష విభాగంలో అంకిత భావంతో పని చేస్తున్న ఒప్పంద ఉద్యోగులకు కనీస ఉద్యోగ భద్రత లేదన్నారు. అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటున్న ఉద్యోగులందరినీ వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, అప్పటి వరకు బేసిక్-పే (మినిమమ్ టైం స్కేల్) కల్పించాలని డిమాండ్ చేశారు.

ప్రతి ఉద్యోగికీ జీవిత బీమా రూ.10 లక్షలు, ఆరోగ్య బీమా రూ.5 లక్షల సౌకర్యం కల్పించాలని కోరారు. పీటీఐలకు మిగతా ఎస్ఎస్ఏ ఉద్యోగుల మాదిరిగా 12 నెలల వేతనం ఇవ్వాలని, ఎస్-ఎస్ఏ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ చేస్తున్న వారికి బెనిఫిట్స్ కింద రూ.20 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, ఉద్యోగులు జంగం సుమన్, సురేందర్, సహదేవ్, రమేష్, మల్లేష్, చందు, జడల రవీందర్, జానకీరామ్, మహేందర్, సూర్య కిరణ్, రాజేందర్, మంజుల, సంధ్యారాణి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At Navatelangana Printers Private Limited, Laxmidas Bhavan, Phase-2, Plot No. 8&9, Surana X Road, Near Mint Compound, Ida, Charlapally, Medchal-Malkajgiri District-500051, Published At Navatelangana Printers Private Limited, Laxmidas Bhavan, Phase-2, Plot.8&9, Surana X Road, Near Mint Compound, Ida, Charlapally, Medchal-Malkajgiri District-500051, Telangana State, Editor : R.Sudha Bhaskar. TELTEL/2015/60815